తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
# తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం

సంపుటి : 02 సంచిక 329 హైదరాబాద్ : సంపాదకులు : గున్నాల అనిల్‌రెడ్డి శుక్రవారం 16-5-2025 పేజీలు : 12 వేల : 5

Published from: Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, And Bhadradri Kothagudem, Vijayavada, Vishakapatnam, Kurnool, Anantapur




# కాళేశ్వరానికి మాస్టర్ ప్లాన్

## ఆలయ అభివృద్ధికి రూ.200 కోట్లు.. గోదావరి పుష్కరాల్లో శాశ్వత పనులు

### సరస్వతీ పుష్కరాల్లో సీఎం రేవంత్

### పుష్కర స్నానమాచరించి ముక్తీశ్వరుడికి పూజలు

### వైభవంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం



**భూపాలపల్లి, మే 15 :**
దక్షిణ కాశీగా పేరొందిన కాళేశ్వరం అభివృద్ధికి ఎంత ఖర్చయినా నిధులు మంజూరు చేస్తామని, వెంటనే మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణీ సంగమం వద్ద గురువారం ప్రారంభమైన సరస్వతీ నదీ పుష్కరాలకు సీఎం హాజరయ్యారు. పుష్కర స్నానమాచరించి, ముక్తీశ్వరస్వామికి అభిషేకం చేయడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ కాళేశ్వరం అభివృద్ధికి వెంటనే మాస్టర్ ప్లాన్ తయారుచేసి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కాళేశ్వరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడం కోసం మంత్రి శ్రీధర్‌బాబు రూ.100 కోట్లు అడిగారని, రూ.200 కోట్లు అయినా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని, ఇక్కడ గోదావరి పుష్కరాల పనుల్లో భాగంగా ఆలయానికి సంబంధించి శాశ్వత అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. గోదావరి నది ఈ ప్రాంతానికి ఆశీర్వాదం లాంటిదన్నారు. పుష్కరాల్లో స్నానం చేయడం అంటే చేసిన తప్పులు కడుక్కోవడమేనని, తప్పులు చేసినా, చేయకున్నా పుష్కర స్నానం చేసి మంచి తపనతో ముందుకు వెళ్లాలన్నారు. ఒకప్పుడు దేశ ఆర్థిక గతిని మార్చడంలో కీలక పాత్ర పోషించిన పీవీ నరసింహారావులాగే ప్రస్తుతం తెలంగాణ అభివృద్ధి కోసం పెట్టుబడులు తేవడంలో తనకు చేదోడు వాదోడుగా ఉంటున్న మంత్రి శ్రీధర్‌బాబు ఈ ప్రాంతం వ్యక్తి కావడం అదృష్టమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ అభివృద్ధికి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తేవడంలో శ్రీధర్‌బాబు తనకు చేదోడు వాదోడుగా ఉన్నారని చెప్పారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు కూడా మాట్లాడారు. గురువారం సాయంత్రం 4.14 గంటలకు హెలికాప్టర్‌లో కాళేశ్వరం చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... నేరుగా ప్రధాన ఘాట్‌కు చేరుకుని 15 అడుగుల సరస్వతీ మాత ఏకశిలా విగ్రహాన్ని ఆవిష్కరించారు. కొత్తగా నిర్మించిన జ్ఞాన సరస్వతీ ఘాట్‌ను ప్రారంభించారు. వీఐపీ ఘాట్‌కు సరస్వతీ ఘాట్‌గా నామకరణం చేశారు. అనంతరం పుష్కర స్నానమాచరించి, సరస్వతీ మాతకు ప్రభుత్వం తరఫున చీర, సారెను సమర్పించారు. కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో మహాదేవుని దర్శించుకుని, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సరస్వతి నదీ ఒడ్డుకు చేరుకుని మహానదీహారతిలో పాల్గొన్నారు.

**సరస్వతీ పుష్కరాలకు వచ్చిన తొలి సీఎం రేవంత్**
సరస్వతీ నది పుష్కర చరిత్రలో సీఎం పాల్గొనడం ఇదే తొలిసారి. 2013లో ఈ పుష్కరాల కోసం నాటి ప్రభుత్వం కేవలం రూ.14 లక్షలే కేటాయించింది. ప్రస్తుత పుష్కరాల కోసం సీఎం రేవంత్ 37 కోట్లు కేటాయించటంతో పాటు సరస్వతీమాత ఏకశిలా విగ్రహం, పుస్తక ఆకృతి విగ్రహాన్ని గోదావరి నది ఒడ్డున ఏర్పాటు చేశారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పుష్కర ఘాట్‌లను భారీ హంగులతో నిర్మించారు.

### వారాంతంలో చెట్లు నరకడంలో

# ఆంతర్యమేంటి?

**ముందస్తు ప్రణాళికతోనే చేసినట్లు ఉంది**

**కంచ గచ్చిబౌలి భూముల కేసులో మరోసారి సుప్రీంకోర్టు ఆగ్రహం**




**న్యూఢిల్లీ, మే 15:** "వీకెండ్ చూసి (వారాంతంలో) చెట్లు నరకడంలో ఆంతర్యమేంటి? డజను బుల్డోజర్లతో 1000 చెట్లను నరికేశారు. దీనిని ముందస్తు ప్రణాళికతోనే చేసినట్లు ప్రాథమికంగా కనిపిస్తోంది. అక్కడ చెట్ల నరికివేతకు పర్యావరణ అనుమతులు తీసుకున్నారా? లేదా? అధికారుల చర్యలను సమర్థించాలని చూడొద్దు" అంటూ కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వంపై సర్వోన్నత న్యాయస్థానం మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. హైదరాబాద్ యూనివర్సిటీ పరిసరాల్లో అడవిని పునరుద్ధరిస్తారో లేదో చెప్పాలని నిలదీసింది. లేకపోతే, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సహా బాధ్యులైన అధికారులందరూ అక్కడే తాత్కాలికంగా నిర్మించే జైలుకు వెళతారని పునరుద్ఘాటించింది. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిలో రాష్ట్ర ప్రభుత్వం చెట్లు కొట్టేసిన అంశాన్ని ఏప్రిల్ 3న సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించిన విషయం తెలిసిందే. దీనిని భారత ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలో జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహలతో కూడిన ధర్మాసనం గురువారం మరోసారి విచారించింది. తొలుత.. తెలంగాణ ప్రభుత్వం తరఫున అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు గత ఆదేశాలను అనుసరించి కంచె గచ్చిబౌలిలో పనులన్నీ ఆపేశామని, వైల్డ్ లైఫ్ సంరక్షణ చర్యలు కొనసాగిస్తున్నామని చెప్పారు. సీఈసీ నివేదిక బుధవారం రాత్రే తమకు అందిందని, దానికి బదులిచ్చేందుకు సమయం కావాలని విజ్ఞప్తి చేశారు.

## పక్కృతి విధ్వంసానికి సీఎందే బాధ్యత: కేటీఆర్



**హైదరాబాద్, మే 15:**
కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ప్రకృతి విధ్వంసం, రూ.10 వేల కోట్ల అవినీతికి సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై గురువారం విచారణ సందర్భంగా అధికారులపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. రేవంత్ రెడ్డి మూర?త్వంతో అధికారులు జైలుశిక్ష అనుభవించే పరిస్థితి నెలకొందన్నారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో రేవంత్‌రెడ్డి తప్పులను ఒప్పుకుని, అక్కడ బుల్డోజర్లతో ధ్వంసం చేసిన అడవులను పునరుద్ధరించాలని, లేదంటే ఆయనకూ కోర్టు శిక్షలు తప్పవన్నారు.


### ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు

## జైషే ఉగ్రవాదుల హతం



శ్రీనగర్/ ట్రాల్, మే 15: జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నిషేధిత జైషే మహ్మద్ సంస్థకు చెందిన ముగ్గురు కరుడుగట్టిన ఉగ్రవాదులు హతమయ్యారని పోలీసులు తెలిపారు. పుల్వామా జిల్లా అవంతిపొరాలోని ట్రాల్ పట్టణానికి సమీపంలోని నాదిర్ గ్రామంలో ఉగ్రవాదులున్నారని నిఘా వర్గాలకు ఉప్పందింది. దీంతో ఉగ్రవాదులు దాక్కున్న ఆ గ్రామాన్ని భద్రతాదళాలు చుట్టుముట్టి గాలింపు చేపట్టాయి. నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో దాక్కున్న ఉగ్రవాదులు భద్రతాబలగాలను చూసిన ఉగ్రవాదులు కాల్పులకు దిగినట్లు డ్రోన్ చిత్రీకరించిన వీడియోలో కనిపిస్తోంది. దీంతో భద్రతాదళాలు ఆత్మరక్షణార్థం జరిపిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు మరణించారు. వారిని జైషే మహ్మద్ సంస్థ ఉగ్రవాదులు అసిఫ్ అహ్మద్ షేక్, అమీర్ నజీర్ వనీ, యవార్ అహ్మద్ భట్‌గా గుర్తించిన భద్రతా దళాలు.. ఆ ముగ్గురూ పుల్వామా జిల్లా వాసులేనని తెలిపాయి.

## 19న రాష్ట్ర క్యాబినెట్ సమావేశం?



**హైదరాబాద్, మే 15:** రాష్ట్ర క్యాబినెట్ సమావేశం ఈ నెల 19న జరిగే అవకాశం ఉంది. జూన్ 2న నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవంపై ఈ భేటీలో చర్చించనున్నారని సమాచారం. నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద ఎంత మంది అర్హులవుతారు, ఎంతమేర నిధులు అవసరమవుతాయన్న వివరాలపై క్యాబినెట్ సమావేశంలో చర్చించే అవకాశాలున్నాయి. కంచ గచ్చిబౌలి భూముల విషయంపై కూడా మంత్రిమండలి చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# రాష్ట్రపతికి సుప్రీంకోర్టు గడువు విధించడమా?

### రాజ్యాంగంలోనే అటువంటి నిబంధన లేనప్పుడు తీర్పు ఎలా ఇస్తారు?.. అది ఎలా చెల్లుబాటు?

**200, 201 అధికరణాల కింద గవర్నర్, రాష్ట్రపతికి బిల్లుల ఆమోదం విషయంలో అధికారాలుంటాయి**

**కాలపరిమితిపై రాజ్యాంగం గడువు విధించలేదు**

**అలాంటప్పుడు సుప్రీంకోర్టు ఎలా విధిస్తుంది?**

**14 ప్రశ్నలు సంధించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

**ఆర్టికల్ 143(1) కింద సుప్రీంకోర్టును వివరణ కోరిన రాష్ట్రపతి**



న్యూఢిల్లీ, మే 15: రాష్ట్రాల బిల్లులు ఆమోదించే విషయంలో గవర్నర్, రాష్ట్రపతికి గడువు విధిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశ్నించారు. శాసనసభలు ఆమోదించిన బిల్లులకు గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై సుప్రీంకోర్టు గత నెల 8న సంచలన తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇలాంటి అంశాలపై 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలంటూ గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. ఈ తీర్పును రాష్ట్రపతి ప్రశ్నించారు. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు.. సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని? అది ఎలా చెల్లుబాటు అవుతుందని ముర్ము అడిగారు. రాజ్యాంగంలోని 143(1) అధికరణం ప్రకారం తనకున్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించుకొన్న రాష్ట్రపతి ముర్ము.. ఈ మేరకు సుప్రీంకోర్టును వివరణ కోరారు. రాజ్యాంగంలోని 200 అధికరణం కింద బిల్లులకు ఆమోదం తెలపడం, నిలిపి ఉంచడం, రాష్ట్రపతి పరిశీలనకు పంపే ప్రక్రియలో గవర్నర్లకు కొన్ని అధికారాలు ఉంటాయి. అదేసమయంలో ఈ ప్రక్రియకు గడువు కూడా ఏమీ లేదు. అలాగే 201 అధికరణం ప్రకారం రాష్ట్రపతికి కూడా అధికారాలు ఉంటాయి. ఆ అధికరణంలో కూడా గడువు విధించలేదు. ఈ నేపథ్యంలోనే బిల్లుల ఆమోదానికి గవర్నర్, రాష్ట్రపతికి సుప్రీంకోర్టు గడువు విధించడంపై ముర్ము 14 ప్రశ్నలు సంధించారు. ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరారు. ఈ అంశంపై స్పందించేందుకు సుప్రీంకోర్టు నూతన సీజేగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్ త్వరలోనే రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

**రాష్ట్రపతి సుప్రీంకోర్టును అడిగిన ప్రశ్నలివే..**

1. గవర్నర్ వద్దకు బిల్లులు వచ్చినప్పుడు ఆర్టికల్ 200 కింద ఆయనకు ఉండే రాజ్యాంగపరమైన అవకాశాలు ఏంటి?
2. ఆ అవకాశాల విషయంలో మంత్రివర్గం సలహాలకు గవర్నర్ కట్టుబడి ఉండాలా?
3. ఆర్టికల్ 200 కింద గవర్నర్ విచక్షణ మేరకు తీసుకునే నిర్ణయంపై న్యాయ సమీక్ష చేయొచ్చా?
4. ఆర్టికల్ 200 కింద గవర్నర్ తీసుకునే నిర్ణయాలపై న్యాయ పరిశీలన చేయకుండా ఆర్టికల్ 361 ప్రకారం పూర్తిగా నిషేధించవచ్చా?
5. ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్లకు అధికారాలు ఉండగా.. రాజ్యాంగపరంగా ఎలాంటి గడువూ విధించకపోయినా.. బిల్లుల ఆమోద ప్రక్రియలో వారికి కోర్టులు గడువులు విధించవచ్చా? ఏ ప్రక్రియను అనుసరించాలనే విషయాన్ని సూచించవచ్చా?
6. ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి విచక్షణాధికారాలపై న్యాయ సమీక్ష చేయొచ్చా?
7. రాష్ట్రపతికి కోర్టులు గడువు విధించవచ్చా? ఆర్టికల్ 201 ప్రకారం విచక్షణాధికారాల వినియోగానికి సంబంధించిన ప్రక్రియను సూచించవచ్చా?
8. గవర్నర్ రిజర్వ్ చేసిన బిల్లులపై నిర్ణయం తీసుకునే విషయంలో రాష్ట్రపతి తప్పనిసరిగా ఆర్టికల్ 143 ప్రకారం సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని తీసుకోవాలా?
9. అధికారికంగా చట్టం అమల్లోకి రాకముందు.. ఆర్టికల్ 200, 201 కింద గవర్నర్, రాష్ట్రపతి తీసుకునే నిర్ణయాలు న్యాయబద్ధమేనా?
10. ఆర్టికల్ 142 ద్వారా రాష్ట్రపతి లేదా గవర్నర్‌కు సంక్రమించిన రాజ్యాంగపరమైన అధికారాలను మార్చడం లేదా నిరాకరించడం న్యాయ వ్యవస్థకు సాధ్యమా?
11. ఆర్టికల్ 200 కింద గవర్నర్ ఆమోదం లేకుండానే రాష్ట్రంలో చట్టం అమల్లోకి వస్తుందా?
12. రాజ్యాంగ వివరణకు సంబంధించిన అంశాలున్న కేసుల్లో తీర్పులు ఇచ్చే ముందు ఆర్టికల్ 145(3) కింద కనీసం ఐదుగురు సభ్యులున్న విస్తృత ధర్మాసనానికి సిఫారసు చేయాల్సిన బాధ్యత సుప్రీం ధర్మాసనానికి ఉండదా?
13. ఆర్టికల్ 142 కింద విధానపరమైన అంశాల్లో చట్టపరమైన, రాజ్యాంగపరమైన నిబంధనలకు విరుద్ధంగా ఆదేశాలు ఇచ్చే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా?
14. కేంద్రం, రాష్ట్రాల మధ్య వివాదాలు తలెత్తినప్పుడు ఆర్టికల్ 131 పరిధిలో కాకుండా, వాటిని పరిష్కరించే అధికారాన్ని రాజ్యాంగం సుప్రీంకోర్టుకు కల్పించిందా?

# రూ. 2.5 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం కబ్జా..!

- షాద్ నగర్ న్యూ రాఘవేంద్ర కాలనీలో పట్టపగలే "విచిత్రం" - 20 ఫీట్ల రోడ్డును కబ్జా చేసి దర్జాగా ప్లాటు చేసుకున్న ఘనుడు
- ఇదేమని ప్రశ్నిస్తే ఎస్టి అట్రాసిటీ కేసు పెడతానంటూ బెదిరింపులు - షాద్ నగర్ కమిషనర్ కు కాలనీవాసుల ఫిర్యాదు
- ఇంకా చర్యలు చేపట్టని మున్సిపల్ శాఖ - వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి నిశ్శబ్దం
- ప్రభుత్వ స్థలాలు రోడ్లను ఆక్రమిస్తే చర్యలు లేవా..?



ఈ సమాజంలో పుణ్యానికి వస్తుంది అంటే స్మశానాలను, రోడ్లను, పార్కు స్థలాలను ఇతర ప్రభుత్వ భూములను సైతం వదలని ఘనులు ఉన్నారు. బహిరంగ మార్కెట్లో లక్ష రూపాయలకు చదరపు గజం విలువైన రోడ్డు స్థలాన్ని ఓ ప్రబుద్ధుడు ఏకంగా కబ్జా చేసి కాంపౌండ్ వాల్ నిర్మించాడు. ఇదేమని ప్రశ్నిస్తున్న స్థానిక వాసులను ఎస్టి అట్రాసిటీ కేసు పెడతానంటూ బెదిరిస్తున్నాడని జనాలు వాపోతున్నారు. షాద్ నగర్ మున్సిపాలిటీకి లిఖితపూర్వక ఫిర్యాదు అందినప్పటికీ అధికారులు సైతం ఎందుకు చోద్యం చూస్తున్నారు అర్థం కాని విషయం. దీని వెనుక ఎవరు ఉన్నారు? ఎక్కడి ధైర్యం మున్సిపల్ అధికారులే చెప్పాలి. సుమారు పాత జాతీయ రహదారి కి అనుకొని ఉన్న ఈ రోడ్డు స్థలం విలువ రెండున్నర కోట్ల పైమాటే అని స్థానికులు అంటున్నారు. వివరాల్లోకి వెళితే.. షాద్ నగర్ పట్టణంలోని సర్వే నెంబర్ 206పి, 207పి లో 1993లో గ్రామపంచాయతీ లేఔట్ కింద ఇండ్ల స్థలాలు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోడ్లను వదిలి స్థలాలను చేశారు. మొత్తం 169 ప్లాట్లను అప్పట్లో ఏర్పాటు చేశారు. చాలామంది ఇండ్ల స్థలాలను కొనుక్కొని నీళ్లను నిర్మించుతున్నారు. ఇదే క్రమంలో నేషనల్ మార్ట్ కొంత సమీపంలో ఎదురుగా న్యూ రాఘవేంద్ర కాలనీ ఎంట్రెన్స్ పాత జాతీయ రహదారి మర్యా రాణి కమాన్ పక్కనే 20 ఫీట్ల రోడ్డు ఈ కాలానికి వర్తిస్తుంది. ఎవరు చూడరు ఏమీ చేయలేరు అన్న ధీమా ఏమిటో కానీ ఓ ప్రబుద్ధుడు ఏకంగా 20 ఫీట్ల రోడ్డును కబ్జా చేసి కాంపౌండ్ వాల్ వేశాడు.

**మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు..**

షాద్ నగర్ మున్సిపల్ కమిషనర్ సునీతకు తేదీ 6న ఫిబ్రవరి 2025లో ఈ వ్యవహారంపై లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. 20 ఫీట్ల ప్రభుత్వ రోడ్డు కబ్జాకు గురైందని ఓ వ్యక్తి చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించాలని ప్రజలకు ఉపయోగకరమైన రోడ్డును ఎలా కబ్జా చేస్తారని దీనిపై చర్యలు చేపట్టాలని కాలనీవాసులు ప్రస్తుత మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, ప్రభాకర్, కిరణ్, శివ, రాజు, వినయ్ తదితరులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ ప్రాథమిక విచారణకు ఆదేశించారు. స్థానిక లేఅవుట్ అధికారి ఇక్కడికి వచ్చి స్థలాన్ని పరిశీలించారు. అధికారులు వాస్తవాలను గమనించి నిర్మాణాలు చేపట్టకూడదని ప్రస్తుతం చేసిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ ఆదేశాలు బేఖాతర్ అయ్యాయి. మున్సిపల్ శాఖ కమిషనర్ తదితరు అధికారులు నిబంధనల ప్రకారం వారిపై చర్యలు చేపట్టకపోవడంతో ప్రస్తుతం ఈ కబ్జాలు తొలగలేదు. 20 ఫీట్ల రోడ్డు నేషనల్ మార్ట్ ముందు పాత జాతీయ రహదారిని ఆనుకొని పొడవుగా వెళుతుంది. మధ్యలో అడ్డగూడ నిర్మించి కాంపౌండ్ వాల్ వేసుకున్నారు. గతంలో ఈ అక్రమ నిర్మాణాలపై స్థానికులు ప్రశ్నిస్తే సదరు వ్యక్తి ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని వారిని బెదిరిస్తున్నట్లు చెబుతున్నారు. పట్టపగలే ఈ చిత్ర విచిత్ర విన్యాసాలను కలపగించి చూస్తున్న మున్సిపల్ శాఖ అధికారులు ఎందుకు కబ్జాలను తొలగించడం లేదన్నది ప్రశ్న. ఇది ఇలాగే కొనసాగితే షాద్ నగర్ పట్టణంలో ఇక రోడ్డులు పార్కులు తదితర ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసేందుకు అక్రమార్కులు సిద్ధంగా ఉంటారు.

**ఫిర్యాదు ఇచ్చారు నిజమే..**

ఈ వ్యవహారమై స్థానికులు మున్సిపల్ శాఖకు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని కమిషనర్ సునీత మీడియాకు వివరణ ఇచ్చారు. లిఖితపూర్వక ఫిర్యాదులు కొన్ని విషయాలను పేర్కొన్నారని దానిపై టౌన్ ప్లానింగ్ అధికారి విచారణ జరిపారని చర్యలు చేపడతామని హెచ్చరించారు.

**ఎవరి ధైర్యం చూసుకుని..?**

రోడ్డును దర్జాగా కబ్జా చేసిన సదరు వ్యక్తి ఎవరి ధైర్యం చూసుకొని ఈ అక్రమానికి పాల్పడ్డాడు సాక్షాత్తు మున్సిపల్ శాఖ అధికారులకు తెలియాలి అని స్థానికులు వాపోతున్నారు. ఇంత దౌర్జన్యంగా అన్యాయంగా పట్టపగలే స్థలాలు కబ్జా చేస్తే ఇక ప్రభుత్వం ఉన్నది ఎందుకని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. లిఖితపూర్వక ఫిర్యాదు చేసి వాస్తవాలను చూపించిన మున్సిపల్ శాఖ ముందుకు కదలకపోవడం వెనక ఎవరున్నారని జనాలు నిలదీస్తున్నారు.




# మూడు రోజుల్లో ప్రభుత్వ రోడ్డుపై ఆక్రమణలు తొలగించాలి

**షాద్ నగర్ మున్సిపల్ కమిషనర్ సునీత ఆదేశాలు**

**ప్రభుత్వ రోడ్డు కబ్జాపై మున్సిపల్ కమిషనర్ సీరియస్**

**20 ఫీట్ల కబ్జా వ్యవహారంపై మున్సిపల్ తాఖీదు**

**టీఎస్ఎం చట్టం 2019లోని సెక్షన్ 185 నిబంధనల ఉల్లంఘన చేశారని గుర్తింపు**

**కాంపౌండ్ వాల్ తొలగించకపోతే.. మున్సిపాలిటీ నుండి తొలగించి ఖర్చులు మీ నుండి వసూలు చేస్తాం**

షాద్ నగర్ పట్టణంలోని న్యూ రాఘవేంద్ర కాలనీ కి సంబంధించిన 20 ఫీట్ల రోడ్డును ఆక్రమించినట్లు అధికారుల విచారణలో తేలిందని మూడు రోజుల్లో ఈ అక్రమ కట్టడాలు తీసివేయకపోతే మున్సిపాలిటీ చర్యలకు పూనుకుంటుందని దానికి అయ్యే ఖర్చు కూడా వసూలు చేస్తుందని అల్టిమేట్ జారీ చేస్తూ షాద్ నగర్ మున్సిపల్ కమిషనర్ సునీత తాఖీదు జారీ చేశారు. న్యూ రాఘవేంద్ర కాలనీకి సంబంధించిన 20 ఫీట్ల రోడ్డు వ్యవహారంలో ఆక్రమణకు పాల్పడిన పాతావత్ ప్రశాంత్ అనే వ్యక్తికి నోటీసులు జారీ చేశారు. ప్రశాంత్ దస్తావేజులో కూడా దక్షిణం వైపు 20 ఫీట్ల రోడ్డు ఉందని అధికారులు గుర్తించారని ఇతర అంశాలను ప్రస్తావిస్తూ తాఖీదు జారీ చేశారు.




**మున్సిపల్ శాఖ ఏం చెప్పింది అంటే..?**

న్యూ రాఘవేంద్ర కాలనీ వైపు ఉన్న రోడ్డును ఆక్రమించి వాహనాలకు ప్రజలకు ఆ రోడ్డు గుండా వెళ్లకుండా మరి కాంపౌండ్ వాల్ నిర్మించి అడ్డుకుంటున్నారని పేర్కొంటూ మున్సిపల్ శాఖకు స్థానికులు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ విషయంలో మున్సిపల్ అధికారులు స్థలాన్ని తనిఖీ చేసి, మీరు ఇంటి నెంబర్ 18-188/1/%ఖ%/ఏ/1, సర్వే నంబర్లు.207/పి ప్లాట్. నం. 163/పి, 164/పి, 165/పి, 168/పి మరియు 169/పి వద్ద ఉన్న ఆస్తి చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించడానికి ప్రయత్నిస్తున్నారని కనుగొన్నట్టు తాఖీదులో పేర్కొన్నారు. మరియు మీ వివరణ మరియు సంబంధిత యాజమాన్య పత్రాలను సమర్పించమని మౌఖికంగా ఆదేశించారనీ మున్సిపల్ తాఖీదులు వివరించారు. రెండవ రిఫరెన్స్ ప్రకారం యాజమాన్య పత్రాన్ని డాక్యుమెంట్ నంబర్, 2735/99 ద్వారా నమోదు చేసుకున్నారని మరియు "జాతీయ రహదారి విస్తరణ కారణంగా ప్లాట్ దిగువన ఉంది కాబట్టి మేము దానిని రోడ్డు లెవల్‌గా మార్చాలనుకుంటున్నామనీ కాంపౌండ్ వాల్ రోడ్డు లెవల్ చేయడానికి మీ అనుమతిని కోరుతూ కొన్ని కొత్త ఇటుకలను కలుపుతున్నామనీ భవిష్యత్తులో మేము ఎటువంటి కొత్త నిర్మాణాన్ని నిర్మించడం లేదని మరియు మునిసిపాలిటీ నియమాలను పాటిస్తాము" అని పేర్కొంటూ వివరణ ఇచ్చారని తాకీదులో మున్సిపల్ అధికారులు కీలకంగా పేర్కొన్నారు. అదేవిధంగా హైకోర్టును ఆశ్రయించారనీ ఇందులో పేర్కొన్నట్లు తాఖీదులో సూచించారు. అంతేకాకుండా, రెడ్ పిటిషన్ నెంబర్ 8641/2025లో హైకోర్టును ఆశ్రయించారనీ, తేదీ.21.03.2025న ఈ ఉపసంహరణ ఉత్తర్వును జారీ చేశారనీ కూడా ఇందులో పేర్కొనడం గమనార్హం. "ప్రతివాది సర్వే నెం.2071పి లోని ఇంటి నంబర్ 18-188 వద్ద పిటిషనర్లు నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను జోక్యం చేసుకోవద్దని ఆదేశించారు. ఇందులో ప్లాట్ నెం.163/పి, 1641పి, 165/పి, 168/పి మరియు మొత్తం 169 ఉన్నాయనీ ఇది ఫరూఖ్‌నగర్ శివారు రెవెన్యూ గ్రామం, షాద్‌నగర్ గ్రామ పంచాయతీ ప్రస్తుత షాద్‌నగర్ మున్సిపాలిటీ, షాద్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా వద్ద ఉంది, తగిన చట్ట ప్రక్రియను పాటించకుండా" అక్రమంగా నిర్మాణాలు చేపట్టడం మున్సిపల్ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ విషయంలో మళ్ళీ సైట్‌ను ఇటీవల మున్సిపల్ అధికారులు తిరిగి తనిఖీ చేయగా, అది గమనించబడిందనీ మరియు డాక్యుమెంట్ నంబర్, 2735/99 ద్వారా నమోదు చేయబడిన మీ యాజమాన్య పత్రంతో ధృవీకరించబడింది మరియు ప్లాట్ యొక్క దక్షిణ భాగంలో 20 అడుగుల వెడల్పు గల రహదారి ఉందని కనుగొనబడింది మరియు 28.02.2025 నాటి మీ వివరణ మరియు రెడ్ పిటిషన్ నంబర్ 8641/2025లోని గౌరవనీయ హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, మీరు మీ ప్లాట్ చుట్టూ 1000 చదరపు గజాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో కాంపౌండ్ వాల్‌ను నిర్మించారనీ రోడ్డు భాగాన్ని ఆక్రమించి రోడ్లను మూసివేసారు, దీనివల్ల వాహనాలు మరియు ప్రజలు ఆ రోడ్డు గుండా వెళ్లకుండా అడ్డంకులు ఏర్పడుతున్నాయనీ, ఇది టి ఎస్ ఎం చట్టం-2019లోని సెక్షన్ 185 నిబంధనలను ఉల్లంఘించడం మరియు లేఅవుట్ నిబంధనలకు విరుద్ధం అని ఇందులో పేర్కొన్నారు. కాబట్టి, ఈ నోటీసు అందిన తేదీ నుండి (03) మూడు రోజులలోపు కాంపౌండ్ వాల్‌ను కూల్చివేయాలని ఇందుమూలంగా ఆదేశించడం జరిగింది. లేని పక్షంలో మునిసిపాలిటీ తదుపరి నోటీసు లేకుండా కాంపౌండ్ వాల్ తొలగింపుకు చర్య తీసుకుంటుందనీ మరియు తెలంగాణ మునిసిపాలిటీల చట్టం-2019 ప్రకారం తొలగింపు ఖర్చును మీ నుండి వసూలు చేస్తారనీ మున్సిపల్ శాఖ హెచ్చరించడం గమనార్హం. హలో షాద్ నగర్ వార్తకు స్పందించిన మున్సిపల్ శాఖకు స్థానికులు పలువురు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

# శివయ్య ఆశీస్సులు ప్రజలందరి పై ఉండాలి..

**వివాహ వార్షికోత్సవం సందర్భంగా**

**శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకున్న నీలం మధు దంపతులు..**



ఆ శివయ్య కృపా కటాక్షలతో ప్రజలంతా సుఖసంతోషాలు ఆయురా రోగ్యాలతో వర్ధిల్లాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం తమ 21వ సంవత్సర పెళ్ళి రోజును పురస్కరించుకొని నీలం మధు దంపతులు శ్రీశైలంలోని శ్రీ మల్లికార్జున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ అర్చకులచే వేదఆశీర్వచనం అందుకున్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ శివుని ఆరాధనతో ఆ శివుడి కృపాకటక్షలు లభిస్తాయన్నారు. ఆ పరమశివుడి ఆశీస్సులు భక్తులందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

## పేద విద్యార్థికి అండగా టీమ్ మణికర్ణిక



**తెలుగు - వెలుగు, తూ గో జిల్లా బ్యూరో (అనపర్తి):**
చదువుకు పేదరికం అడ్డు కాకూడదు అనే ఉద్దేశంతో ఇటీవల పదవ తరగతిలో 520 మార్కులు సాధించిన పేద విద్యార్థిని కర్రి శైలజ కు మణికర్ణిక యువజన సంఘం చదివించేందుకు ముందుకు వచ్చింది. బిక్కవోలు మండలం కాపవరంకి చెందిన విద్యార్థి కర్రి శైలజ దేవి చిన్న తనంలోనే తండ్రిని కోల్పోయింది. ఆర్థిక భారం తల్లే మోస్తూ తన రెక్కల కష్టాలతో చదివిస్తుంది. దీంతో ఈ విషయం తెలిసిన మణికర్ణ టీమ్ అధ్యక్షులు గున్నా బత్తుల పూజా అనూష దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించారు. విద్యాదాతలు గౌరీ శంకర్ మధుసూదనరావు ఆర్థిక సహాకారంతో జగ్గంపేట మణి కర్ణిక యువజన సంఘం సభ్యులు విద్యార్థి శైలజను అనపర్తి జిబిఆర్ కళాశాలలో చేర్పించి రూ.10 వేలు చెక్ ప్రిన్సిపల్ పిఆర్ఎల్ స్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మొగలంక శ్రీనివాస్, గున్నాబత్తుల వీరబాబు, చిక్కాల మణికంఠ, పులిగ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విజయ ఆదిత్య రెడ్డికి పలువురు శుభాకాంక్షలు...



**తెలుగు-వెలుగు, తూ. గో. జిల్లా బ్యూరో (అనపర్తి ):**
సామాజిక సేవా సంఘాల ఐక్యతకు విశేష కృషి చేసిన వెలగల విజయ ఆదిత్య రెడ్డికి అమెరికాలోని మెరిట్ కౌన్సిల్ యూనివర్సిటీ(న్యూ జెర్సీ) డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భంగా వేమన రెడ్డి కళ్యాణ మండపం(రావులపాలెం)లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం పిఆర్ఓ వెలగల విజయ ఆదిత్య రెడ్డి ని ఘనంగా సత్కరించి పలువురు అభినందించారు. అభినందించిన వారిలో కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు కర్రి త్రినాథ్ రెడ్డి, యువజన సంక్షేమ సంఘం అధ్యక్షులు తాడి చంద్రశేఖర్ రెడ్డి, విక్టరీ వెంకటరెడ్డి, సత్తి వీర్రెడ్డి, నల్లమిల్లి వీర్రాఘవ రెడ్డి, సత్తి రాజశేఖర్ రెడ్డి, గుడిమెట్ల కల్కి రెడ్డి, చింతపండు వెంకటరెడ్డి, మేడపాటి వెంకటరెడ్డి, పడాల వసంత్ కుమార్ రెడ్డి, మేడపాటి నాగేంద్ర రెడ్డి, అప్పారెడ్డి, పడాల శివ రామకృష్ణారెడ్డి, కర్రి మార్కండేయ రెడ్డి ఇంకా పలువురు ప్రముఖులు ఉన్నారు.

# ఎమ్మెల్యే గారూ.. రైతులను పట్టించుకోండి..?

**మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాటలు ఉత్తవే**

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య**

**షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యాన్ని పరిశీలించిన బిజెపి బృందం**

**ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బిజెపి డిమాండ్**

**మార్కెట్ యార్డులో రైతులను పరామర్శించిన బిజెపి బృందం**





ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను మార్కెట్ యార్డులో కొనే దిక్కు లేదని ఫలితంగా ప్రకృతి వైపరీత్యాలతో వర్షానికి ధాన్యం తడిసి రైతు తీవ్రంగా నష్టపోతున్నాడని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, షాద్ నగర్ సీనియర్ నాయకులు అందే బాబయ్య ప్రభుత్వ దృష్టికి తెచ్చారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో నియోజకవర్గ వ్యాప్తంగా వరి రైతులు తీసుకువచ్చిన ధాన్యం వర్షానికి మార్కెట్లో తడిసి ముద్దయిందని ఆందోళన వ్యక్తం చేశారు.

వ్యవహారంలో బిజెపి బృందం నాయకులు వంశీకృష్ణ ప్యాట అశోక్, మల్చలం మురళి, భూషణ్, మఠం రిషికేష్, కురుమయ్య ప్రశాంత్ ముదిరాజ్ పిట్టల సురేష్ మల్చారం రమేష్ జంబుల నరసింహ శివశంకర్ కృష్ణయ్య తదితర బృందం మార్కెట్ యార్డులో రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా అందే బాబయ్య మాట్లాడుతూ ఆరుగాలం పండించిన పంటలకు మార్కెట్లో కొనుగోలు చేసే శక్తి లేక రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవచూపి అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని వెంటనే తడిసిన ధాన్యంతో పాటు పొడి ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆరుగాలం కష్టపడిన రైతులు కనీసం పెట్టుబడి కూడా వెల్లదీసే పరిస్థితి లేదని మరోవైపు మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు ఉత్త ప్రకటనలు చేస్తున్నారని వాస్తవ పరిస్థితిలో వారి ప్రకటనలకు భిన్నంగా ఉందని బాబాయి ఆరోపించారు. కేంద్రం క్వింటాల్ వరికి 2300 రూపాయల మద్దతు ధర కేటాయించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రైతులను పట్టించుకోకపోతే తీవ్ర నష్టాలు జరుగుతాయని హెచ్చరించారు. ఎమ్మెల్యే చొరవ చూపి ధాన్యాన్ని కొనే విధంగా చర్యలు తీసుకోవాలని బాబయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యువ నాయకుడు వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం అనేక రకాల వాస్తవ విరుద్ధ ప్రకటనలు చేసి కాలయాపన చేస్తుందని రైతుల నడ్డి విరుస్తుందని వంశీకృష్ణ ఆరోపించారు..

# సిఎస్కెలో "మాస్టర్ ప్లాన్"..!

**షాద్ నగర్ ఎమ్మెల్యే"వీర్లపల్లి శంకర్"**

**సుమారు 40 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాప న**

**సీఎస్కే లో ప్రణాళిక బద్ధంగా పనులు చేపట్టలేదు**

**సీఎస్కే అభివృద్ధిపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది**

**అధికారులు "పనుల దాటవేత"ను పాటించారు**

**సీఎస్కేలో డివైడర్లను ప్రజల అదృష్టం మేరకు తొలగిస్తాం**

**షాద్ నగర్, కొత్తూరు మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక**



గత ప్రభుత్వం షాద్ నగర్ పట్టణంలోని సీఎస్కే గ్రీన్ విల్లాస్ ప్రాంతంలో పనుల ఎగవేతకు పాల్పడిందని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చర్యలు చేపట్టకుండా ఇష్ట రాజ్యాంగ వ్యవహరించిందని దాని ఫలితంగా స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని షాద్ నగర్ ఎమ్మెల్యే"వీర్లపల్లి శంకర్" స్పష్టం చేశారు. గురువారం సీఎస్కే గ్రీన్ విల్లాస్ లో స్థానికులతో కలిసి దాదాపు 40 లక్షల రూపాయల విలువైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీలో రెండు చోట్ల శంకుస్థాపన కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అదేవిధంగా కాలనీలో దిక్సూచి బోర్డులకు సంబంధించి పనులను కూడా ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మీడియాతో మాట్లాడుతూ.. షాద్ నగర్ పట్టణంలోని అతిపెద్ద వార్డ్ పదవ వార్డెన్ గుర్తు చేశారు. ఇందులో సీఎస్కే అతి పెద్ద కాలనీ అని ఇందులో ఎంతో మంది ప్రముఖులు నివసిస్తున్నారని గుర్తు చేశారు. స్థానికులు అబ్దుల్ రబ్జామి చెప్పిన విధంగా ఈ కాలనీపై గత పాలకులు అధికారులు నిర్లక్ష్యం చేశారన్న విషయం తన దృష్టికి తెచ్చారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రణాళిక బద్ధంగా పనులు చేపట్టలేదని ఒక మాస్టర్ ప్లాన్ అంటూ ఏమీ లేదని దీనివల్ల ఇక్కడ నివసిస్తున్న వారు అనేక ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి మాజీ కౌన్సిలర్ శ్రావణి తీసుకువచ్చారని పలు సందర్భాల్లో అభివృద్ధిపై తనతో వాదించడం జరిగిందని వాస్తవాలు తెలుసుకొని ఇక్కడ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మొదటి ఫేస్ లో దాదాపు రెండున్నర కోట్లకు పైగా పనులు ప్రగతిలో ఉన్నాయని రెండో ఫేస్ లో కూడా మరికొంత నిధులు సమకూర్చుతామని భరోసా ఇచ్చారు. కాలనీలో ఒక పద్ధతి లేకుండా డివైడర్లు ఏర్పాటు చేశారని వాటితో అనేక ఇబ్బందులు స్థానికులు ఎదుర్కొంటున్నారని వారి అభ్యర్థన మేరకు త్వరలోనే వాటిని తొలగిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. టిడిఎస్ నిధులు రెండు మున్సిపాలిటీలకు దాదాపు 25 కోట్ల వరకు సమకూర్చామని ఇంకా మరిన్ని నిధులు వస్తాయని నియోజకవర్గంలోని కొత్తూరు, షాద్ నగర్ మున్సిపాలిటీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని సారించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాలనీలో రాజకీయాలకు అతీతంగా కలిసికట్టుగా అభివృద్ధి పనులకు సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా అమృత్ టు లో మిషన్ భగీరథ పనులు కూడా చేపట్టబోతున్నట్టు ఎమ్మెల్యే ప్రకటించారు. కాలనీ అభివృద్ధికి పాటుపడుతున్న మాజీ కౌన్సిలర్ శ్రావణి, జమ్రుద్ ఖాన్ తదితరులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మున్సిపల్ కమిషనర్ సునీత, 10వ వార్డు మాజీ కౌన్సిలర్ శ్రావణి, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, నేతలు జ్రుమద్ ఖాన్,అగ్గనూర్ బస్వ%శీ%, చెంది తిరుపతి రెడ్డి రఘు నాయక్, ఇబ్రహీం, శ్రీకాంత్ రెడ్డి, నాగమణి, రమాదేవి, కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్ రబ్జామి, ప్రధాన కార్యదర్శి సోమ శేఖర్, సాదత్, జామి శ్రీనివాస్ రెడ్డి శివరాం రెడ్డి, శివాన%శీ%ద్, డాక్టర్ చందూలాల్ రాథోడ్, బాలు, ఉస్మాన్, రంజిత్, బబ్బన్ సింగ్, ఉపేందర్ రాయ్, ఎంకే సింగ్, సుధాకర్ రెడ్డి, రజాక్, రవితేజ, మాధవులు, లింగారెడ్డిగూడెం అశోక్, చంద్ర శేఖర్, గంగమోని సత్తయ్య, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు..



# వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన వడ్డేపల్లి...



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**

కూకట్ పల్లి అశోక్ గార్డెన్స్ లో జరిగిన కల్లేపల్లి వివాహ వేడుకలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. పెళ్లికూతురు తండ్రి కల్లేపల్లి దయాసాగర్ ఆహ్వానం మేరకు పాల్గొని నూతన వధూవరులైన సుప్రియ %�డ% రఘువీర్ లను అభినందించి ఆశీర్వదించారు. వివాహ వేడుకలో పాల్గొన్న మిత్రులను శ్రేయోభిలాషులను అందరిని ఆత్మీయంగా పలకరించి మిత్రులతో కలిసి పెళ్ళి భోజనం చేశారు.

## ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలి

**బి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాండ్ర శ్రావణ్ రెడ్డి**



**కేశంపేట:** ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందుతూ విధి నిర్వహణలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాండ్ర శ్రావణ్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పశు సంవర్ధక శాఖలో ఖాళీలను భర్తీ ప్రక్రియ నిర్వహించిందన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో మండలంలోని ఏ ఎక్లాస్ ఖాన్ పేట, కొండారెడ్డి పల్లి, పాపిరెడ్డి గూడ గ్రామాల్లో ఉన్న పశు వైద్య ఉప కేంద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం సిబ్బంది నియమించిందని ఆయన అన్నారు. పాపిరెడ్డి గూడ గ్రామంలో ఉన్న పశు వైద్య ఉప కేంద్రంలో గురువారం లైవ్ స్టాక్ అసిస్టెంట్ గా స్వప్న విధుల్లో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర తాండ్ర శ్రావణ్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ... రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. విధి నిర్వహణలో అవినీతికి ఆస్కారం లేకుండా ఉపకేంద్రం పరిధిలోని గ్రామాలలో పాడి రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఆయన అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం, రైతుల కోసం కృషి చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పశు వైద్య సిబ్బందిని కేటాయించేందుకు కృషి చేశారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో శివయ్య, అబ్బి సుందరయ్య, యాదయ్య, కాంగ్రెస్ పార్టీ మహిళా కమిటీ మండల అధ్యక్షురాలు రాణి, రవీందర్, ఆంజనేయులు, సత్యం గౌడ్, రామస్వామి, రామచందర్, బిక్షపతి, కృష్ణయ్య, శ్రీను, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## వెలిజర్ల మీదిగా వెళ్లి రోడ్డు మూసివేత




వెలిజర్ల గ్రామంలో నిర్వహించే శివాలయ, రామాలయ, నవగ్రహాలు, నాగదేవతలు, బొడ్రాయి, పోతురాజు విగ్రహాల మరియు ధ్వజస్తంభాల ప్రతిష్టాపన ప్రారంభోత్సవ జరగనున్నందున ఈరోజు 15-05-2025 సాయంత్రం నుండి 20-05-2025 మంగళవారం సాయంత్రం వరకు వెల్జెర్ల మీదుగా వెళ్లేదారి మూసి వేయనున్నారు,, షాద్నగర్ నుండి నుండి కొత్తపేటకు వెళ్లే (రోడ్డులో) దారిలో వెల్జర్ల గ్రామ పరిధిలోని బాలాజీ ఫ్యాక్టరీ నుండి కొండన్నగూడ మీదుగా వయ వెలిజర్ల నుండి సంగేమ్ , ఏ క్లాస్ ఖాన్ పెట్, కొత్తపేట గ్రామాలకు వెళ్లడానికి వాహనాలకు ఆస్కారం ఉంది, అంతేకాకుండా సంబంధిత పోలీసు అధికారుల నుంచి వెలిజర్ల గ్రామస్తులు అనుమతి కూడా తీసుకున్నారు, ఇప్పటికే స్థానిక ట్రాఫిక్ పోలీసులు గ్రామస్తులకు భారీ కేడ్లు ఇచ్చి రోడ్డు డైవర్షన్ చేయనున్నారు.

## ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో సానుకూలత పెంపొందిస్తాయి

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు**

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**

ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో సానుకూలత నో పెంపొందిస్తాయ నీ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఫిరోజ్ గూడ నవజీవన్ నగర్ లోని శ్రీ శ్రీ శ్రీ విజయ గణపతి సహిత ఉమ మహేశ్వర స్వామి వార్ల దేవాలయము లో నూతన లక్ష్మీ విజయ గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన మహొూత్సవంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు ఈ పుణ్యకార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం రాజేశ్వరరావుని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలోని సానుకూలతను పెంపొందిస్తాయనీ దేవాలయాల అభివృద్ధి ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శంకర్ రెడ్డి,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సురేందర్ రెడ్డి,బాలానగర్ బీజేపీ సీనియర్ నాయకులు రమేష్,శ్రీశైలం,శివరంజని, డివిజన్ అధ్యక్షులు డాక్టర్ కిరణ్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



# బూర్గుల గ్రామంలో మహిళా గ్రామ కమిటీ ఎన్నిక




జాతీయ బిసి సేన ఫరూక్ నగర్ మండల అధ్యక్షురాలు జలజ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మహిళా కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నాము కాబట్టి మన బూర్గుల గ్రామానికి వచ్చిన ఇంతమంది మహిళలకు ధన్యవాదాలు తెలియజేస్తూ జాతీయ బిసి సేన బీసీలందరూ ఏకం కావడానికి ప్రతి ఒక్కరూ పాల్గొనవలసిందిగా ప్రతి ఒక్కరికి అవగాహన ఏర్పాటు చేసి వెనుకబాటు లేకుండా ప్రతి ఒక్కరూ ముందుకు సాగి బీసీలందరూ ఏకతాటిగా రావాలని పిలుపునిస్తూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వ సుధాకర్, జిల్లా నాయకులు సదర్ శ్రీను, జిల్లా యువజన అధ్యక్షులు శివ ముదిరాజ్, అసెంబ్లీ అధ్యక్షులు కత్తి చంద్రశేఖర అప్ప ఫరూక్నగర్ మండల అధ్యక్షులు మేకల వెంకటేష్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి భూషం నరేష్, అసెంబ్లీ మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి, ఫరూక్ నగర్ మండల అధ్యక్షులు జలజ, చౌదర్ గూడా మండల అధ్యక్షులు జయ, టౌన్ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి , అనంత చారి మరియు మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు. కమిటీ అధ్యక్షులుగా మాధవి ఉపాధ్యక్షులుగా మంగలి పార్వతమ్మ ప్రధాన కార్యదర్శిగా చాకలి జంగమ్మ కార్యదర్శిగా పోతురాజు నరసమ్మ సహాయ కార్యదర్శిగా భాగమోని అనిత కోశాధికారిగా సత్యమ్మ సహాయ కోశాధికారిగా స్వరూప గౌరవ అధ్యక్షురాలుగా రాములమ్మ కార్యదర్శి వద్ల స్వరూప ఎన్నిక చేయడం జరిగినది

# కూకట్పల్లిలో యధేచ్ఛగా రోడ్లు కబ్జా

**- ఫిర్యాదుదారుడికి డబ్బు ఆశ**


**- ఫిర్యాదు వాపసు తీసుకోవాలని, బెదిరింపులకు దిగుతున్న కూకట్పల్లి బీఆర్ఎస్ నాయకుడు**



1st left of the main road after Prashanthi nagar old court building. The person has constructed 10 feet width and 40 feet long ramp connecting the main road & his shed. An online complaint was earlier raised with ID:- 2604255234157 dated 26-Apr-2025, following which the town planning staff have demolished 10 percent of the encroachment & left the 90 percent of encroached land & road untouched.

06 MAY 2025

||P.T.O||



10 feets of road is encroached illegally causing severe traffic movement problems & also leading to accidents as this road is used by heavy vehicles to transport industrial material. Many representations were given earlier but no full results are delivered in taking action. Kindly take immediate action at the earliest.

Thanking you,

Sincerely

12-05-25 (8977236261)

కాంగ్రెస్ పార్టీకి చెందిన గుండమల్ల రాజేంద్ర కుమార్ అనే సోషల్ మీడియా నాయకుడు కూకట్పల్లిలో జరుగుతున్న చెరువులు కుంటలు, నాలాలు, అలాగే ప్రభుత్వ భూములు రోడ్లు ఇలా ఎన్నో కబ్జాల మీద గత కొన్ని సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా ఎన్నో అక్రమ కబ్జాలను వెలుగులోకి తీసుకు వచ్చి బీఆర్ఎస్ నాయకులకు కంటి మీద కునుకు లేకుండా చేశారు. ప్రభుత్వం మారిన తర్వాత గౌరవ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు రాష్ట్రంలో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నాలాలు, మరియూ ఇతర ప్రభుత్వ ఆస్తులు కబ్జా చేస్తున్న అసాంఘిక శక్తుల మీద కఠినంగా వ్యవహరిస్తుండడంతో తెలంగాణ రాష్ట్రంలో ఇక కబ్జా అనే పదం వినిపించదని అనుకున్నారు.

కానీ... రాష్ట్రం మొత్తం ఒక ఎత్తైతే కూకట్పల్లి నియోజకవర్గంలో ఇంకో ఎత్తు అని గ్రహించలేక పోయారు. వరుసగా కూకట్పల్లిలో మూడుసార్లు గెలిచిన మా ఎమ్మెల్యే గారు ఉన్నారు, ఇక మమ్మల్ని ఎవరు అడిగేది, ఆపేది, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా ఇంకే ప్రభుత్వం ఉన్నా మాకేంటని, ఇది కూకట్పల్లి గడ్డ, ఇక్కడ ఉన్నది కేసీఆర్ వంశం ఇది మా రాజ్యం, మమ్మల్ని ఎదురించి ప్రశ్నించే వారు ఎవరు ఉన్నారు, అని గల్లా ఎగిరేసి యధేచ్ఛగా సమాజం సిగ్గుపడేలా బీఆర్ఎస్ పార్టీలోని కొందరు అక్రమార్కులు వ్యవహరిస్తున్న తీరు ప్రజా ప్రభుత్వానికే సవాలు విసురుతున్న పరిస్థితి కూకట్పల్లి నియోజకవర్గంలో నెలకొంది. కూకట్పల్లి నియోజకవర్గంలోని పాత కూకట్పల్లి గ్రామంలో సరిగ్గా ఇలాంటి పరిస్థితే నెలకొంది. కబ్జాలు చేయడమే కాకుండా కబ్జా చేసే వారి దెగ్గర నుంచి భారీ రుసుములు ముడుపులుగా తీసుకుని కబ్జాలకు అండగా నిలుస్తూ మున్సిపల్ అధికారులను నయానో భయానో లంచాల ఎర చూపి వారి గుప్పిట్లో ఉంచుకుని రాక్షస రాజ్యం ఏలుతున్నారు బీఆర్ఎస్ పార్టీలోని కొందరు అక్రమార్కులు. ఇది గ్రహించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుండమల్ల రాజేంద్ర కుమార్ మున్సిపల్ అధికారులకు వీడియో సాక్షాలతో సహా కూకట్పల్లి ప్రశాంత్ నగర్ పారిశ్రామిక వాడలో ఒక మైక్రో పారిశ్రామిక సంస్థ ఓనర్ అయిన మహేష్ అనే వ్యక్తి తన ఇండస్ట్రియల్ యూనిట్ కోసం రోడ్డును ఆక్రమించి 10 ఫీట్ల ర్యాంపు నిర్మించి భారీ వాహనాలు వచ్చి వెళ్లే పారిశ్రామిక వాడలో రాకపోకలకు తీవ్ర ఆటంకం సృష్టించారు. రోజూ ఆ మార్గంలో రాకపోకలు సాగించే గుండమల్ల రాజేంద్ర కుమార్ ఈ విషయాన్ని గ్రహించి మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఈ కబ్జాకు పాల్పడిన మహేష్ అనే వ్యక్తి బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎర్రవెల్లి వాసుదేవ రావు అనే నాయకుడి అనుయాయుడు అని తెలిసింది. మున్సిపల్ అధికారులు గుండమల్ల రాజేంద్ర కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మీద తూతూమంత్రంగా బీఆర్ఎస్ నాయకుల వత్తిడి మేరకు కబ్జాకు గురైన 10 శాతం రోడ్డు ర్యాంపును కూల్చి మిగితా 90 శాతం కబ్జాను బీఆర్ఎస్ నాయకుల మెప్పు కోసం వారి కండ్లలో ఆనందం చూడటం కోసం వదిలేసారు. ఈ విషయం తెలుసుకున్న గుండమల్ల రాజేంద్ర కుమార్ మళ్లీ మున్సిపల్ అధికారుల దృష్టికి ప్రజా వాణి వేదికగా ఈ సమస్య తీసుకు వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న కబ్జా చేసిన పారిశ్రామికవేత్త మహేష్ మరియూ బీఆర్ఎస్ నాయకుడు ఎర్రవెల్లి వాసుదేవ రావు ఇరువురు కలిసి గుండమల్ల రాజేంద్ర కుమార్ గారిని వారితో ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు వాపసు తీసుకోవాలని వత్తిడి చేయడమే కాకుండా బీఆర్ఎస్ నాయకుడు అయిన ఎర్రవెల్లి వాసుదేవ రావు రాజేంద్ర కుమార్ గారికి ఫోన్ చేసి బూతలు తిడుతూ కంప్లయింట్ వాపసు తీసుకోవాలని బెదరించడం జరిగింది. అలాగే కబ్జా చేసిన పారిశ్రామికవేత్త మహేష్ పలుమార్లు గుండమల్ల రాజేంద్ర కుమార్ గారికి ఫోన్ చేసి వారి ఇండస్ట్రియల్ యూనిట్ వద్దకు రావాలని లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించడంతో వేరే దారిలేక అక్కడికి వెళ్లారు. అక్కడికి వెళ్లిన తర్వాత మహేష్ అనే వ్యక్తి గుండమల్ల రాజేంద్ర కుమార్ గారికి పది వేల రూపాయల లంచం ఇవ్వచూపి వారి కబ్జా పై నమోదు చేసిన ఫిర్యాదు వాపసు తీసుకోవాలని వత్తిడి చేయగా సదరు కాంగ్రెస్ నేత గుండమల్ల రాజేంద్ర కుమార్ దాన్ని తిరస్కరించి అక్కడినుంచి వచ్చేసే క్రమంలో ఆ ఇండస్ట్రియల్ యూనిట్ యజమాని మహేష్ రాజేంద్ర కుమార్ గారిని ఆ ఫిర్యాదు వాపసు తీసుకోకపోతే పది లక్షల రూపాయలు డిమాండ్ చేస్తున్నావు అని అక్రమ పోలీస్ కేసు పెట్టి నిన్ను జైలు పాలు చేస్తామని బెదిరించడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా కూకట్పల్లి నియోజకవర్గంలో మామూలు ప్రజలు మాత్రమే కాకుండా ఎస్సీ వర్గాలకు చెందిన ప్రజలకు కూడా రక్షణ లేకుండా పోయింది. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఈ స్థాయిలో అక్రమాలకు పాల్పడుతూ న్యాయం కోసం పోరాడే వ్యక్తులను తీవ్రంగా వేధించడం కేవలం కూకట్పల్లి నియోజకవర్గంలో జరుగుతుంది. ఈ విషయమై ప్రభుత్వం మరియు పోలీసు శాఖ దృష్టి సారించి చర్యలు తీసుకోవాలి అని, ప్రజల కోసం పోరాటం చేస్తున్న వారికి రక్షణ కల్పించి అక్రమార్కులను కబ్జా కొరులను కఠినంగా శిక్షించాలని గుండమల్ల రాజేంద్ర గారు అభ్యర్థించారు.

# కాళేశ్వరం ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పం

**ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రణాళిక**

**అభివృద్ధికి రూ.200 కోట్ల వరకు కేటాయింపునకు సుముఖత**

కాళేశ్వరం ఆలయాన్ని గొప్ప ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆలయ సమగ్రాభివృద్ధికి అవసరమైతే రూ.200 కోట్ల వరకు నిధులు కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకు తగ్గ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాల్లో భాగంగా నిర్వహించిన హారతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖతో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సరస్వతీ పుష్కరాలకు విచ్చేస్తున్న భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగాన్ని అభినందించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం మొట్టమొదటిసారిగా టెంట్ సిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే గోదావరి, కృష్ణా పుష్కరాలు రానున్నాయని తెలిపారు. రాబోయే గోదావరి పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. గోదావరి, కృష్ణా పుష్కరాలు కూడా ఘనంగా నిర్వహించే అదృష్టం తనకు కలగనుందని



అన్నారు. కాళేశ్వరం క్షేత్ర వైభవాన్ని మరింత ఇనుమడింపజేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన పునరుద్ఘాటించారు.

## పంచాయతీ కార్యదర్శులతో ఎంఎస్ఎన్ రెడ్డి సమావేశం





**తెలుగు - వెలుగు, తూ. గో. జిల్లా బ్యూరో (అనపర్తి/ పెదపూడి) :** మండలంలో ఉన్న చెత్త నుండి సంపద కేంద్రాలన్ని పూర్తి స్థాయిలో పనిచేయాలని లేకపోతే కార్యదర్శుల పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిప్యూటీ ఎంపీడీవో ఎమ్ఎస్ఎన్ రెడ్డి అన్నారు.గురువారం కరకుదురు పంచాయతీ ఆవరణలో పెదపూడి మండలంలోని 18 గ్రామ పంచాయతీ కార్యదర్శులు,ఇంఛార్జ్ కార్యదర్శులతో డిప్యూటీ ఎంపీడీవో ఎమ్ఎస్ఎన్ రెడ్డి అత్యవసర సమావేశం నిర్వహించారు.గ్రామ పంచాయతీల్లో పాడై పక్కున ఉన్న మూడు చక్రాల రిక్షాలు, ఆటోలు, ట్రాక్టర్లు రిపేర్ చేయించి ఉపయోగించాలని సూచించారు.వేసవిలో మంచి నీటి కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంఎస్ఎన్ రెడ్డి తెలిపారు.ఇంకా సమావేశంలో ఎంఎస్ఎన్ రెడ్డి పలు సలహాలు, సూచనలు చేశారు.

## ఉపాధిహామీ కూలీలతో పనిచేసిన జిల్లా కలెక్టర్



**తెలుగు వెలుగు ప్రతినిధి, అశ్వారావుపేట**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్ చంద్రుగొండ మండలంలో గురువారం పర్యటించారు. ఈ క్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఉపాధి హామీ కూలీలతో కలిసి పని చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగయ్య బంజర పంచాయతీ, పోకలగూడెం, రావికంపాడు ఉపాధి హామీ కూలీలతో కలిసి ఆయన పనిచేశారు. ఈ క్రమంలో వారి యొక్క స్థితిగతులను జీవన విధానాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పిడి, ఎంపీడీవో అశోక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మాలోత్ బొజ్య నాయక్ స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిపై సుప్రీంకోర్టు ఆగ్రహం



కల్నల్ సోఫియా ఖురేషీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మంత్రి విజయ్ షా పై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఎలాంటి మాటలు మాట్లాడుతున్నారని మండిపడింది. ముందు వెళ్లి హైకోర్టులో క్షమాపణలు చెప్పాలని, ఇలాంటి అంశాల్లో సున్నితంగా వ్యవహరించాలని మొట్టికాయలు వేసింది. ఈ సందర్భంగా పోలీసులకూ చురకలంటించింది. మంత్రిని కాపాడాలని చూస్తున్నారా? అంటూ ఆగ్రహించింది.

## చైనా వైమానిక రక్షణ వ్యవస్థను.. జామ్ చేసిన భారత వాయుసేన

న్యూఢిల్లీ: పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో భారత రక్షణ దళం మరో ఘనత సాధించింది. సరిహద్దులో, నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ ఏర్పాటు చేసిన చైనా వైమానిక రక్షణ వ్యవస్థలను భారత వైమానిక దళం విజయవంతంగా స్తంభింపజేసింది. దీంతో కేవలం 23 నిమిషాల్లోనే పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) లోని 9 ఉగ్రవాద స్థావరాలను ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ యుద్ధ విమానాలు ధ్వంసం చేశాయి. కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని బుధవారం తెలిపింది. కాగా, ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్ ఉగ్ర స్థావరాలపై భారత్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లు ఎలా విజయవంతమయ్యాయో అన్నది భారత్ వివరించింది. పాకిస్థాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు వాటిని గుర్తించడంలో ఎందుకు ఘోరంగా విఫలమయ్యాయో అన్నది విశ్లేషించింది. చైనా తయారీ రక్షణ పరికరాలను భారత వాయుసేన సమర్థవంతంగా జామ్ చేసిందని తెలిపింది. 'పాకిస్థాన్‌లో ఏర్పాటు చేసిన చైనా వైమానిక రక్షణ వ్యవస్థలను భారత వైమానిక దళం జామ్ చేసింది. కేవలం 23 నిమిషాల్లోనే మిషన్‌ను పూర్తి చేసింది. భారత్ సాంకేతిక ఆధిపత్యానికి ఇది నిదర్శనం' అని పేర్కొంది. మరోవైపు భారత సాయుధ దళాలు ఉపయోగించిన వంద శాతం 'మేడ్ ఇన్ ఇండియా' వైమానిక రక్షణ వ్యవస్థ అసాధారణంగా పనిచేసిందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

# సీఈ రమణారెడ్డికి సీఎం రేవంత్ స్ట్రాంగ్ వార్నింగ్!

**- ప్రాజెక్టులపై రేవంత్ రెడ్డి సీరియస్ సమీక్ష - కాళేశ్వరం తరహాలో చేస్తే సహించేది లేదని హెచ్చరిక**

**- అధికారులకు ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు - రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతి,**

**- నిర్వహణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష**



బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన ఈ సమావేశంలో మహబూబ్‌నగర్ జిల్లా నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ (సీఈ) రమణారెడ్డికి సీఎం తీవ్ర హెచ్చరికలు జారీ చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. "అక్కడ (గతంలో పనిచేసిన చోట) చేసినట్లు ఇక్కడ కూడా చేస్తే కేసు పెట్టి లోపల వేయిస్తా" అంటూ సీఎం వ్యాఖ్యానించినట్లు సమాచారం. రమణారెడ్డి గతంలో కాళేశ్వరం ప్రాజెక్టులో సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)గా బాధ్యతలు నిర్వర్తించిన నేపథ్యంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి భూసేకరణ, పునరావాస ప్యాకేజీ (ఆర్ అండ్ ఆర్) సమస్యలు పూర్తిగా పరిష్కారమై, పంపుహౌస్‌ల పనులు ప్రారంభమైన తర్వాతే పైపులకు సంబంధించిన బిల్లులు సమర్పించాలని మహబూబ్‌నగర్ సీఈకి ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది.

గతంలో జరిగిన పొరపాట్లను ప్రస్తావిస్తూ, అలాంటివి పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల నిర్మాణంలో అక్రమాలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నమోదు చేసిన కేసుల్లో సంబంధం ఉన్న వారిపై చర్యలు కచ్చితంగా ఉంటాయని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. అయితే, ఈ కేసులతో ఎలాంటి సంబంధం లేని అధికారులు భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చినట్లు తెలిసింది. ప్రాజెక్టుల నిర్మాణంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా ఒకటి రెండుసార్లు సరిచూసుకోవాలని సూచించారు. గతంలో జరిగిన పొరపాట్ల వల్ల విజిలెన్స్ కేసులు నమోదవుతున్న విషయాన్ని గుర్తు చేస్తూ, భవిష్యత్తులో అలాంటివి జరగకుండా బాధ్యతగా పనిచేయాలని అధికారులకు ఉద్బోధించినట్లు సమాచారం. సమావేశంలో ఒప్పంద సేవల ఉద్యోగుల వేతనాల అంశాన్ని అధికారులు సీఎం దృష్టికి తీసుకురాగా, అవసరం ఉన్నంత వరకే కాంట్రాక్టు సిబ్బందిని నియమించుకోవాలని, దీనిపై ప్రభుత్వం ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసిందని, ఆ కమిటీ ప్రతిపాదనలు అందిన తర్వాత పరిశీలిస్తామని సీఎం చెప్పినట్లు తెలిసింది. ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతుల (ఓ అండ్ ఎం) కోసం పెండింగ్‌లో ఉన్న బిల్లులకు నెలకు రూ.50 కోట్లు, నిర్వహణ ఖర్చుల నిమిత్తం రూ. 75 కోట్ల వరకు కేటాయింపులు చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు సమాచారం. శిక్షణ సంస్థ వాలంతరికి రూ.10 కోట్లు, గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాల మేరకు చేపట్టాల్సిన పనులకు రూ.10 కోట్లు, దేవాదుల ఎత్తిపోతల పథకం పూర్తికి రూ.2 వేల కోట్లు అవసరమని అధికారులు ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిసింది.

# రాహుల్‌పై చర్యలకు రంగం సిద్ధం..




ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై చర్యలకు రంగం సిద్ధమైందని ప్రభుత్వ ఉన్నతాధికారులు వెల్లడించారు. తమ ఆదేశాలను ధిక్కరించిన నేపథ్యంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా ఉన్నతాధికారులు వెల్లడించారు. గురువారం దర్భంగాలో జిల్లా ఉన్నతాధికారులు విలేకర్లతో మాట్లాడుతూ.. దర్భంగాలో అంబేద్కర్ హాస్టల్ వద్ద విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమానికి నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీకి అనుమతి ఇవ్వలేదని తెలిపారు. స్థానిక టౌన్ హాల్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించేందుకు నిర్వాహకులకు అనుమతి ఇచ్చామని స్పష్టం చేశారు. కానీ రాహుల్ గాంధీ మాత్రం అంబేద్కర్ హాస్టల్ వద్దే విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధమయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని అడ్డుకొనేందుక పోలీసు సిబ్బంది చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్నారు. ఆ క్రమంలో అంబేద్కర్ హాస్టల్ వద్దకు రాహుల్ గాంధీ వస్తున్న క్రమంలో ఆయన్ని యూనివర్సిటీ గేట్ వద్ద పోలీసులు ఆపే ప్రయత్నం చేశారన్నారు. పోలీసుల ప్రయత్నాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకించాయని చెప్పారు. దీంతో యూనివర్సిటీ గేట్ తెరవక తప్పలేదన్నారు. అనంతరం ఖాన్‌కా చౌక్ వద్దకు రాహుల్ చేరుకుని.. అక్కడి నుంచి అంబేద్కర్ హాస్టల్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్దకు కాలినడకన ఆయన చేరుకున్నారని తెలిపారు. ఆ తర్వాత రాహుల్ గాంధీ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారని చెప్పారు. మీతో మాట్లాడటానికి, మీరు చెప్పింది వినేందుకు తాను ఢిల్లీ నుంచి వచ్చానని విద్యార్థులకు రాహుల్ గాంధీ వివరించారు. కానీ అధికారులు తానను ఆపేందుకు అడుగడుగునా అడ్డం పడ్డారన్నారు. అలాగే బ్యారీకేడ్స్‌ను రహదారులకు అడ్డంగా పెట్టారని చెప్పారు. కానీ తాను మరో మార్గం ద్వారా ఇక్కడికి చేరుకున్నారన్నారు. అంతేకాదు.. తనను ఎవరు ఆపలేరన్నారు. ఎందుకంటే తన వెనుక మీ బలం ఉందని చెప్పారు. దీంతో ప్రపంచంలో ఏ శక్తి తనను ఆపలేదని తెలిపారు. అలాగే బిహార్‌లోని నితీష్ కుమార్ ప్రభుత్వంతోపాటు ప్రధాని మోదీలపై ఈ సందర్భంగా రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. అదే విధంగా కులగణన నిర్వహించేందుకు పార్లమెంట్ సాక్షిగా ఒప్పుకోని ప్రధాని మోదీ.. తన ఒత్తిడి కారణంగా ఈ గణనను నిర్వహించేందుకు సానుకూలంగా స్పందించారని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రధాని మోదీ ప్రభుత్వం.. ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి, కులగణనతోపాటు నిరుపేదలకు వ్యతిరేకంగా పని చేస్తుందని మండిపడ్డారు. ఈ మోదీ ప్రభుత్వం కేవలం అదానీ, అంబానీ సంస్థలకు అనుగుణంగా మాత్రమే పని చేస్తుందంటూ రాహుల్ గాంధీ ఆరోపించారు. మరోవైపు అంబేద్కర్ హాస్టల్ వద్ద రాహుల్ గాంధీని ప్రసంగించేందుకు అనుమతించక పోవడంపై బిహార్‌లోని కాంగ్రెస్ పార్టీ వర్గాలు ప్రభుత్వంపై నిప్పులు చెరిగాయి. అదీకాక.. హాస్టళ్లలో పరిస్థితు ప్రస్తుతం ఎలా ఉన్నాయో తనకు తెలుసునన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఆ పరిస్థితులు మారుస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారు.

## పుల్వామాలో భద్రతా బలగాలతో జరిగిన

# ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతం

**లొంగిపోవాలని అమ్మ, సోదరి కన్నీటితో చెప్పినా వినలేదు.. కాసేపటికే ఆర్మీ చేతిలో హతం!**



జమ్ముకశ్మీర్‌లో భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ ఘటన గురువారం ఉదయం పుల్వామా జిల్లాలోని త్రాల్ ప్రాంతానికి చెందిన నాదిర్ గ్రామంలో చోటుచేసుకుంది. మరణించిన ఉగ్రవాదుల్లో ఒకడైన ఆమిర్ నజీర్ వని, ఎన్‌కౌంటర్‌కు కొద్దిసేపటి ముందు తన తల్లితో వీడియో కాల్‌లో మాట్లాడిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. లొంగిపోవాలంటూ కన్నతల్లి చేసిన కన్నీటి విన్నపాలను అతడు పెడచెవిన పెట్టినట్లు ఆ వీడియో ద్వారా స్పష్టమవుతోంది. వివరాల్లోకి వెళితే, నాదిర్ గ్రామంలోని ఒక ఇంట్లో ముగ్గురు ఉగ్రవాదులు తలదాచుకున్నారన్న పక్కా సమాచారంతో భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. లొంగిపోవాల్సిందిగా సైన్యం హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరపగా, ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. వీరిని జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందిన ఆమిర్ నజీర్ వని, ఆసిఫ్ అహ్మద్ షేక్, యావర్ అహ్మద్ భట్‌గా అధికారులు గుర్తించారు. ఎన్‌కౌంటర్‌కు ముందు, ఆమిర్ నజీర్ వని తన తల్లి, సోదరితో వీడియో కాల్‌లో మాట్లాడాడు. సైన్యం ఎదుట లొంగిపోవాలని వారిద్దరూ అతడిని పదేపదే వేడుకున్నారు. అయితే, "సైన్యాన్ని ముందుకు రానివ్వండి, వారి సంగతి నేను చూసుకుంటా" అంటూ అతడు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. తల్లి ఎంతగా ప్రాధేయపడినా అతడు వారి మాటలను లెక్కచేయలేదు. ఇదే సంభాషణలో, తోటి ఉగ్రవాది ఆసిఫ్ అహ్మద్ షేక్ సోదరి కూడా తన సోదరుడి గురించి ఆరా తీయగా, అతడు తన వద్దే ఉన్నాడని వని చెప్పాడు. ఈ సంభాషణ ముగిసిన కొద్దిసేపటికే ఎన్‌కౌంటర్ జరిగి, ముగ్గురూ మృతి చెందారు.

## హైదరాబాద్, ముంబైలలో ఈడీ సోదాలు...

# రూ. 32 కోట్ల ఆస్తుల స్వాధీనం

**ముంబై వసాయి విరార్**

**కార్పొరేషన్ (వీవీఎంసీ) స్కామ్‌పై ఈడీ దర్యాప్తు వేగవంతం**

**ముంబై, హైదరాబాద్ సహా 13 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు**

**రూ.9.04 కోట్ల నగదు, రూ.23.25 కోట్ల విలువైన బంగారం, వజ్రాలు స్వాధీనం**



ముంబైకి చెందిన వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ (వీవీఎంసీ) పరిధిలో వెలుగుచూసిన భారీ కుంభకోణంపై ఈడీ దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా గురువారం అధికారులు కీలక ముందడుగు వేశారు. ముంబై, హైదరాబాద్ నగరాలతో పాటు మొత్తం 13 ప్రాంతాల్లో ఏకకాలంలో విస్తృత సోదాలు నిర్వహించారు. ఈ దాడుల్లో భారీ మొత్తంలో నగదు, బంగారం, వజ్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ ప్రకటించింది. సుమారు రూ.9.04 కోట్ల నగదుతో పాటు, రూ.23.25 కోట్ల విలువ చేసే బంగారం, వజ్రాలు లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఆస్తుల మొత్తం విలువ రూ.32 కోట్లకు పైగా ఉంటుందని అంచనా.ముంబైలోని మిరా భయాందర్ కమిషనరేట్ పరిధిలో ఈ అక్రమాలపై పలు కేసులు నమోదయ్యాయి. వీటి ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను ఆక్రమించి, నిబంధనలకు విరుద్ధంగా 2009 సంవత్సరం నుంచి అక్రమ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసినట్లు ఈడీ గుర్తించింది. ఈ కుంభకోణంలో సీతారాం, అరుణ్ అనే వ్యక్తులు కీలక నిందితులుగా ఉన్నట్లు ఈడీ పేర్కొంది. కొందరు అవినీతి అధికారులతో వీరు కుమ్మక్కై, ప్రభుత్వ స్థలాల్లో కూడా చట్టవిరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి, అమాయక ప్రజలకు విక్రయించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని అధికారులు తెలిపారు. ఈ దర్యాప్తులో భాగంగానే వీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగపు డిప్యూటీ డైరెక్టర్ వైఎస్ రెడ్డి నివాసంలో కూడా ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. నిందితుల ఇళ్ల నుంచి పెద్ద ఎత్తున నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ తమ ప్రకటనలో స్పష్టం చేసింది.

## పీవోకేను భారత్‌లో

# విలీనం చేయాలి

**కేంద్రమంత్రి రాందాస్ డిమాండ్**






పీఓకే అంశంపై కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి రాందాస్ అథవాలే కీలక వ్యాఖ్యలు చేశారు. పీవోకేను భారత్‌లో విలీనం చేయాల్సిందేనని, ఒకవేళ పాకిస్థాన్ అందుకు అంగీకరించని పక్షంలో దానిని స్వాధీనం చేసుకునేందుకు మరిన్ని యుద్ధాలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ ను ప్రశంసించిన అథవాలే, ఈ ఆపరేషన్ ద్వారా భారత సైన్యం పాకిస్థాన్ ఆర్మీకి తగిన రీతిలో బుద్ధి చెప్పిందని అన్నారు. "పాకిస్థాన్ ను భారత్ గట్టిగా దెబ్బతీసింది. కాల్పుల విరమణ అనేది కొన్ని రోజులు మాత్రమే ఉంటుంది. మన సైన్యం దాయాది దేశానికి సరైన గుణపాఠం నేర్పింది. పాకిస్థాన్‌లో తలదాచుకున్న వంద మంది ఉగ్రవాదులను హతమార్చాం. ఈ ఆపరేషన్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్యవర్తిత్వంతో ముగించలేదు. పీవోకేను భారత్‌కు అప్పగించాలని, ఉగ్రవాద కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని పాకిస్థాన్ ముందు భారత్ స్పష్టమైన ప్రతిపాదనలు ఉంచింది" అని వివరించారు. కశ్మీర్ వివాదంలో మూడో వ్యక్తి ప్రమేయాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని అథవాలే తేల్చిచెప్పారు. "తూటాకు తూటాతోనే సమాధానం చెప్పడమనేది భారత విధానం. పీవోకే భారత్‌లో అంతర్భాగమని గతంలో పార్లమెంటు వేదికగా కూడా నేను స్పష్టం చేశాను. ఒకవేళ పాకిస్థాన్ దానిని అప్పగించకపోతే, దాన్ని తిరిగి మన ఆధీనంలోకి తెచ్చుకోవడానికి మరిన్ని యుద్ధాలు చేయాల్సి ఉంటుంది" అని ఆయన పునరుద్ఘాటించారు. ప్రస్తుత సున్నితమైన పరిస్థితులను విపక్షాలు రాజకీయం చేయవద్దని కూడా అథవాలే హితవు పలికారు.

# నేను ఎవరితో అనవసరంగా గొడవలు పెట్టుకోను...

**మా జోలికి వస్తే వదలను: మంత్రి నారా లోకేశ్**

**ఉత్తమ కార్యకర్తలతో లోకేశ్ సమావేశం**

**పార్టీ కేడర్ ఎర్ర బుక్ గురించి అడుగుతున్నారని వెల్లడి**

**వేధించిన వారి వివరాలు తమ వద్ద ఉన్నాయన్న మంత్రి**



తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను గత ప్రభుత్వ హయాంలో ఇబ్బందులకు గురిచేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ మంత్రి నారా లోకేష్ తీవ్రంగా హెచ్చరించారు. పార్టీ కార్యకర్తలు తరచూ 'రెడ్ బుక్' గురించి ప్రస్తావిస్తున్నారని గుర్తు చేస్తూ, తమ కార్యకర్తలను వేధించిన వారి వివరాలు తమ వద్ద ఉన్నాయని, వారిపై చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. "నేను ఎవరితోనూ అనవసరంగా గొడవలు పెట్టుకోను, కానీ మా జోలికి వస్తే మాత్రం సహించేది లేదు" అని లోకేశ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం విధానంలో భారీ కుంభకోణం జరిగిందని, ఈ విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవడానికి కొంత సమయం పడుతుందని పేర్కొన్నారు. గుంతకల్లు నియోజకవర్గం గుత్తి సమీపంలోని రామరాజుపల్లిలో ఉత్తమ కార్యకర్తల సమావేశంలో లోకేశ్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జోన్ %-% 5 కోఆర్డినేటర్ కోవెలమూడి నాని, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, అనంతపురం పార్లమెంటు టిడిపి అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ కార్యకర్తల సమావేశంలో లోకేశ్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం అపూర్వ విజయం సాధించిందని, దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని విధంగా కోటి సభ్యత్వాలు సాధించి రికార్డు సృష్టించిందని తెలిపారు. ఈ అద్భుత విజయం వెనుక కార్యకర్తల అవిశ్రాంత శ్రమ, అంకితభావం ఉన్నాయని కొనియాడారు. గుంతకల్లు నియోజకవర్గంలో ఎన్నికలకు నెల రోజుల ముందు అభ్యర్థిని ప్రకటించినా, కార్యకర్తలు భుజాలపై మోసి గెలిపించారని ప్రశంసించారు. పార్టీలో పాత, కొత్త తరం నాయకుల మధ్య సమన్వయం ఉండాలని, కష్టపడి పనిచేసే వారికే ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండి, 'తెలుగుదేశం' అనే ఒకే వర్గంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. 2019 ఎన్నికల్లో మంగళగిరిలో తాను ఓటమిపాలైనా, నిరుత్సాహపడకుండా కసితో పనిచేసి చరిత్ర తిరగరాశానని గుర్తుచేశారు. కార్యకర్తలు అహంకారం విడనాడి, ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అధినేత నిర్ణయాలకు అందరూ కట్టుబడి ఉండాలని, ఏదైనా అన్యాయం జరిగితే తనను గానీ, పార్టీ పెద్దలను గానీ సంప్రదించాలని సూచించారు. సమస్యలపై అంతర్గతంగా చర్చించుకుని, బయటకు వచ్చాక "జై తెలుగుదేశం" అని నినదించాలని దిశానిర్దేశం చేశారు.

**త్వరలో మై టీడీపీ యాప్**

పార్టీ కార్యక్రమాలను కేడర్‌కు ఎప్పటికప్పుడు చేరవేసేందుకు, సమన్వయం పెంచేందుకు మహానాడు అనంతరం 'మై టీడీపీ' పేరుతో నూతన యాప్‌ను విడుదల చేయనున్నట్లు లోకేశ్ ప్రకటించారు. కేఎస్ఎస్, బూత్, క్లస్టర్ స్థాయిలోని కార్యకర్తలందరికీ ఈ యాప్ ద్వారానే కార్యక్రమాల సమాచారం, సందేశాలు పంపిస్తామని వివరించారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో నియోజకవర్గ స్థాయిలో మినీ మహానాడులు, అలాగే ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో పార్టీ మహానాడు అంగరంగ వైభవంగా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలలో కార్యకర్తలందరూ ఉత్సాహంగా పాల్గొనాలని ఆయన కోరారు.

# ప్రెసిడెంట్‌కు కూడా డెడ్‌లైన్లు పెట్టొచ్చా..?

**సుప్రీంకోర్టుకు 14ప్రశ్నలు సంధించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము..**

**సుప్రీంకోర్టుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంచలన ప్రశ్నలు సంధించారు.**



సుప్రీంకోర్టుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంచలన ప్రశ్నలు సంధించారు. రాష్ట్రపతి, గవర్నర్లకు కూడా సుప్రీంకోర్టు డెడ్ లైన్లు విధించగలరా అని ప్రశ్నించారు. తమిళనాడు కేసులో.. రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతి, గవర్నర్ గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని, బిల్లులను రాష్ట్ర ప్రభుత్వానికి వెనక్కి పంపిస్తున్నట్లయితే అందుకు గల కారణాలనూ జత చేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది. నెల రోజుల క్రితం సుప్రీంకోర్టు ఇందుకు సంబంధించి 415 పేజీల తీర్పు వెలువరించింది. తాజాగా.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పలు ప్రశ్నలు సంధిస్తూ సుప్రీంకోర్టుకు లేఖ రాశారు. గవర్నర్ల పై గడువులు విధించొచ్చా అని ఆ లేఖలో ద్రౌపది ముర్ము ప్రశ్నించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీంకోర్టుకు రాసిన లేఖలో 14 ప్రశ్నలు అడిగారు. ఈ ప్రశ్నలన్నీ గవర్నర్, రాష్ట్రపతి అధికారాలకు సంబంధించినవి. అదేవిధంగా.. రాష్ట్రపతి అడిగిన ప్రశ్నలు రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 200, 201, 361, 143, 142, 145(3), 131లకు సంబంధించినవి. బిల్లు తన వద్దకు వచ్చినప్పుడు గవర్నర్ కు ఏ ఎంపిక ఉంటుంది..? మంత్రి మండలి సలహాలను గవర్నర్ పాటించాల్సిన అవసరం ఉందా..? అని ద్రౌపది ముర్ము సుప్రీంకోర్టుకు రాసిన లేఖలో ప్రశ్నించారు.

రాష్ట్రపతి అడిగిన ప్రశ్నలు ఇవే..


- రాష్ట్రపతి, గవర్నర్‌కు కోర్టులు గడువు ఎలా నిర్దేశిస్తాయి?
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 కింద బిల్లును సమర్పించినప్పుడు గవర్నర్ ముందున్న రాజ్యాంగపరమైన ఎంపికలేంటి?
- రాజ్యాంగంలోని రాష్ట్రపతి లేదా గవర్నర్ అధికారాలను ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు తన సొంత అధికారాలతో ఎలా భర్తీ చేయగలదు?
- సుప్రీంకోర్టుకు ఉన్న ప్లీనరీ అధికారాలను రాష్ట్రాలు కేంద్రానికి వ్యతిరేకంగా దుర్వినియోగం చేస్తున్నాయా?
- రాజ్యాంగంలోని 361వ అధికరణం, 200వ అధికరణం కింద గవర్నర్ చర్యలకు సంబంధించి న్యాయ సమీక్షపై పూర్తి నిషేధం విధిస్తుందా?
- ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి, ఆర్టికల్ 200 కింద గవర్నర్ రాజ్యాంగ విచక్షణాధికారం ఉపయోగించడం న్యాయబద్ధమేనా?
- రాజ్యాంగంలో రాష్ట్రపతి అధికారాల మేరకు ఆర్టికల్ 143 కింద సుప్రీం కోర్టు సలహాను పొందడానికి లేదా గవర్నర్, రాష్ట్రపతి అనుమతి కోసం బిల్లును రిజర్వ్ చేయడం లేదా ఇతర విధంగా సుప్రీంకోర్టు అభిప్రాయం పొందడం అవసరమా?

# భారత్‌లో ఆపిల్ ఉత్పత్తుల తయారీ వద్దు

**టిమ్ కుక్‌తో డొనాల్డ్ ట్రంప్**

**భారత్‌లో ఆపిల్ ఉత్పత్తుల తయారీపై డొనాల్డ్ ట్రంప్ అభ్యంతరం**

**తయారీని అమెరికాకు తరలించాలని ఆపిల్ సీఈఓ టిమ్ కుక్‌కు సూచన**



అగ్రశ్రేణి టెక్నాలజీ సంస్థ ఆపిల్ భారత్‌లో తమ ఉత్పత్తుల తయారీని విస్తరించడంపై అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆపిల్ సీఈఓ టిమ్ కుక్‌తో తాను ఈ విషయంపై మాట్లాడానని, భారత్‌లో తయారీ కార్యకలాపాలను ప్రోత్సహించవద్దని సూచించినట్లు ట్రంప్ స్వయంగా వెల్లడించారు. అమెరికాలోనే ఆపిల్ ఉత్పత్తులు తయారవ్వాలన్నది తన అభిమతమని ఆయన స్పష్టం చేశారు. ఖతార్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ, "నిన్న టిమ్ కుక్‌తో నాకు చిన్న సమస్య వచ్చింది. మీరు భారత్‌లో భారీగా ప్లాంట్లు నిర్మిస్తున్నారు. అలా భారత్‌లో నిర్మించవద్దు అని నేను చెప్పాను" అని వ్యాఖ్యానించినట్లు బ్లూమ్‌బెర్గ్ నివేదించింది. భారత్ ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధిస్తున్న దేశాల్లో ఒకటని, అక్కడ అమెరికా ఉత్పత్తులు అమ్మడం చాలా కష్టమని ట్రంప్ పేర్కొన్నారు. తమతో చర్చల అనంతరం ఆపిల్ అమెరికాలో తయారీ కార్యకలాపాలను పెంచుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చైనాపై అమెరికా విధించిన సుంకాలు, దౌత్యపరమైన ఉద్రిక్తతల నేపథ్యంలో ఆపిల్ తన తయారీ కార్యకలాపాలను చైనా నుంచి ఇతర దేశాలకు, ముఖ్యంగా భారత్‌కు తరలిస్తున్న విషయం తెలిసిందే. గత మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఆపిల్ భారత్‌లో దాదాపు 22 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను ఉత్పత్తి చేసింది. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే దాదాపు 60 శాతం అధికం. 2025 చివరి నాటికి అమెరికాకు ఎగుమతి అయ్యే ఐఫోన్లలో ఎక్కువ భాగం భారత్ నుంచే రావాలని ఆపిల్ లక్ష్యంగా పెట్టుకుంది.

## తుర్కియేకి భారత్ మరో షాక్



పాకిస్థాన్కు సహకరించిన తుర్కియేకి భారత్ వరుస షాకులిస్తోంది. తాజాగా ఆ దేశానికి చెందిన సెలెబి ఎయిర్పోర్ట్ సర్వీసెస్కు బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ భద్రతా అనుమతుల్ని రద్దు చేసింది. దీంతో ఆ కంపెనీ భారత ఎయిర్పోర్టుల్లో సేవలను అందించకుండా పోయింది. కాగా.. ఢిల్లీ, ముంబై, చెన్నైతో సహా 9 ప్రధాన విమానాశ్రయాల్లో కీలకమైన హై-సెక్యూరిటీ కార్యకలాపాలను సెలెబి ఏవియేషన్ నిర్వహిస్తోంది.

### భారతీయులకు శత్రువులా మారుతున్న ట్రంప్!



అమెరికా ఎన్నికల్లో ట్రంప్ గెలవాలని చాలా మంది భారతీయులు కోరుకున్నారు. కానీ ఆయన అధికారంలోకి వచ్చాక మన దేశానికి వరుస షాకులు ఇస్తున్నారు. తాజాగా ఇండియాలో యాపిల్ ప్లాంట్లను పెట్టవద్దని ఆ కంపెనీ సీఈవో టిమ్ కుక్కు చెప్పారు. అమెరికా దిగుమతులపై పూర్తిగా టారిఫ్స్ ఎత్తివేస్తున్నట్లు ఇండియా తనతో చెప్పిందని మానసికంగా దెబ్బతీస్తున్నారు. ముఖ్యంగా భారత్, పాక్లను పోలుస్తూ పదేపదే కామెంట్స్ చేస్తున్నారు.

## ఆదంపూర్ ఎయిర్ బేస్... భారత వాయుసేనకు కంచుకోట!

**ఆదంపూర్ వైమానిక స్థావరం: పశ్చిమ సరిహద్దుకు ఉక్కు కవచం!**

**75 ఏళ్ల చెక్కుచెదరని ధీరత్వం**

**వ్యూహాత్మకంగా అత్యంత కీలకం**

పొరుగుదేశం పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు, తప్పుడు ప్రచారాలకు దీటుగా నిలుస్తూ, భారత పశ్చిమ సరిహద్దులకు అభేద్యమైన కోటలా విరాజిల్లుతోంది ఆదంపుర్ వైమానిక స్థావరం. ఇటీవలి పాకిస్థాన్ దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఈ స్థావరాన్ని సందర్శించి, ఇక్కడి ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ, మిగ్-29 యుద్ధ విమానాల భద్రతను ప్రపంచానికి స్పష్టం చేశారు. ఈ పరిణామం ఆదంపుర్ వ్యూహాత్మక ప్రాముఖ్యతను మరోసారి చాటిచెప్పింది.

**వ్యూహాత్మక ప్రాముఖ్యత**

పంజాబ్‌లోని జలంధర్ నగరానికి అత్యంత సమీపంలో, పాకిస్థాన్ సరిహద్దుకు కేవలం 100 కిలోమీటర్ల దూరంలో 1950లలో ఈ వైమానిక స్థావరం ఏర్పాటైంది. దేశంలోనే రెండో అతిపెద్ద వైమానిక కేంద్రంగా పేరుగాంచిన ఆదంపుర్, గత 75 ఏళ్లుగా పాకిస్థాన్ రాడార్ల నిఘా నీడలో ఉన్నప్పటికీ, ఎలాంటి దాడులనైనా తట్టుకుని నిలబడగలిగింది. పాకిస్థాన్ నిరంతరం దీని భద్రతా వలయాన్ని ఛేదించాలని ప్రయత్నిస్తూనే ఉంది. మార్చి 9, 10 తేదీల్లో పాకిస్థాన్ ప్రయోగించిన సుమారు ఆరు క్షిపణులను, లక్ష్యానికి ఏడు కిలోమీటర్ల దూరంలోనే భారత రక్షణ వ్యవస్థలు విజయవంతంగా కూల్చివేయడం ఇందుకు నిదర్శనం. పాక్ ఆర్మీ ప్రధాన కార్యాలయానికి దగ్గరగా ఉన్న నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌పై భారత్ జరిపిన దాడికి ప్రతీకారంగా, తాము ఆదంపుర్ ఎయిర్ బేస్‌పై, ఎస్-400 వ్యవస్థపై దాడి చేశామని పాకిస్థాన్ చేసిన ప్రచారాన్ని భారత్ సమర్థవంతంగా తిప్పికొట్టింది.

**చారిత్రక నేపథ్యం -యుద్ధాల్లో పాత్ర**

భారత్-పాక్ మధ్య జరిగిన ప్రతి యుద్ధంలోనూ ఆదంపుర్ వైమానిక స్థావరం శత్రుదేశానికి తొలి లక్ష్యంగా మారింది. 1965 యుద్ధంలో పాకిస్థాన్ వాయుసేన ఈ స్థావరంపై ముందస్తు దాడికి పాల్పడి, 135వ స్పెషల్ సర్వీస్ గ్రూప్ పారా కమాండోలను ఇక్కడ దించింది. అయితే, స్థానిక గ్రామీణులు ధైర్యసాహసాలతో ఆ కమాండోలలో చాలామందిని పట్టుకుని భారత దళాలకు అప్పగించారు. ఆ సమయంలో ఇక్కడ ఉన్న భారత వాయుసేనకు చెందిన 1వ స్క్వాడ్రన్, పాకిస్థాన్‌లోని సర్గోధా వంటి కీలక వైమానిక స్థావరాలపై విరుచుకుపడి ధ్వంసం చేసింది. 1971 యుద్ధ సమయంలో, పఠాన్‌కోట్‌లోని రన్‌వేను పాకిస్థాన్ ధ్వంసం చేసినప్పుడు, ఆదంపుర్ నుంచే యుద్ధవిమానాలు గాల్లోకి ఎగిరి ఆ ఎయిర్‌బేస్‌కు రక్షణ కల్పించాయి. ఆ యుద్ధం మొత్తం ఈ స్థావరం పూర్తిస్థాయిలో పనిచేసింది. ఇక 1999 కార్గిల్ యుద్ధ సమయంలో, ఇక్కడి నుంచే మిరాజ్ 2000 యుద్ధ విమానాలు బయల్దేరి, టైగర్ హిల్స్, టోలోలింగ్ వంటి కీలక శిఖరాలపై ఉన్న శత్రు బంకర్లను నాశనం చేసి, వాటి స్వాధీనంలో కీలక పాత్ర పోషించాయి.

**రక్షణ వ్యవస్థ - కీలక స్క్వాడ్రన్‌లకు ముఖ్య స్థావరం**

ఆదంపుర్ వైమానిక స్థావరం వాయుసేనకు చెందిన 47వ స్క్వాడ్రన్‌కు ('బ్లాక్ ఆర్చర్స్') నిలయం. దీంతోపాటు, 'ఫస్ట్ సూపర్‌సోనిక్స్'గా పేరొందిన 28వ స్క్వాడ్రన్ కూడా ఇక్కడే కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఈ రెండు స్క్వాడ్రన్‌లు స్థావరం రోజువారీ కార్యకలాపాల్లో అత్యంత కీలకమైనవి. ఈ స్థావరం చుట్టుపక్కల దాదాపు 150 కిలోమీటర్ల పరిధిలోనే పఠాన్‌కోట్ (అపాచీ హెలికాప్టర్లు), హల్వార (సుఖోయ్-30 ఎంకేఐలు), అమృత్‌సర్, బఠిండా (రఫేల్స్), ఛండీఘడ్ వంటి ఇతర ముఖ్యమైన వాయుసేన స్థావరాలున్నాయి. వీటన్నింటినీ ఒక గ్రిడ్‌లా అనుసంధానిస్తూ ఆదంపుర్ కేంద్ర బిందువుగా వ్యవహరిస్తోంది. ఈ వ్యూహాత్మక ప్రాముఖ్యత దృష్ట్యా, అత్యాధునిక ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ తొలి రెజిమెంట్‌ను ఇక్కడే మోహరించారు. దీంతో పశ్చిమ సరిహద్దు ప్రాంతం మొత్తం దీని రక్షణ ఛత్రం కిందకు వచ్చింది, భారత రక్షణ సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేసింది.

# ఓట్ల కోసం అంబేద్కర్ జపం !



దళిత జనోద్దరణలో అన్ని పార్టీలది ఒకటే విధానంగా ఉంది. నేటికీ దళితుల అభివృద్దికి పక్కా ప్రణాళికలు లేవు. వారిని ఓటుబ్యాంక్‌గా చూస్తున్నారు తప్ప తమలో ఒకరిగా చూడడం లేదు. దీనికితోడు దళితుల్లో ఉపకులాల ద్వారా వారి ఐక్యతను దెబ్బతీస్తున్నారు. అలాగే మాల, మాదిగ అంటూ దళితులే రోడ్డెక్కేలా చేస్తున్నారు. దీని ఆధారంగా ఓట్లు కొల్లగొట్టే ప్రయత్నాల్లో ఉన్న ఆయా పార్టీల పన్నాగాలను దళితులు గుర్తించడం లేదు. ఏటా అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి ఆయన విగ్రహాలకు దండలేయడం...కొత్తగా విగ్రహాలు పెట్టడం వరకే ప్రభుత్వాలు బాధ్యత వహిస్తున్నాయి. భారీ విగ్రహాలను పెట్టి దళితజనోద్దరణ అంటూ కాలం గడిపేస్తున్నారు. నేతలు కూడా అంబేద్కర్ విగ్రహాలను పెట్టాలన్న డిమాండ్ తీసుకుని వచ్చి వారిని తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ రకంగా వారిని ఎప్పటికప్పుడు మోసం చేస్తున్నారు. స్వాతంత్ర్యానంతరం దళితులను ఓటు బ్యాంకుగా వాడుకుం టున్నారే తప్ప వారిని తోటి మానవులుగా రాజకీయ నాయకులు భావించడం లేదు. వారికి సమాజంలో గౌరవం దక్కేలా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం లేదు. గ్రామాల్లో ప్రజలమధ్య వైషమ్యాలు లేకున్నా నాయకుల ఆలోచనలో అవి ఉన్నాయనడానికి మన నాయకుల తీరే నిదర్శనం. అంబేద్కర్ ఆశయాలను పాటించడం.. ఆయన ప్రవచించిన సిద్ధాంతాలను అమలు చేయడం అన్నది పైకి కనిపిస్తున్న ముసుగు మాత్రమే. ఏడున్నర దశాబ్దాల స్వాతంత్ర్య కాలంలో మన నాయకులంతా సమాజాన్ని విచ్ఛిన్నం చేసే దిశగా కులాల కుంపట్లు రగిలిస్తున్నారు.ఇప్పుడు రాజకీయ పార్టీలకు, నాయకులకు ఆయన పేరును జపించడం నిత్యకృత్యం కావడం వెనక ఓటుబ్యాంక్ రాజకీయం తప్ప మరోటి లేదు. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్న చందాన అంబేద్కర్ పేరు చెప్పుకుని అణగారిన వర్గాలను బుట్టలో వేసుకోవడం అన్న కళలో మన నాయకులు ఆరితేరారు. ఆయనకు భారీ విగ్రహాలు పెట్టి దండలు వేసి చేతులు దులుపు కుంటున్నారు. ఆయన ఆశయాలను తుంగలో తొక్కామన్న భావన రాకుండా నిత్యం అంబేద్కర్ జపం చేస్తున్నారు. ఎంతో జాగ్రత్తగా అన్ని రాజకీయ పార్టీలు అణగారిన వర్గాల ఓట్లకోసం అంబేద్కర్ పేరును వాడుకుంటున్నారు. ప్రతి ఎన్నికల్లో అది బాగా కనిపిస్తోంది. ప్రధాని మోడీ అయితే అంబేద్కర్ పేరు ఉచ్చరించకుండా ఉండలేకపోతున్నారు. ఆయనకు మేమిచ్చిన గౌరవం మరెవరూ ఇవ్వలేదంటున్నారు. కానీ ఈనాడు నిత్యం అంబేద్కర్ జపం చేస్తున్న వారంతా ఉన్నత కులాలు వారే. వారు ఏనాడు దళితులను ఉన్నతికి తీసకుని వచ్చేందుకు ప్రయత్నించడం లేదు. రాష్ట్రపతిని చేయడం దళిత ఉద్దరణ అనుకుంటారు. పాలనా పగ్గాలు వారి చేతుల్లో లేకుండా ఉత్సవ విగ్రహాలుగానే వారిని చూస్తున్నారు. దేశంలో పరిస్థితులు చూస్తుంటే అంబేద్కర్, పూలేలు ఎదుర్కొన్న వర్ణవివక్ష, కులవివక్ష జాడ్యాలు ఇంకా సమిసి పోయాయని చెప్పగలమా ? అంటే చెప్పలేం. ఇంతగా విద్య అందుబాటులోకి వచ్చినా ఇంకా వారు అణగారిన వర్గాలు గానే మిగిలిపోతున్నారు. ఒకటి రెండు పదవులు వారి మొహాన పడేసి దళితజన ఉద్దరణ జరిగిందన్న ప్రచారం చేసుకుంటే మనల్ని మనం మోసం చేసుకోవడమే అవుతుంది. దళితబంధు, పెన్షన్లు వంటివి ఇచ్చి ఆహా..ఓహో అంటూ కాలం గడుపుతున్నారు. దళిత ఉద్దరణ గురించి గొప్పగా చెప్పుకునే కాంగ్రెస్ జగ్జీవన్ రామ్‌కు ప్రధాని అయ్యే ఛాన్స్ వచ్చినా అడ్డుకున్న చరిత్రను మరచిపోలేం.. అందుకే దళితనేతను పాలనకు దగ్గరగా చేసిన చరిత్రను చూడడం లేదు. దళితులను సిఎం చేస్తానన్న కెసిఆర్ సైతం వారిని ఓటుబ్యాంక్ కోసం మభ్యపెట్టారు. తొలి దళిత ముఖ్యమంత్రి అంటూ ఊదరగొట్టి తెలంగాణ సమాజాన్ని మోసం చేసి, పదేళ్ల పాటు ఆయనే సిఎంగా కొనసాగారు. దళితబంధు పేరుతో అక్రమాలకు తెరతీసారు. నిజంగానే మనం అంబేద్కర్ మహానుభావుడి ఆశయాలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నామా లేదా అన్నది నేతలతో పాటు దళితులు కూడా ఆలోచన చేయాలి. ఎన్ని దళిత వాడలను పురుద్దరించారో.. ఎందరికి చదువు, ఉద్యోగాలు కల్పించారో ఆత్మవిమర్శ చేసుకోవాలి. అంబేద్కర్ ఆశించిన ఆశయాలను ముందుకు తీసుకుని వెళ్లడంలో రాజకీయ పార్టీలు చేస్తున్న మోసాలు గుర్తించాలి. దళితులంతా ఒక్కటే అన్న పట్టుదలతో సాగితే రాజకీయాల్లో పట్టు సాధించగలమని దళితులు గుర్తించాలి. అంతరాలు లేని సమాజం నిర్మించేందుకు ప్రయత్నించిన దాఖలాలు లేవు. రాజకీయ నాయకులే కులాల కుంపట్లు సృష్టించి దేశంలో అసమానాతలను పెంచి పోషిస్తున్నారు. దీంతో కులవ్యవస్థ మరింత బలంగా వేళ్లూనుకుని సమాజాన్ని అతలాకుతలం చేస్తోంది. రాజకీయ నాయకులు ఎలాగూ మంచి చేయరు. కనీసం ప్రజలుగా మనమంతా ఆ మహనీయుడికి నివాళి అర్పించేందుకు ఆయన చూపిన మార్గంలో నడిచే ప్రయత్నం చేయాలి.అంటరాని కులాలు ఆర్థికంగా బలపడనిదే, రాజకీయాధికారం పొందనిదే వారి సమస్యకు సమగ్రమైన పరిష్కారం దొరకదని అంబేద్కర్ ఆనాడే ప్రకటించారు. వారికి రాజ్యాధికారం వస్తే తప్ప ఈ అంటరానితనం, చిన్నచూపు చూడడం వేరుగా చూడడం వంటి సమస్యలు సమిసిపోతాయని భావించాడు. భారత జాతీయ కాంగ్రెస్ నడిపే జాతీయోద్యమంలో అంటరానితన నిర్మూలన కోసం గాంధీ కృషి చేస్తూ ఉంటే ఆ కృషికి కాంగ్రెస్ సభ్యులనుండి పూర్తిస్థాయిలో మద్దతు లభించనేలేదు. గాంధీజి వర్ణ వ్యవస్థను భారత సమాజం ప్రత్యేక లక్షణమని, ఎవరి కుల వృత్తిని వారు అనుసరించడం వల్ల ఎటువంటి పోటీలేని ఆర్థిక వ్యవస్థ భారత సమాజంలో ఉన్నదని సమర్థించాడు. ఆనాడే అంబేద్కర్‌ను ప్రధాని చేయాలన్న ఆలోచనకూడా గాంధీజీకి రాలేదు. ఇప్పటికైనా దళితులు ఐక్యత ప్రదర్శించాలి. అంబేద్కర్ పేరుతో చేసే రాజకీయాలను దునుమాడాలి. ఎన్నికల్లో ఐక్యత చాటాలి. తమను రాజకీయంగా వాడుకుంటున్న నేతల నిజస్వారూపాలను గుర్తించాలి. అప్పుడే అంబేద్కర్ మహాశయుడి ఆశయాలను సాధించగలం.

# పౌల్ట్రీ పరిశ్రమలో నష్టాలే ఎక్కువ

**- ధరలు పెరుగుతున్నా నష్టాలే అధికం**

**- పరిశ్రమల యజమానుల ఆవేదన**



**విజయవాడ:** కరోనా దెబ్బతో తొలినాళ్లలో పౌల్ట్రీ పరిశ్రమ విలవిల్లాడుతోంది. చికెన్ అమ్మకాలు తగ్గాయి. పలు ప్రాంతాల్లో అయితే ఏకంగా కోళ్లను బొందపెట్టారు. అమ్ముకోలేక, కోళ్లను సాకలేక రైతులు నానాయాతన పడ్డారు. చికెన్ కిలో ధర 50కి పడిపోయింది. కానీ ఇప్పుడు మళ్లీ ధరలు పెరిగాయి. కిలో 300కుచేరువలోకి వచ్చింది. దీనికితోడు ఎండాకాలం కావడంతో మరింతగా ధరలుపెరిగే అవకాశం ఉంది. అయినా నష్టాలు తప్పడం లేదని పౌల్ట్రీరైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండేళ్లలో కరోనా దెబ్బకు అన్ని రంగాల్లో మాంద్యం నెలకొంది. మార్కెట్లు కుప్పకూలాయి. బంగారం ధరలు అందుకోలేనంతగా పెరుగుతున్నాయి. ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నవారికి ప్రభుత్వం పారిశ్రామిక రాయితీలు ఇస్తూ వస్తోంది. కానీ ధరలతో దెబ్బతింటున్న సామాన్యులకు మాత్రం ఊరట దక్కడం లేదు. రాష్ట్రంలో పౌల్ట్రీరంగం దాదాపు 25 లక్షల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నది. కోళ్లు, గుడ్లు మంచి ప్రొటీన్ అని, ఎలాంటి అనుమానాలు లేకుండా తినాలని.. వస్తున్నప్రచారం నేపథ్యంలో ఇప్పుడిప్పుడే పౌల్ట్రీ పరిశ్రమ మళ్లీ పుంజుకుంటోంది. కరోనా కారణంగా పౌల్ట్రీ రంగం కుదలేయ్యింది. మనిషి ప్రాణాలతో చెలగాటమాడుతున్న మాయదారి మహమ్మారి కరోనా.. అన్నిరంగాలను దెబ్బేసింది. దీనికి తోడు వేసవిలో సాధారణంగా వచ్చే వైరసతో కోళ్లు చనిపోతుండడం కూడా పరిశ్రమకు శాపంగా మారింది. బర్డ్ ఫ్లూ వచ్చినపుడు ఎలాంటి పరిస్థితి ఉందో కరోనా కారణంగా పరిస్థితి ఘోరంగా ఉంది. కేవలం అపోహల వల్లే పరిశ్రమ దారుణంగా దెబ్బతింది. బర్డ్‌ఫ్లూ సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పావలా వడ్డీకి రుణాలు ఇప్పించాయి. ఇప్పుడు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆదుకోకపోతే పౌల్ట్రీ రంగం నామరూపాల్లేకుండా పోతుంది. దీనిపై ఆధారపడ్డ అనేక అనుబంధ పరిశ్రమలూ దెబ్బతింటాయి. దీని నుంచి గట్టెక్కకపోతే ఈ రంగంపై ఆదారపడి జీవిస్తున్న లక్షలాదిమందికి ఉపాధి దెబ్బతినే ప్రమాదం ఉంది.

# రైతులను ఆదుకోలేని బీమా పథకాలు



ఎన్నికల్లో హామీలు ఇవ్వడం..గెలిచిన తరవాత నాలుక మడతేయడం నాయకులకు అలవాటుగా మారింది. రైతుల ఆదాయం రెండింతలు చేస్తామన్న మోడీ హామీ పదేళ్లయినా నెరవేరలేదు. నిజానికి దేశంలో పుష్కలంగా నీటివనరులు, సారవంతమైన భూములు ఉన్నా వాటిని సద్వినియోగం చేసుకునే ఇంజనీరింగ్ నైణ్యాలను పాలకులు ప్రదర్శించడం లేదు. నదీజలాలు సముద్రం పాలుకాకుండా...ఏటా వరదలతో అతలాకుతలం కాకుండా...ఆనకట్టలు కట్టాలన్న స్పృహలేకుండా పోతోంది. డబ్బుల కక్కుర్తితో కట్టిన కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు పనికారాకుండా పోతున్నాయి. నదుల అనుసంధానం అన్న మాటే మోడీ ఎత్తడం లేదు. దేశంలో అన్నిరకాల పంటలకు అనువైన నేలలు ఉన్నా, సమగ్ర పంటల విధానం రావడం లేదు. దీంతో రైతులకు పంటలను పండించడం ఎంత కష్టంగా మారిందో..అమ్ముకోవడం అంతకుమించిన భారంగా మారుతోంది. పంటల కొనుగోళ్లు,బీమాల విషయంలో ప్రభుత్వాలు స్పష్టమైన జాతీయ విధానాల ను అవలంబించడం లేదు. దీంతో పంటలు చేతికి వచ్చినప్పుడు ధరలు లేక పోవడం..పంటలు నష్టపోయి నప్పుడు బీమా సొమ్ము అందక పోవడం షరామామూలుగా మారింది. ప్రధానంగా వాణిజ్యపంటల విషయంలో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. దీనిని సవాల్‌గా తీసుకుని రైతులకు అండగా నిలవాల్సిన పాలకులు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారు. ఇప్పటికీ దేశవ్యాప్తంగా సరైన బీమా విధానం లేదు. ఉన్నా రైతులకు అవగాహన లేదు. దీనిని జాతీయ విధానంగా తీసుకుని రవాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా పంటలు నష్టపోతున్నరైతులకు సరైన బీమా సౌకర్యం అందడం లేదు. గ్రామాల వారీగా కాకుండా పంట వారీగా బీమా సౌకర్యం రావాల్సి ఉంది. వ్యవసాయం చుక్కాని లేని నావలా తయారవగా వాణిజ్య పంటల సాగు జూదాన్ని తలదన్నింది. మునుపటి ఏడాది మిర్చికి కాస్త రేటు పడటంతో ఖరీఫ్‌లో రైతులు అటు మళ్లారు. రికార్డు స్థాయిలో ఎపిలో లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి అయింది. కౌలు రైతులకైతే లక్షన్నర. పెట్టుబడులు పూర్తిగా నష్టపోయిన రైతులు న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో మిర్చికి తామర తెగులు పలు రాష్ట్రాల్లో వ్యాపించినందున జాతీయ విపత్తుగా ప్రకటించి సాయం చేయాల్సిన కేంద్రం చేతు లెత్తేసింది. రాష్ట్రం కేంద్రాన్ని నిలదీయకుండా లేఖలతో సరిపెట్టింది. వీరిద్దరి మధ్య రైతులు సమిధలవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వమైనా మిర్చి రైతులను ఆదుకుందా అంటే అదీ లేదు. అధ్యయన కమిటీల పేరుతో కాలక్షేపం చేసింది. అలాగే గతంలో వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు స్వల్ప విస్తీర్ణానికి పదో పరకో ఇచ్చి చేతులు దులిపేసుకుంది. ఎంత మందికి ఎంత మొత్తంలో ఎప్పటికి ఇన్సూరెన్స్ వస్తుందో పెద్ద పజిల్‌గామారింది. ఒక వైపు అంతుబట్టని తెగుళ్లు, వైరస్‌లు ఇంకో వైపు నకిలీ, కల్తీ విత్తనాల కారణంగా విపరీతంగా నష్ట పోతున్నారు. వీటిని తట్టుకోలేని రైతులు ఉసురు తీసుకుంటున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఆదుకోవడానికి సమగ్ర పంటల బీమా ఉండాల్సిందే. రైతులు ఏ రకంగా పంటలు నష్టపోయినా అండగా ఉండేలా బీమా సౌకర్యం రావాల్సి ఉంది.పట్టెడన్నం పెట్టే రైతులు తమకు చిన్నబాధ వచ్చినా తట్టుకోలేని దైన్య స్థితిలో ఉన్నారు. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో పత్తి,మిర్చి పంటలతో పాటు,పసుసు రైతులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రధానంగా మిర్చి రైతులు తెగుళ్ల కారణంగా లక్షలాది రూపాయల నష్టాన్ని మూటగట్టుకున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో సాగయ్యే రెండు ప్రధాన వాణిజ్య పంటలు మిరప, పత్తి రైతాంగం ఆసాంతం పెట్టిన పెట్టుబడులు కోల్పోయి ప్రభుత్వ పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. మిర్చికి ఇటీవల రికార్డు ధరలు పెరిగాయి. కానీ ధరలు పలికిన సమయానికి మిర్చి బాగా దెబ్బతింటోంది. ఎపిలో ఎప్పటి నష్టాలకు అప్పుడే పరిహారం అంటున్న సర్కారు మిర్చి, పత్తి విషయంలో నాన్చుడు దారి పట్టి రైతులను క్షోభకు గురి చేస్తోంది. తామర తెగులు సోకి మిర్చి, నకిలీ విత్తనాల వలన పత్తికి నష్టం వాటిల్లగా, ఈ నష్టాలకు ప్రభుత్వ పూచీ ఏమిటో ఇప్పటికైతే స్పష్టత లేదు. వివిధ కారణాలతో పంట నష్ట పోయిన రైతులకు తక్షణం పరిహారం అందించి ఆసరా కల్పించాల్సిన సర్కారే సాకులు చెప్పి పరిహాసం ఆడటం అమానవీయం. పరిహారంపై రైతులకు కనీసం భరోసా సైతం కల్పించకపోవడం అన్యాయం. ప్రభుత్వ తీరుపై ఆగ్రహించిన మిర్చి, పత్తి రైతులు రోడ్డెక్కుతున్నారు. పత్తి రైతుల గోడు చెప్పనలవి కాదు. నకిలీ, కల్తీ, నాసిరకం విత్తనాల వలన పంట నష్టపో యిన రైతులకు కంపెనీల నుండి పరిహారం ఇప్పించేందుకు 2011లో ప్రభుత్వం ఇచ్చిన జీవో పైనా ఇలాగే కంపెనీలు కోర్టుకెళ్లాయి. ఇక్కడా ప్రభుత్వ స్పందన లేదు. దాంతో ప్రభుత్వం కంపెనీలకు అనుకూలంగా ఉందనే భావన కలుగుతోంది. గతంలోనూ నకిలీ మిర్చి నారు, మిర్చి విత్తనాలతో రైతులు నష్టపోయారు. ఇంతా జరుగుతున్నా ఆర్‌బికెలు, గ్రామ సచివాలయాలు, ఇంటెలిజెన్స్, పోలీస్, వ్యవసాయ శాఖలు ఏం చేస్తున్నాయో తెలీదు. నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఆ దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలి. నష్టపోయిన మిర్చి, పత్తి రైతులను సత్వరం ఆదుకోవాలి. వారికి జాతీయస్థాయిలో పంటల బీమాను తీసుకుని రావాలి. అప్పుడే వారికి న్యాయం జరుగుతుంది. ఈ వైపుగా ఆలోచనలు చేసి సమగ్ర పంటల బీమా అమల్లోకి తీసుకుని రావాల్సి ఉంది. అలాగే నకిలీ విత్తనాలు అంటగట్టే వ్యాపారులపై కఠిన చర్యలకు అవకాశం ఉండాలి.

# దేశ సమస్యలపై స్పష్టమైన హామీ ఏదీ ?


దేశంలో మళ్లీ తమదే అధికారం అని బిజెపి ఘంటాపథంగా చెబుతోంది. ఎన్‌డిఎ 400 సీట్లు సాధిస్తుందన్న ధీమాలో ఉంది. కాంగ్రెస్ తమకు పోటీ కాదని, ఇండియా కూటమికి ప్రజల అండలేదని ప్రచారం చేసు కుంటోంది. ఈ క్రమంలో బిజెపి పదేళ్ల పాలనను గీటురాయిగా తీసుకుంటే..అనేక విషయాలు చర్చించాల్సి ఉంటుంది. ప్రధానంగా పెట్రో, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. జిఎస్టీ పేరుతో ప్రజల నడ్డి విరుస్తు న్నారు. నోట్ల రద్దు కారణంగా సామాన్యులు పడ్డ ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. నిరుద్యోగం చెప్పడానికి లేదు. ఉద్యోగాల కల్పన, ఉద్యోగాల భర్తీ, ఉపాధి అవకాశాలు అసలు లేకుండా పోయాయి. యువత సర్టిఫికెట్లు పట్టుకుని విదేశాలకు చెక్కేస్తున్నారు. ఈ దేశంలో బతకలేమని కూలీలు గల్ఫ్ దేశాలకు వెళు తున్నారు. రైతులకు మద్దతు ధరలు దక్కడం లేదు. బియ్యం ధరలు అమాంతంగా పెరిగాయి. ఉప్పులు,పప్పులు మొదలు నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. గృహసంబంధ సిమెంట్, ఇసుక, ఇనుము తదితర వస్తువుల ధరలు విపరీతంగా పెంచేస్తున్నారు. సామాన్యులు ఇల్లు కొనుక్కుని బతికే అవకాశం లేకుండా చేశారు. కేవలం ప్రభుత్వం కట్టించే ఇళ్లపై ఆధారపడేలా చేస్తున్నారు. ఇదంతా కూడా అభివృద్దికి చిహ్నమా అన్నది చర్చించాలి. ప్రధాని మోడీ చెబుతున్న వికసిత్ భారత్‌కు ఇదంతా నిదర్శనంగా చూడాలి. బేటీపడావో..బేటీ బచావో నినాదంగా మారింది. అమ్మాయిలు చదువుకునే పరిస్థితి లేదు. కనీసం బాలికా విద్యకు అవసరమైన రుణాలకు కూడా వెసలుబాటు లేదు. ఈ క్రమంలో బిజెపి ప్రకటించిన మేనిఫెస్టోలో ఈ అంశాలేవీ చర్చించలేదు. సరికదా స్పృశించలేదు. దేశంలో రైతులు కీలకమైన ఓటు బ్యాంకుగా ఉన్నారు. దీంతో ఈ వర్గాన్ని ఆకట్టుకునేందుకు రెండు పార్టీలు ప్రయత్నించాయి. వ్యవసాయాన్ని సాంకేతికతను జోడించడంతో పాటు.. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను బలోపేతం చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. కనీస మద్దతు ధరపెంచుతామని తెలిపింది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన విధంగా చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో తెలిపింది. వ్యవసాయ ఫైనాన్స్‌పై శాశ్వత కమిషన్ ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చింది. నిజానికి వ్యవసాయ రంగం అతిపెద్ద పరిశ్రమగా పాలకులు గుర్తించడం లేదు. దీనిని గుర్తించి అనుబంధ పరిశ్రమలు చేపడితే దేశంలో సగం నిరుద్యోగం పోతుంది. అలాగే దేశీయంగా పంటలకు ప్రాధాన్యం పెరుగుతుంది. కానీ రెండు పార్టీలు ఈ రంగంపై పెద్దగా విశ్లేషణ చేయడం లేదు. మహిళా సాధికారత సాధించే దిశగా గ్రామీణ మహిళలను లక్షాదికారులు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపింది. అలాగే మహిళల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తామని బీజేపీ మేనిఫెస్టోలో తెలిపింది.మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి పేదింటి మహిళకు షరతులు లేకుండా ఏడాదికి లక్ష రూపాయిలు నేరుగా ఖాతాల్లో జమచేస్తామని తెలిపింది. 2025 నుంచి మహిళలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 50శాతం రిజర్వేషన్లు. ప్రతి జిల్లాలో కనీసం ఒక సావిత్రీబాయి పూలే హాస్టల్‌తో వర్కింగ్ ఉమెన్ హాస్టళ్ల సంఖ్యను రెట్టింపు చేస్తామని తెలిపింది. సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ కోసం రూ. 25 లక్షల వరకు నగదు రహిత ఆరోగ్య సేవలు పొందే విధంగా బీమా పథకం అమలు, పబ్లిక్ హెల్త్ సెంటర్లలో అన్ని పరీక్షలు, మందులు ఉచితంగా అందిస్తామిన కాంగ్రెస్ తెలిపింది. . ఇలాగే వెళితే దేశంలో సామాన్యులు, పేదలు, మధ్యతరగతి వాళ్లు బతకడం కష్టం కాగలదు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు కావడం లేదు. పేదలు మరింత పేదలుగా, ధనవంతులు మరింత ధనవంతులుగా మారేలా ప్రభుత్వ విధానాలు ఉంటున్నాయి. దేశంలో సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఈనెల 19న తొలివిడత పోలింగ్ జరగనుంది. ఏడు విడతల్లో ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. గెలుపు కోసం రాజకీయ పార్టీలు వ్యూహాలను సిద్ధం చేశాయి. ముందు ప్రజలను ఆకర్షించేందుకు మేనిఫెస్టోలతో అన్ని పార్టీలు సిద్దం అయ్యాయి. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీలు తమ మేనిఫెస్టోలను విడుదల చేశాయి. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయి. తమను గెలిపిస్తే ఏం చేస్తామో ప్రజలకు వివరిస్తున్నారు. కాంగ్రెస్ 'న్యాయ్ పత్ర్ ' పేరుతో బీజేపీ 'సంకల్ప్ పత్ర్' పేరుతో ఎన్నికల ప్రణాళికను విడుదల చేశాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు, కాంగ్రెస్, బీజేపీ తమ తమ మేనిఫెస్టోలను విడుదల చేశాయి. మోదీ గ్యారెంటీ క్యాప్షన్‌తో బీజేపీ సంకల్ప్ పత్ర్ విడుదల చేయగా.. మహిళలు, యువత, నిరుపేదలు, రైతులు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ న్యాయ పత్ర్‌ను రూపొందించింది. ఓ రకంగా చెప్పాలంటే రెండు పార్టీలు యువతను ఆకర్షించే ప్రయత్నం చేశాయి. ఎందుకంటే యువ ఓటర్ల సంఖ్య దేశంలో గణనీయంగా పెరిగింది. బీజేపీ తన మేనిఫెస్టోలో పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా చట్టాలు చేస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను సత్వరమే భర్తీ చేశామని, స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపింది. కానీ పదేళ్ల పాలనా కాలంలో ఉద్యోగాల కల్పన అన్నది లేకుండా పోయింది. ప్రచారాడంబరం తప్ప ఉద్యోగాలు లేక యువత రోడ్డున పడుతోంది. ఉన్నత చదువులు చదివినా కొలువులు కానరావడం లేదు. దేశాన్ని గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చి ఉపాధి అవకాశాలు పెంచుతామని బిజెపి మరోమారు యువతను మోసం చేసే ప్రయత్నం చేసింది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మద్దతుగా ముద్ర రుణాల పరిమితిని పెంచుతామని కూడా పేర్కొంది. కానీ ప్రభుత్వ ఉద్యోగాల కల్పనపై స్పష్టమైన హామీని ప్రకటించలేదు. అయితే ఇందుకు భిన్నంగా నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి యువ న్యాయ్ కార్యక్రమం అమలు చేస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో తెలిపింది. డిప్లొమా, గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన 25 ఏళ్లలోపు యువకుల కోసం రైట్ టు అప్రెంటీస్‌షిప్ చట్టం తీసుకొస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో 30 లక్షల ఖాళీలను భర్తీ చేస్తామిన తెలిపింది. అధికారంలో ఉన్న బిజెపి మాత్రం ప్రభుత్వ ఖాళీల భర్తీకి ముందుకు రాలేదు. ఇకపోతే సీనియర్ సిటిజన్ల కోసం రెండు పార్టీలు తమ మేనిఫెస్టోలో వివిధ హామీలు ఇచ్చాయి. 70 ఏళ్లు పైబడిన వారికి ఆయుష్మాన్ భారత్ పథకం కింద వైద్య సేవలు అందిస్తామని తెలిపింది. తీర్థయాత్రలు చేపట్టే సీనియర్ సిటిజన్లకు రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపింది. దివ్యాంగుల హక్కుల చట్టం 2016ను కఠినంగా అమలు చేస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పేర్కొంది. సీనియర్ సిటిజన్లు, వితంతువులు, దివ్యాంగులకు జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం కింద పెన్షన్‌ను వెయ్యి రూపాయిలకు పెంచుతామని చెప్పింది. సీనియర్ సిటిజన్లకు ప్రజా రవాణాలో ప్రయాణ రాయితీలను పునరుద్దరిస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పేర్కొంది. రెండు పార్టీలు అన్నివర్గాలను ఆకట్టుకునే విధంగా తమ మేనిఫెస్టోలో పథకాలను పొందుపర్చాయి. కానీ సమస్యలను పరిష్కరించే చిత్తశుద్ధి ఈ రెండు పార్టీలకు లేదని గతంలో వీరి పాలనా కాలం తీరు చూస్తే అర్థం చేసుకోవచ్చు

# ప్రజల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

**- ప్రధాన సమస్యలపై ఫోకస్ పెట్టని విపక్షం - మోడీ వికసిత భారత్ పేరుతో డంబాచారం**

**న్యూఢిల్లీ:** వికసిత భారత్ పేరుతో ప్రకటనలు మార్మోగుతున్నాయి. ప్రజలకు ఎలా మేలు చేశారో మోడీ గ్యారెంటీలతో ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ సామాన్యులకు మాత్రం ఏం మేలు జరిగిందో చెప్పడం లేదు. ఉచిత రేషన్ అంటున్నారు. కోట్లాది ఇళ్లు కట్టామని అంటున్నారు. ఇన్ని చేసినా ప్రజల జీవితాలు మాత్రం మారలేదు. కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న ఆర్థిక విధానాలు సామాన్యులకు గుదిబండగా మారుతున్నాయి. వారి ఆర్థిక జీవనచిత్రం ఛిద్రం అవుతోంది. తాజాగా కేంద్ర ఆర్థికశాఖ తీసుకున్న నిర్ణయం సామాన్యులకు శరాఘాతంగా మారింది. ఈ విషయాలపై పార్లమెంటులో ఎక్కడా చర్చించడం లేదు. రాజకీయంగా తమకు లబ్ది చేకూర్చే విషయాలపై మాత్రమే విపక్షాలు గొంతెత్తుతున్నాయి. అందుకోసం పార్లమెంట్ సమావేశాలను స్తంభింప చేస్తున్నాయి. నిజానికి అంతకు మించిన సంక్షోభం ఇప్పుడు ప్రజలు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా పాన్ నంబర్‌తో ఆధార్ లింక్ చేయడం...వచ్చే ఆర్థిక సంవత్సరం జీవితబీమా మొత్తంపై టాక్స్ విధిస్తూ తీసుకున్న నిర్ణయాలు పేద,మధ్య తరగతి ప్రజలపై పెనుభారంగా మారబోతోంది. ఈ దొంగ దోపిడీ నిర్ణయాలను విపక్షాలు కనీసం గమనించినట్లుగా కూడా లేదు. ఇప్పటికే పాన్‌తో ఆధార్ లింక్ అయివుంటే ఫర్వాలేదు.. కానీ లింక్ చేయాల్సిందే. దీనికి కూడా ఐటి విభాగం ఒక్కో వ్యక్తికి వేయ రూపాయలు వసూలు చేస్తోంది. ఇక నెట్ సెంటర్లలోకి వెళ్లి లింక్ చేసుకోవాలంటే అదనంగా మరో 200 రూపాయలు కట్టాల్సి వస్తోంది. ఇది సామాన్యులపై ఎంతగా భారం పడుతుందో కేంద్ర పాలకులు గమనించడం లేదు. ప్రతి పనికీ ఆధార్, పాన్ అవసరం కావడంతో ప్రజలు తప్పనిసరిగా లింక్ చేసుకుం టున్నారు. ఇదికూడా కేంద్రానికి ఆదాయ వనరుగా మారింది. ఇలా లింక్ చేయడం వల్ల కేంద్రానికి కనీసంగా ఓ 40,50వేల కోట్ల ఆదాయం సమకూర బోతోంది. అలాగే లింక్ చేయకుంటే 50వేలకు పైగా లావాదేవీలపై పదివేల వరకు పెనాల్టీ కట్టాల్సి వస్తుంది. ఇది ప్రజల్లోకి పెద్దగా వెళ్లడంలేదు. దీనిని వెంటనే ప్రజలు గమనించి ముందుకు వెళితే మంచిది. ఇకపోతే ప్రజలు పైసాపైసా పొదుపు చేసుకుని కట్టే జీవితబీమా పాలసీపైనా ఇప్పటికే జిఎస్టీ వసూలు చేస్తున్నారు. హెల్త్ పాలసీలపైనా జిఎస్టీ పేరుతో దండుకుంటున్నారు. గత ఏప్రిల్ నుంచి ఇది అమల్లోకి వచ్చింది. ఎవరైనా కూడా కొత్తగా జీవితబీమా చేయదల్చుకుంటే... పాలసీ మెచ్యూరిటీ అయిన తరవాత వచ్చే రాబడిపైనా పన్ను విధించబోతున్నారు. ఇది కనీసం 6శాతంగా ఉండబోతోంది. మోడీ ప్రభుత్వం ఇలా ప్రజలను వేపుకుతింటున్న తీరును ప్రజలు గమనించాలి. ఇప్పటికే గ్యాస్ సిలిండర్ ధరలు మోత మోగిస్తున్నాయి. అయితే తెలివిగా ఎన్నికల ముందు వంద రూపాయలు తగ్గించారు. పెట్రోధరలు మంటపెడుతున్నాయి. పెద్దనోట్ల రద్దు మొదలు జీఎస్‌టీ వరకు ప్రజల జీవితాలను మోడీ ఆర్థిక విధానాలు అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఢిల్లీలో కూర్చుని తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా సామాన్యులు అతలాకుతలం అవుతు న్నారు. అచ్ఛేదిన్‌కు నిర్వచం లేకుండా పోయింది. కేవలం కొందరి స్వార్థం కోసం, కొందరి ప్రయోజనాల కోసం 90శాతం భారతీయులు ఇబ్బందులు పడాల్సిన దుర్భర పరిస్థితులు దేశంలో నెలకొన్నాయి. అయినా తమేదో ఘనకార్యం చేస్తున్న ట్లుగా బిజెపి పాలకులు బాకాలు ఊదుతు న్నారు. కాంగ్రెస్ కూడా ఇలాంటి సమస్యలపై ఫోకస్ చేయడం లేదు. వారు కూడా ఓట్ల కోసం నగదు బదిలీ పథకాలనే నమ్ముకున్నారు. మహిళలకు ఏటా లక్ష వరకు ఖాతాల్లో వేస్తామని ప్రకటించారు. ఇప్పటికే జీఎస్టీ భయాలు వెన్నాడు తున్నా వాటిని సవరించి ఆదుకుంటామన్న ఒక్కమాట కూడా ప్రభుత్వం నుంచి రావడం లేదు. దీంతో ప్రజలకు ఈ ప్రభుత్వం భరోసగా లేదన్న విషయం అర్థం అవుతోంది. విపక్షాలు కూడా సమస్యలను చర్చించడానికి పార్లమెంట్‌లో అవకాశాలు వచ్చినా వదులుకుని, గొడవలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సమస్యను సమస్యగా చర్చించడంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు పూర్తిగా విఫలమయ్యారు. పార్లమెంటులో సమస్యలను ప్రస్తావించడం కన్నా గొడవ చేసి వాయిదా వేయించడంలోనే గత పదదేళ్ల కాలం గడిపారు.

# మోడీ గ్యారెంటీ అంటే జైలుకు పంపడమేనా!



మోడీ గ్యారెంటీ అంటే...విపక్ష నేతలను జైళ్లకు పంపించడమేనని బెంగాల్ సిఎం మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు సత్యదూరం కాదు. జార్ఖండ్ సిఎం హేమంత్ సోరెన్, కేజ్రీవాల్ అరెస్ట్ తరవాత విపక్షాల్లో కొంత భయం వచ్చింది. అయితే తప్పులు చేయనిదే ఇడి, సిబిఐ ఏమీ చేయలేవని తెలుసుకోవాలి. అలాగే చట్టాలకు తాము అతీతం అన్న భ్రమలను పాలకులు వీడాలి. ఢిల్లీ హైకోర్టు కేజ్రీవాల్ విషయంలో ఇదే వ్యాఖ్య చేసింది. సిఎం అయినంత మాత్రాన అవినీతి కేసుల్లో తప్పించుకోలేరని, అందరిలాగే సిఎంకు కూడా చట్టం వర్తిస్తుందని తెలిపింది. అవినీతి చర్యలకు పాల్పడే వారు ఎంతటి ఉన్నతస్థానంలో ఉన్నా శిక్షకు గురి కావాల్సిందే. జగన్, కెసిఆర్ విషయంలోనూ అవినీతి కేసులను తవ్వి తీయాల్సిందే. అలాగే విపక్షాలు కూడా విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నాయి. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయి. అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అప్పులు చేసి, ఆస్తులు కూడబెట్టామని ప్రగల్భాలు పలుకుతున్నాయి. వేలకోట్ల అక్రమంగా సంపాదించి వ్యక్తిగత ఖజానాను నింపుకుంటు న్నాయి. తమ ముందున్న అన్ని మార్గాలను ఇందుకు వేదికగా చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్నాయి. ఇందకు ప్రత్యక్ష ఉదాహరణ తెలుగు రాష్ట్రాలని చెప్పవచ్చు. తెలంగాణను లూటీచేసి, అప్పుల పాలు చేసిన కెసిఆర్ అధికారం కోల్పోవచ్చు గాక..చేసిన నష్టం పూడ్చడ మెలా అన్నది కూడా ముఖ్యమే. ఎపిలో ఇంతకంటే దారునమైన పరిస్థితితులు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రాంతీలయ పార్టీల నేతలు చేస్తున్న అక్రమాలను నిలదీసేదెవరన్నదే ముఖ్యం. నిలదీయడమే కాదు.. అప్పులను ఎలా కడతారు.. ఎవరు కడతారన్నది కూడా ముఖ్యమే. అధికారం అనుభవించి, అప్పులు చేసిన వారు జవాబుదారీ తనం లేకుండా పోతే ఎలా? ఇకపోతే ప్రతిపక్షాలను వెంటాడే ముందు అధికార పక్షంలో అవినీతి జలగలను కూడా వదిలించాలి. అప్పుడే మోడీ చర్యల నిజాయితీ తెలుస్తుంది. ప్రతిపక్షం లేని ప్రజాస్వామ్య వ్యవస్థను సృష్టించడం సాధ్యం కాదు. తెలంగాణలో కెసిఆర్ కూడా ఇలాగే చేసి దెబ్బ తిన్నారు. విపక్ష కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలను అణగదొక్కితే తమకు తిరుగులేదని భావించారు. కాంగ్రెస్ ముక్త భారత్ కోసం మోడీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం వేయని ఎత్తులు లేవు. ఆర్థికంగా ప్రతిపక్షం పీకనొక్కడం ద్వారా కాంగ్రెస్ ముక్త్ భారత్' అన్న మోడీ 'కల' నెరవేర్చు కునేందుకు పన్నాగం పన్నుతూనే ఉన్నారు. దీంతో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రూపాయి పుట్టకుండా చేశారు. ఖాతాలను స్తంభింప చేశారు. దేశంలో అధికార పక్ష నేతల నుంచి కార్పొరేట్ సంస్థల అధి నేతల వరకు ఎంతో మంది పన్నుఎగవేత దారులున్నారు. అంతెందుకు నిన్నగాక మొన్న నీరవ్ మోడీ ఆస్తులు వేలానికి లండన్ కోర్టు అనుమతి ఇచ్చింది. ఇలా పన్నులు ఎగవేస్తున్న నేతల చిట్టా తీయాలి. మన దేశానికి చెల్లించాల్సిన పన్ను బకాయి లెంతగా ఎగవేశారన్నది కూడ ఆపారిపోయిన వారి విషయంలో లెక్కలు వేయాలి. దేశం వదలి పారిపోయిన విజయ్ మాల్యా లాంటి వారిని ఎందుకు ఇంక ఉపేక్షిస్తున్నామో తెలుసుకోవాలి. కార్పోరేట్ కంపెనీటలకు పన్నులు మాఫీ చేయడం వంటి చర్యలు సహించరానదిగా భావించాలి. అలాంటి వారిని వదిలేసి దేశంలో అనేకులపైన దాడులు చేస్తున్నారు. రాజకీయ పార్టీలకు జరిమానాలు విధిస్తూ, నోటీసులు మీద నోటీసులు జారీ చేయడం దేనికి సంకేతం? అంటే..మమతా బెనర్జీ చెప్పినట్లుగా విపక్షాలను బొక్కలో తోయమడే తమ లక్ష్యమని నిరూపించుకుంటున్నాని అనుకోవాలి. 370 సీట్లు గ్యారంటీ అంటూ మోడీ లెక్కలు వేయడం వెనకా ఈ కుట్ర దాగివుందని విపక్షాలు ఆరోపిస్తున్నా యి. మొత్తంమీద కాంగ్రెస్‌కు సంబంధించిన 11 బ్యాంకు ఖాతాలను స్తంభింప చేసింది. ఎన్నికలు జరగనున్న సమయ ంలో ఇలా ప్రధాన ప్రతిపక్ష పార్టీ బ్యాంకు ఖాతాలు జప్తు చేయ డం అంటే ఆ పార్టీని ఆర్థికంగా నిస్తేజం చేయడమే. అంటే ఎన్నికల సమయంలో కాంగ్రెస్ తమ నాయకుల పర్యటన కోసం కనీసం రైలు టికెట్లు కొనే స్థితిలో కూడా లేకుండా చేయాలని మోడీ ప్రభుత్వం కుట్రగా ఉందిన రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు గమనార్హం. లెక్కలు చూపడంలో కాం గ్రెస్ అలస్యం చేసిన మాట వాస్తవం. అయితే పద్ధతి ప్రకారం, చట్టం ప్రకారం కాగ్రెస్‌పై చర్యలు తీసుకుని ఉంటే విమర్శలు రావు. 2017-18 నాటి లెక్కలు చూపనందుకు కూడా కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను జప్తు చేశారని రాహుల్ తెలిపారు. నిజానికి రాజకీయ పార్టీలు ఆదాయం పన్ను లెక్కలు కరెక్ట్‌గా చూపాలి. లెక్కలు ఆదాయపు పన్ను శాఖకు అందజేయాలి. ఈ విషయంలో కాంగ్రెస్ పొరపాటు చేసిందనే అనుకున్నా బ్యాంకు ఖాతాలు జప్తు చేయించడానికి ఎన్నుకున్న సమయం ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో స్పష్టంగానే తెలుస్తోంది. ఇంత తీవ్రమైన చర్య తీసుకోవడం వెనక విపక్షాలను ఎన్నికల సమయంలో ఆర్థికంగా దెబ్బచేయాలన్న కుట్ర దాగి ఉందను కోవడానికన్నా మించిన కారణం ఏమీ కనిపించడం లేదు. ప్రజాస్వామ్యం గొంతునొక్కడానికే తమ బ్యాంకు ఖాతాలు జప్తు చేశారని కాంగ్రెస్ ఆక్రోశించింది. కాంగ్రెస్ విషయంలోనో, వామపక్షాలపైనో ఈ దుర్నీతికి పాల్పడిందని సరిపెట్టుకోవడానికి వీల్లేదు. తప్పు చేసిన వారిని శిక్షించడంలో వెనకాడవద్దు. ప్రజాస్వామ్యంలో విశ్వాసం ఉన్న వారందరూ తీవ్రంగా పట్టించు కోవలసిన అంశమిది. ఎన్నికల బాండ్లలో బీజేపీ బండారం బయట పడిన వెనువెంటనే కేంద్రం కాంగ్రెస్‌పై ఆదాయ పన్నుశాఖ ను ఉసిగొల్పిందన్న విమర్శలూ ఉన్నాయి. ఎన్నికల ముంగిట లెక్కా పత్రం,హద్దూ పద్దూ లేని జరి మానాలు విధించి ప్రతిపక్షాలను ఎన్నికల ప్రచారం కూడా చేసుకో నీయకుండా ముందే ముందరి కాళ్లకు బంధాలు వేస్తోంది. మరో వైపు జార్ఖండ్ సీఎం సోరెన్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌లను అరెస్టు చేయడం,ఇతరులను దర్యాప్తుల పేరుతో వేధించడం, ఇదంతా గమనిస్తే ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా కమలదళం వేస్తున్న ఎత్తుగడలుగా భావించాలి. చట్టం అందరికీ ఒకేలా ఉండాలి. అందరినీ ఒకేలా చూడాలి. అధికార, విపక్షం అన్న విభేదాలు అస్సులు రాకూడదు. అవినీతి విషయంలో కూడా అందరినీ ఒకే గాటన కట్టాలి. అప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం మనగులుగుంది.

# గాంధీ కుటుంబ కనుసన్నల్లోనే పార్టీ

**- షాడో అధ్యక్షుడిగా నేతలను శాసిస్తున్న రాహుల్ - రాహుల్ సూచనలతోనే రానున్న ఎన్నికలపై వ్యూహం**





**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీలో నాయకత్వం మారినా..పెత్తనం అంతా ఇప్పటికీ ఆ ముగ్గురి చేతుల్లోనే ఉంది. వారి కనుసన్నల్లోనే పార్టీ నడుస్తోంది. సోనియా,రాహుల్, ప్రియాంకలే నిర్దేశం చేస్తున్నారు. ఎందరు నేతలు ఉన్నా గాంధీ కుటుంబ సభ్యులకు మించిన నాయకులు కనపడడం లేదు. రాహుల్ స్థానంలో రాగలిగిన నాయకుడెవరూ కాంగ్రెస్‌లో కనపడడం లేదు. రానున్న రోజులన్నీ కాంగ్రెస్‌కు పరీక్షను నిలిపేవే. రాహుల్ పార్లమెంట్ ఎన్నికల పోరులో విజయం సాధించేందుకు ఎలా కష్టపడతారన్నదే ముఖ్యం. ఎందుకంటే ఇప్పటి వరకు అన్నాచెల్లెళ్లు పెద్దగా సాధించేదేమీ లేదు. అలాగే వారు సాధిస్తారన్న ఆశలు కూడా లేవు. ఇకపోతే వీరిని కాదని సోనియా ఎలాంటి నిర్ణయం తీసుకునేలా లేరు. మరీ ముఖ్యంగా అధికారం దక్కితే రాహుల్‌కే పగ్గాలు కట్టబెట్టాలన్నది సోనియా వ్యూహంగా ఉంది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ తన సత్తానిరూపించుకోవాల్సి ఉన్నది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎక్కడా పెద్దగా ప్రభావం చూపలేదు. అయితే కర్నాటక, ఆ తరవాత తెలంగాణలో అధికారం దక్కడంతో కొంత ఊరట లభించింది. ప్రియాంకకు పగ్గాలు అప్పగిస్తే ఏమైనా అదృష్టం మారుతుందా అని కూడా కొందరు ఆలోచన చేస్తున్నారు. కాంగ్రెస్‌ను తుడిచిపెడితే బిజెపికి దేశంలో ఇక తిరుగుండదు. ఆ తర్వాత భారత రాజకీయాలు పూర్తిగా బిజెపి చేతుల్లోకి మారుతాయి. ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ కూడా పూర్తిగా కనుమరుగు కానుంది. కాంగ్రెస్ కనుమరుగు అయితే ప్రాంతీయ పార్టీలను బలిచక్రవర్తిలా తొక్కేయాలని మోడీ చూస్తారు. వివిధ పద్ధతులతో మోడీ ప్రస్తుతం అనుసరిస్తున్న వ్యూహం కారణంగా కాంగ్రెస్ గింగిరాలు కొట్టుకుంటోంది. ఐటి శాఖ నోటీసులు, అకౌంట్లు సీజ్ చేయడం, జరిమానాలు విధించడం అంతా ఓ పద్ధతి ప్రకారం సాగుతున్నాయి. కాంగ్రెస్ విముక్త భారత్ అన్న నినాదం పూర్తిగా సాకారం అయ్యే దిశగా భారత రాజకీయాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పూర్తిగా అంతమయితే ప్రాంతీయ పార్టీలను తుడిచిపెట్టడం బిజెపికి పెద్ద విషయం కాకపోవచ్చు. ఎందుకంటే ప్రాంతీయ పార్టీలన్నీ అవినీతి ఊబిలో కూరుకుని పోయాయి. ఈ అవినీతే అస్త్రంగా మోడీ వాటిని దునుమడే అవకాశం ఉంది. బలమైన ప్రతిపక్షం లేకుంటే నిరంకుశ విధానాలు అవలంబించేలా ప్రభుత్వ విధానాలు ఉంటాయి. అది దేశానికి క్షేమకరం కాదు. కాంగ్రెస్ పునరుద్ధరణ కాంగ్రెస్‌కు మాత్రమే ముఖ్యం కాదు, మొత్తం ప్రజాస్వామ్యానికి, మన సమాజానికి కూడా ఎంతో ముఖ్యం అని గుర్తించాలి. కాంగ్రెస్ జీవన్మరణ సమస్య నెదుర్కొంటున్నదని స్పష్టంగా తెలుసు. ప్రత్యర్థి చేతుల్లో ఓడిపోడం కంటే శాయశక్తులా పోరాడి కనీసం జీవించేందుకు ప్రయత్నించక తప్పనిసరి పరిస్థితిలో కాంగ్రెస్ ఉన్నది. ఇక ప్రస్తుతం ఓ ఎంపిగా మాత్రమే ఉన్న రాహుల్ షాడో అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. రాహుల్ నాయకత్వాన్ని ప్రశ్నించగల ధైర్యం కాంగ్రెస్ పార్టీలో ఎవరికీ లేదు. అయినా ఆయన భారత్ జోడో యాత్ర తరవాత పరిస్థితి మారుతోంది. క్రమంగా కాంగ్రెస్ పట్ల ప్రజల్లో కూడా ఆదరణ పెరుగుతోంది. కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ రాహిత్యాన్ని ఉల్లఘించినా పెద్దగా పట్టింపు ఉండదు. రెండు రకాలుగా నేతలను కాంగ్రెస్ అధిష్టానం పోషించడం అనాదిగా వస్తోంది. అందుకే అది అరాచక పార్టీగా పేరొందింది. అసమ్మతి లేకుండా గట్టిగా హెచ్చరికలు చేసిన దాఖలాలు లేదు. తెలంగాణలో ఇప్పుడు పిసిసి చీఫ్‌గా ఉన్న రేవంత్‌కు కూడా ఆ బాధ తప్పడం లేదు. కాంగ్రెస్‌లో అసమ్మతి నడిపడం ద్వారా నేతగా బలపడాలన్నదే కొందరి లక్ష్యంగా ఉంటుంది. తాజా పరిణామాలతో పార్టీలో నాయకులు అందరినీ కలుపుకుని విజయం వైపు నడిపించాలన్న ఆలోచనలో రాహుల్ ఉన్నట్లుగా ఉంది.దాని గురించి ఆ పార్టీ నాయకులు ఆలోచించాల్సి ఉన్నది. ఇందుకు అవసరమైన విశ్వసనీయమైన సమిష్టి నాయకత్వ బృందం ఏర్పర్చుకోవాల్సిన అవసరం ఉన్నది. రాష్ట్రాల్లో అసమ్మతి నేతలు చెలరేగకుండా చూసుకోవాలి. ముందు పార్టీలో చిల్లర రాజకీయాలను తగ్గించుకోవాలి. కలసికట్టుగా పోరాడాలన్న కార్యాచరణ సిద్ధం చేసుకోవాలి. అప్పుడే కాంగ్రెస్ కొంతయినా ప్రభావం చూపగలదు.

# బలమైన విపక్షం కూడా అవసరమే!

ప్రజాస్వామ్యం బలంగా సాగాలంటే బలమైన ప్రతిపక్షం అవసరం. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలపడాలను కుంటున్నా.. బలమైన నిర్ణయాలు తీసుకోవడం లేదు. బలంగా పోరాడడం లేదు. కనీసం ఇతర పక్షాలను కలుపుకుని పోవడంలోనూ వైఫల్యం కానవస్తోంది. ఇండియా కూటమిని బలంగా నిర్మించడం లోనూ విఫలమయ్యింది. దేశం ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నా...ప్రతిపక్షాలు ఉమ్మడిగా మోడీ ప్రభుత్వాన్ని నిలదీయలేక పోతున్నాయి. ప్రభుత్వ విధానాలను నిగ్గదీయలేకపోతున్నాయి. ఈ ఎన్నికల్లో కూడా పోటీని ఇచ్చేలా కనపడడం లేదు. ఎందుకంటే నితీశ్ మళ్లీ ఎన్డీఎ గూటికి చేరగా, మమతా బెనర్జీ సైలెంట్‌గా ఉన్నారు. కేజ్రీవాల్ జైలుకు వెళ్లారు. లా చెప్పుకుంటూ పోతే పెద్దగా బలమైన కూటమిగా కాంగ్రెస్ కానరావడం లేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ ఆకర్శణీయమైన మేనిఫెస్టోను ప్రకటించింది. దీనిపై ప్రజలు ఎలా స్పందిస్తారన్నది చూడాలి. అయితే ప్రధాన సమస్యలను చర్చించడంలో కాంగ్రెస్ మేనిఫెస్టో కూడా విఫలం అయ్యింది. ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న నిరుద్యోగం, జివిస్టీ తదితర అంశాలపై స్పష్టత కానరావడం లేదు. మరోవైపు కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నా, తన పాత్రను బలంగా నిర్వహించలేక పోతున్నది. మిగతా పార్టీలను కలుపుకుని అధికారపార్టీ ఆగడాలను అడ్డుకోలేకపోతున్నది. ప్రజలను అనేకానేక సమస్యలు వెన్నాడుతున్నాయి. ప్రజలు ప్రభుత్వ విధానాలతో నానాయాతన పడుతున్నారు. ప్రధానంగా పెట్రో ధరలు, గ్యాస్ ధరలు, నిత్యావసర ధరలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిజానికి సమస్యలపై చర్చించే విషయంలో ఉమ్మడిగా పోరాడలేక పోతున్నాయి. నిజానికి దేశంలో కాంగ్రెస్ పార్టీ దుస్థితి గురించి ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిది. బలపడాలన్న కాంక్ష కనిపించడం లేదు. ప్రజల పక్షాన పోరాడాలన్న తపన కానరావడం లేదు. ఒకరకంగా ప్రతిపక్ష పార్టీ బలంగా లేకపోవడం వల్ల మోడీ ఆడింది ఆటగా సాగుతోంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత తాము మరింత బలపడ్డామని, 400 సీట్లు సునాయాసంగా గెలుస్తామన్న ధీమా మోడీకి ఏర్పడింది. దీంతో మోడీ ప్రభుత్వం ప్రతిపక్షాలను ఖాతరు చేయడం లేదు. వారు ఇచ్చే ఎలాంటి సూచనలను కూడా పరిగణించడం లేదు. ధాన్యం సేకరణపై జాతీయ విధానం కావాలని రైతులు పట్టుబట్టి పోరాడుతున్నా ఖాతరు చేయడం లేదు. దీనిని బట్టి రైతులపట్ల మోడీ ప్రభుత్వానికి ఏ మాత్రం ప్రేమ ఉందో గమనించవచ్చు. బిజెపి అగ్రనేతలకు, దానిని సమర్థిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ నేతలకు కూడా ఇదే ధీమా ఏర్పడింది. పెట్రోలియం ధరలు ఎడాపెడా పెంచడం ఇందుకు సంకేతం. అయితే మోడీ నుంచి ఇంకా ఎటువంటి కీలక నిర్ణయాలు వెలువడ నున్నాయా అని భయపడవలసి వస్తోంది. ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు, బీమా సంస్థల ప్రైవేటీ కరణ,లేబర్ కోడ్‌ల అమలు, ప్రభుత్వ ఆస్తుల నగదీకరణతో పాటు మరిన్ని ఆర్థిక సంస్కరణల విషయంలో మరింత వేగంగా చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. సాగు చట్టాలను వెనక్కు తీసుకున్నా రైతుల గురించి ఆలోచించే దాఖలాలు కనిపించడం లేదు. కనీస మద్దతుధరకు విలువ లేకుండా పోతుంది. మద్దతు ధరల కోసం రైతులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోలేదు. ఒంటరిగా పోరాడి నందున కాంగ్రెస్‌కు ఫలితం దక్కడం లేదు. ప్రధాన సమస్యలపై కలసికట్టుగా పోరాడేందుకు వ్యూహం పన్నడంలో రాహుల్, సోనియాలు పూర్తిగా విఫలం అవుతున్నారు. మోడీకి కూడా విపక్షాలు అంటే అలుసుగా మారింది. దేశం గురించి గొప్పలు చెప్పుకుంటున్న బిజెపి నేతలు కూడా ప్రజల సమస్యలపై చర్చించాలన్న ఇంగితాన్ని ప్రదర్శించడం లేదు. నేతలు ఎవరు కూడా మోడీకి భయపడి ఏమీ మాట్లాడడం లేదు. ఈ క్రమంలో దేశంలో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. నిజానికి దేశంలో నేటికీ పంటల కొనుగోళ్లకు సంబంధించి ,మద్దతు ధరలకు సంబంధించి స్పష్టమైన విధానాలు లేవు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను ఎలాగైనా కొనుగోలు చేసి...వాటిని ప్రజలకు చేర్చాలన్న విధానాలూ లేవు. పంటల కొనుగోళ్లకు సంబంధించి జాతీయవిధానం, ఆహారపంటల ఎగుమతుల విధానాలను అమలు చేయడం లేదని వ్యవసాయ నిపుణులు ఎప్పటినుంచో మొత్తుకుంటున్నారు. సమస్యలను ఎత్తి చూపడంలో విపక్షాలు విఫలం అవుతున్నాయి. దేశంలో విభిన్న వాతావరణ పరిస్థితులు..విభిన్న ఆహారపు అలవాట్లు ఉన్నందున.. ఏ ధాన్యం ఎక్కడ ఎంత అవసరమో ..దానికి అనుగుణంగా ఏ పంటలు అవసరమో కేంద్రం వద్ద ప్రణాళిక లేదు. సమస్యలపై సమగ్రంగా చర్చించాలన్న స్పృహ విపక్షాలకు లేదు. అధికారపక్షానికి అంతకకన్నా శ్రద్ద లేదు. దేశంలో అనుత్పాదక రంగాలను పెంచి పోషిస్తూ.. దుబారా ఖర్చులు చేస్తున్నారు. వీటి గురించి ఎవరు కూడా నిలదీయడం లేదు. బ్యాంకులను ముంచినోళ్లను.. కంపెనీలు పెట్టి రుణాలు ఎగ్గొట్టినోళ్లను వెనకేసుకుని వస్తున్న మోడీ ప్రభుత్వం రైతులకు సంబంధించి ఆమోదయోగ్య విధానాలను మాత్రం రూపొందించడం లేదు. పంటల కొనుగోళ్లను రాష్ట్రాలకు వదిలేయడం వల్ల ధాన్య సేకరణ అన్నది ఇప్పటికీ ఓ మిధ్యగా మారింది. ఈ సమస్యలపై మోడీ దాటవేత ధోరణితో దేశం తీవ్ర సమస్యను ఎదుర్కోనుంది. అలాగే నిలదీ యకపోవడం వల్ల విపక్షాలు బలహీనంగా మారనున్నాయి. కాంగ్రెస్ ఈ అవకాశాలన్నీ వినియోగించు కోవడంలో పూర్తిగా విఫలం అయ్యిందనే చెప్పాలి. ఈ సమస్యలన్నీ ఎన్నికల ముందు చర్చించాల్సి ఉంది. అనేకానేక సమస్యలను ప్రస్తావించాల్సి ఉంది. విపక్షాలు కనీసం తమ ఎన్నికల ఎజెండాలో వీటిని పెట్టాలి. ప్రజలైనా ఆలోచన చేస్తారు. అప్పుడైన కొంత మేర అధికార బిజెపిలో కదలిక వస్తుందేమో చూడాలి.

# అంబేడ్కర్‌ను ప్రధానిగా అంగీకరించని గాంధీ

**నెహ్రూ ప్రభావంతో దూరం పెట్టిన మహాత్ముడు**

**ముంబై:** దేశంలో అంబేడ్కర్ ఎదుర్కొన్న వర్ణవివక్ష అంతాఇంతా కాదు. ఆయన జీవితమే అనుభవ పాఠంగా మారింది. స్వాతంత్ర్యానంతరం అంబేడ్కర్‌ను ప్రధానిని చేసివుంటే దేశ పరిస్థితి మరోలా ఉండేది. గాంధీ సైతం ఈ విషయంలో అంబేడ్కర్‌ను పక్కన పెట్టారనే చెప్పాలి. నెహ్రూ ప్రభావంతో ఆయన సుభాస్ చంద్రబోస్‌ను, స్వాతంత్ర్యానంతరం అంబేడ్కర్‌ను పక్కన పెట్టారు. 1927లో అంబేడ్కర్ 'బహిష్కృత భారతి' అనే మరాఠి పక్ష పత్రిక ప్రారంభించాడు. ఆ పత్రికలో ఒక వ్యాసం వ్రాస్తూ అంబేడ్కర్ ఇలా అన్నాడు. బాలగంగాధర్ తిలక్ గనుక అంటరానివాడుగ పుట్టివుంటే 'స్వరాజ్యం నా జన్మ హక్కు'అని ఉండేవాడు కాదంటాడు. అస్పృశ్యతా నివారణెళి నా ధ్యేయం, నా జన్మ హక్కు' అని ప్రకటించి ఉండేవాడని వ్రాశాడు. అంటే ఆనాడు అంబేడ్కర్ కులతత్వవాదుల బాధను ఎంతగా అనుభవించాడో దీన్ని బట్టి తెలుసుకోవచ్చు. అయితే అంటరాని వారుగా చూడబడుతున్న కులాల వారు తమ ఆత్మగౌరవాన్ని త్యాగం చేస్తూ సమాజ బాగు కోసం తాము చేసే వృత్తులను చేస్తున్నారని అటువంటి వారిని ఇతర వర్ణాల వారందరూ గౌరవించాలని పేర్కొన్నారు. ఇలా కుల, అంటరానితన సమస్యకు గాంధీ సామాజిక,సాంస్కృతిక పరిష్కారం చూపగా అంబేడ్కర్ ఈ విషయంలో గాంధీతో విభేదించాడు. ఎందుకంటే దాని పర్యవసానాలు ఎలా ఉన్నాయో ఈనాడు చూస్తున్నాం. దీనిని ఆనాడే అంబేడ్కర్ మహాశయుడు ఊహించి ఉంటాడు. అందుకే ఆనాడే గాందీతో అంబేడ్కర్ విభేదించాడు. నిజానికి ఆనాడే గాంధీ చిత్తశుద్ధితో ప్రయత్నం చేసివుంటే ఇవాళ సమాజం ఇంకెంతో ముందుకు..అంటే అంబేడ్కర్ ఆశించిన విధంగా పోయి వుండేది. గాంధీజీతో అనేక విషయాలలో విభేదించినా తాను మతం మారదలచు కున్నప్పుడు మాత్రం దేశానికి చాలా తక్కువ ప్రమాదకరం అయిన దానినే ఎన్నుకుంటానని ప్రకటించాడు.

# కుటుంబపెద్ద బాధ్యత ఇలాగే ఉంటుందా ?

భారతదేశ రాజకీయాలను పూర్తిగా నియంత్రించేందుకు రానున్న రోజుల్లో మోడీ ఇంకా ఎన్ని ఆయుధాలను ప్రయోగిస్తారో ఊహించలేం. ఆయన ఎక్కడి రోటిపాట అక్కడ పాడుతున్నారు. ఇప్పుడు కొత్త నినాదం ఎత్తుకున్నారు. ప్రజలంతా నా కుటుంబం అంటున్నారు. మంచిదే..మరి ప్రజల బాధలు వినాల్సిన పాలకుడిగా మోడీ ఆ పనిచేయడం లేదు. కేవలం తాను చేసిన గొప్పలను గోరంతలు కొండంతలుగా ప్రచారం చేస్తున్నారు. తెలంగాణలో రెండ్రోజుల పర్యటనలో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపారు. కాళేశ్వరంపై కేంద్రం చర్యలు తీసుకోదు. తీసుకుంటున్న రేవంత్ ప్రభుత్వాన్ని విమర్శించి బిఆర్‌ఎస్‌కు ప్రాణం పోసే ప్రయత్నం చేశారు. గతంలో కాళేశ్వరం బిఆర్‌ఎస్‌కు ఎటిఎం అన్న మోడీ ఏనాడూ అవినీతిపై చర్యలు తీసుకోలేదు. కేవలం 370 ఆర్టికల్, అయోధ్యను చూపి సమస్యలు పరిష్కరించానని, ఇది మోడీ గ్యారెంటీ అంటూ ఊదరగొట్టారు. ఈ రెండు కూడా ప్రజలకు కూడు పెట్టేవి కావు. మోడీ చేస్తున్న రాజకీయ విన్యాసాలు ఎక్కువ కాలం పనిచేయవని గుర్తించాలి. ప్రజలు ప్రధానంగా ధరలతో సతమతం అవుతు న్నారు. నిరుద్యోగం తాండవిస్తోంది. ఉపాధి రంగాలు దెబ్బతిన్నాయి. జివిస్టీతో సామాన్యుల నడ్డి విరుగు తోంది. ప్రధానిగా ప్రజల్లో ఈ సమస్యలను ఏనాడు చర్చించడం లేదు. కుటుంబం అంటున్న మోడీ ఇవన్నీ చర్చించాలి. నిత్యం భజన చేస్తున్న వందిమాగధులు ఈ సమస్యలను అధినేత దృష్టికి తీసుకుని వెళ్లడం లేదు. అప్రజాస్వామిక చర్యలపై కోర్టులు మొట్టికాయలు వేస్తున్నా పట్టించుకోవడం లేదు. చండీగఢ్‌లో జరిగిన మేయర్ ఎన్నిక తీరును సుప్రీం తప్పుపట్టింది. దీనికి సమాధానం లేదు. లోక్‌సభ ఎన్నికల సమయంలో బిహార్, జార్ఖండ్‌లో ఈడీ స్వైరవిహారం చేస్తున్నాయి. జెఎంఎం కనుక ఎన్డీఏలో ఉండి ఉంటే ఇప్పుడు ఈడీ దాడులనుంచి సోరేన్‌కు బాధలు ఉండేవి కావు. అందుకే ఇవన్నీ పక్కన పెట్టి తను ఓ అవతార పురుషుడినని చెప్పుకోవడం.. చెప్పించుకోవడం ద్వారా మరోమారు ఎన్నిక కావాలని మోడీ చూస్తున్నారు. అందుకు తగ్గట్లుగానే విపక్షాల్లో అనైక్యత లేదు. వారిలో నిబద్ధత లేదు. స్వార్థ రాజకీయాల్లో అవి కొట్టు మిట్టాడుతున్నాయి. ప్రజల సమస్యలను బలంగా వినిపించే గళం లేకుండా పోయింది. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేందుకు విపక్షాలు సర్వశక్తులు ఒడ్డుతున్నా లాభం లేదని తెలుస్తోంది. మోడీ మళ్లీ అధికారంలోకి వస్తే తమ మనుగడ ఏమవుతుందో అని కొన్ని రాజకీయ పార్టీలు భయపడడం, మరి కొన్ని రాజకీయ పార్టీలు ఈ భయంతోనే మోడీ అండదండలకు ప్రయత్నించడం జరుగుతోంది. ఎపిలో జగన్, టిడిపి కూటమి ఇదే కోరుకుంటోంది. మోడీ ప్రాపకం ఉంటే చాలని మోకరిల్లే పరిస్థితికి వచ్చాయి. నిజంగానే మోడీ మళ్లీ అధికారంలోకి వస్తే అసలు ప్రతిపక్షమే ఉండకపోవచ్చు. కాని ఈ భయం ప్రజల్లో ఏర్పడడం లేదు. కాంగ్రెస్ తదితర పక్షాల తీరు కారణంగానే మోడీ బలోపేతం అవుతున్నారు. దక్షిణాదిన తెలంగాణ, కర్ణాటకలో సాధించిన ఫలితాలు కాంగ్రెస్ ఇతర రాష్ట్రాల్లో ఎందుకు సాధించలేకపోతోందని వివేచన చేయడం లేదు. జాతీయ స్థాయిలో ఒక బలమైన ప్రత్యామ్నాయాన్ని ఏర్పర్చుకోవడం మాత్రమే కాదు, ఈ ప్రత్యామ్నాయాన్ని నీరుకార్చేందుకు చేసే ప్రయత్నాలను వమ్ము చేసే నాయకత్వం కూడా దేశానికి అవసరం. ఈ లోటు స్పష్టంగా కనపడుతోంది. కేవలం రాహుల్‌ను ముందు పెట్టడం ద్వారా ప్రజల ఆకాంక్షలను ప్రతిఫలించలేవు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎజెండాగా చేసుకుని ముందుకు సాగడంలో కాంగ్రెస్ తదితర పక్షాలు పూర్తిగా విఫలం అవుతున్నాయి. వారికి ఏది సమస్యనేది తెలియడం లేదు. ఈ క్రమంలోనే రెండ్రోజుల తెలంగాణ పర్యటనలో మోడీ కేవలం తన వాక్చాతుర్యంతో స్థానిక బిజెపి నేతలు ఇచ్చిన సమాచారంతో మాట్లాడారని గుర్తించాలి. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ కొత్త ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ చేసిన ఆరోపణలో రాజకీయం తప్ప నిజాలు లేవనే చెప్పాలి. రాష్ట్రంలో డబ్బు దోచుకొనే పనిలో ఆ పార్టీ బిజీ అయ్యిందని విమర్శించడం ద్వారా తనస్థాయిని ప్రధాని మోడీ తక్కువ చేసుకున్నారు. ఎందుకంటే రాష్ట్రాన్ని దోచుకున్న బిఆర్‌ఎస్‌ను ఏమీ చేయలేని అసమర్థ ప్రధానిగా మోడీ పేరు సంపాదించుకున్నారు. ఇది తెలంగాణ పల్లెల్లో ఎక్కడికి వెళ్లినా ప్రజలే చెబుతారు. బిఆర్‌ఎస్‌తో మోడీ కుమ్మక్కయ్యారని చెబుతారు. అవినీతికి పాల్పడుతున్న కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీలపై మోదీ పాలనలో సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్‌స్ట్రైక్స్ ఉంటాయని హెచ్చరించడం ద్వారా బెదిరింపు రాజకీయాలకు పాల్పడ్డారనే చెప్పాలి. తెలంగాణతో పాటు దేశంలోని ప్రజలంతా మూడోసారి బీజేపీకి పట్టం కట్టాలని, 400 ఎంపీ సీట్లు గెలిపించాలని కోరారు. అలా చేయాలంటే ప్రజలు ఏం కోరుకుంటున్నారో మోడీ గుర్తించాలి. కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలపై మోదీ ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ అవినీతిని బట్టబయలు చేస్తుండటం తో ఆ పార్టీ తనపై విమర్శలు చేస్తున్నదని వెల్లడించారు. అవినీతి విషయంలో ఎన్ని చర్యలు తసీఉకున్నా ఎవరికీ అభ్యంతరం లేదు. అంత ఖచ్చితంగా ఉండివుంటే కెసిఆర్, జగన్‌ల అవినీతిపై ఎందుకు ఉపేక్షిస్తు న్నారో బహిరంగ ప్రకటన చేయాలి. తనకు కుటుంబం లేదంటూనే ఇండియా కూటమి తనపై అనైతిక యుద్ధానికి దిగుతున్నదని చెప్పారు. దేశంలోని ప్రతి వ్యక్తి మోదీ కుటుంబ సభ్యుడేనని, తనను ప్రజలంతా తమ కుటుంబసభ్యునిగా భావిస్తున్నారని అన్నారు. ప్రజలపై అంతగా ప్రేమ ఉంటే వారి సమస్యలు వినాలి. వారు ఎదుర్కొంటున్న సమస్యలపై క్షేత్రస్థాయి నివేదికలు తెప్పించుకోవాలి. పరిష్కారం చూపాలి. వారసత్వ రాజకీయ పార్టీలకు మోదీ భయం పట్టుకున్నదని పదేపదే చెప్పి ప్రజలను నమ్మించ లేరు. దేశాన్ని మూడో అతి పెద్ద ఆర్థికశక్తిగా తీర్చిదిద్దుతానని, ఇది తన గ్యారెంటీ అని వెల్లడించారు. మోదీ గ్యారెంటీ అంటే తప్పకుండా అవుతుందని అన్నారు. నిజంగా ఇంతగా అభివృద్ధి చెందితే ప్రజలు ఎందుకు అథఃపాతాళంలోకి తొక్కబడుతున్నారో మోడీ చెప్పాలి. ఎందుకు బతికి బట్టలేక పోతున్నారో చెప్పాలి. ఎందుకు తిండికి కూడా కష్టపడుతున్నారో చెప్పాలి. పెరుగుతున్న ధరలను ఎలా కంట్రోల్ చేస్తారో చెప్పాలి. పెరుగుతున్న ఔషధ ధరలను ఎవరు నియంత్రిస్తారో చెప్పాలి. ఇవన్నీ చెప్పి, ప్రధానిగా చర్యలు తీసుకుని ఉంటే మోడీ తప్పకుండా ప్రతి ఒక్కరి కుటుంబ సభ్యుడు అవుతారు.

# దళితులకు ప్రత్యేక నియోజకవర్గాలు

**- బ్రిటిష్ సామ్రాజ్యంలోనే అంబేడ్కర్ పట్టు - విభేదించిన గాంధీ మహాశయుడు**

**న్యూఢిల్లీ:** భారతదేశంలో1919 మాంటేగ్ చేమ్స్ ఫర్డ్ సంస్కరణలు ఎలా పనిచేస్తు న్నాయో అధ్యయనం చేయడానికి, నూతన రాజ్యంగ సంస్కరణల కోసం సూచించేందుకు ఏర్పాటు చేసిన సైమన్ కమిషన్ భారతదేశాన్ని 1928లో పర్యటించింది. ఆ పర్యటన అనంతరం ఆ కమిటీ బ్రిటిష్ ప్రభుత్వానికి అందించిన నివేదికను చర్చించడానికి బ్రిటిష్ ప్రభుత్వం మూడు రౌండ్ టేబుల్ సమావేశాలను ఏర్పరచింది. ఈ సమావేశాలు 1930, 1931, 1932 లలో జరిగాయి. ఈ మూడు సమావేశాలకు అంబేద్కర్ హాజరు కాగా రెండవ సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్ తరపున గాంధీ హాజరు అయ్యారు. ఈ సమావేశాంలోనే గాంధీకి అంబేద్కర్‌కు మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. అంబేద్కర్ దళితులకు ప్రత్యేక నియోజక వర్గాలు ఇవ్వాలని పట్టుబట్టగా, అలా ఇస్తే హిందూ సమాజం విచ్ఛిన్నమవుతుందని అందుకు గాంధి ఒప్పుకోలేదు. ఏకాభిప్రాయం కుదరక పోవడంతో రెండవ రౌండ్ టేబుల్ సమావేశం నుండి గాంధీ బయటకు వచ్చేసారు. 1932 లో రామ్సే మెక్ డోనాల్డ్ 'కమ్యూనల్ అవార్డు'ను ప్రకటించడం జరిగింది. దీని ప్రకారం దళితులకు ప్రత్యేక నియోజక వర్గాలు ప్రతిపాదించారు. ఈ ప్రకటన వెలువడే నాటికి గాంధి శాసనోల్లంఘన ఉద్యమంలో భాగంగా అరెస్ట్ అయి ఎరవాడ జైలులో ఉన్నారు. ఈ ప్రకటన గూర్చి తెలుసుకొని గాంధీ నిరాహారదీక్ష చేపట్టారు. అంబేద్కర్ పై నైతిక ఒత్తిడి పెరిగింది. చివరికి గాంధీకి అంబేద్కర్‌కు మధ్య పూనా ఒప్పందం కుదిరి కమ్యూనల్ అవార్డ్ కన్నా ఎక్కువ స్థానాలు ఉమ్మడి నియోజక వర్గాలలో ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. దీని తర్వాత గాంధి 'హరిజన్ సేవక్ సమాజ్' ఏర్పరచి అస్పృస్యత నివారణకు కృషి చేసాడు. అంబేద్కర్ ను కూడా ఇందులో భాగస్వామిని చేసాడు.. కాని అంటరానితన నిర్మూలనలో గాంధీకున్న చిత్తశుద్ధి మిగిలిన కాంగ్రెస్ నాయకులకు లేదు. దీనితో అంబేద్కర్ గాంధి ఉద్యమం నుండి బయటకు వచ్చి ప్రత్యేకంగా దళిత సమస్య పరిష్కారానికి ఆలిండియా డిప్రేస్సేడ్ క్లాస్ కాంగ్రెస్, ఆలిండియా షెడ్యూల్ కాస్ట్ ఫెడరేషన్ వంటి అనేక రాజకీయ పార్టీలను ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా దళితులను సమీకరించే ప్రయత్నం చేసారు. ఈ సందర్భంలో క్విట్ ఇండియా ఉద్యమం, ఆ తరువాత దేశ విభజనతో కూడిన స్వాతంత్య్రం రావడం జరిగాయి.

# అంబేడ్కర్‌పై రాజ్యాంగ రచన భారం

**ఆయన పుస్తకాలు నేటికీ ప్రామాణికం**

**న్యూఢిల్లీ:** రాజ్యంగ పరిషత్తు సభ్యుడిగా, మంత్రివర్గ సభ్యుడిగా అంబేద్కర్ చేసిన కృషి అనన్య సామాన్యమైనది. ఆయన రాజ్యంగ భారాన్నంతా ఒక్కడే తన భుజస్కంధాలపై మోసాడు. రాజ్యాంగ పరిషత్తు సభ్యుడుగా అంబేద్కర్ విశేషంగా శ్రమించి రాజ్యాంగం రచించటం ఆయన శేష జీవితంలో ప్రముఖమైన ఘట్టం. నాటి కేంద్రమంత్రి టి.టి కృష్ణమాచారి ఒకమారు రాజ్యాంగ పరిషత్తులో మాట్లాడుతూ 'రాజ్యాంగ రచనా సంఘంలో నియమితులైన ఏడుగురిలో ఒకరు రాజీనామా చేశారు. మరొకరు మరణించారు. వేరొకరు అమెరికాలో వుండి పోయారు. ఇంకొకరు రాష్ట్ర రాజకీయాలలో నిమగ్నులయ్యారు. ఉన్న ఒక్కరిద్దరు ఢిల్లీకి దూరంగా ఉన్నారు. అందువల్ల భారత రాజ్యాంగ రచనా భారమంతా డా.అంబేద్కర్ మోయవలసి వచ్చింది. రాజ్యాంగ రచన అత్యంత ప్రామాణికంగా వుంటుందనటంలో ఏలాంటి సందేహం లేదన్నాడు. కేంద్ర మంత్రిమండలిలో న్యాయశాఖ మంత్రిగా వుండి 1951 అక్టోబరులో మంత్రి పదవికి రాజీనామా చేశాడు. ముఖ్యంగా సాంఘిక సంస్కరణలకు శ్రీకారం చుడుతూ అంబేద్కర్ పెక్కు గ్రంథాలు వ్రాశాడు. 'ది ప్రాబ్లం ఆఫ్ ది రూపీ', 'ప్రొవిన్షియల్ డీ సెంట్రలైజేషన్ ఆఫ్ ఇంపీరియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటీష్ ఇండియా', 'ది బుద్దా అండ్ కార్ల్ మార్క్స్', 'ది బుద్ధా అండ్ హిజ్ ధర్మ' ప్రధానమైనవి. ప్రసిద్ధ రచయిత బెవెర్లి నికొలస్ డాక్టర్ అంబేద్కర్ భారతదేశపు ఆరుగురు మేధావులలో ఒకరు అని ప్రశంసించాడు.

### మత్స్యకారులకు భారంగా

# మారిన చేపల వేట

ఆంధ్రప్రదేశ్‌లో వేలాది కుటుంబాలు సముద్రం మీద ఆధారపడి



జీవిస్తున్నాయి. చేపల వేటనే నమ్ముకుని వారు బతుకుతున్నారు. అయితే, మారిన పరిస్థితులలో వారికి బతుకు భారమవుతోంది. సముద్రంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు, తగ్గుతున్న ధరలు, పెరుగుతున్న దళారుల ప్రమేయం, వేట ఖర్చులు వారి భవిష్యత్‌ని ఆందోళనలోకి నెట్టి వేస్తున్నాయి. వేట సాగకపోతే తీవ్ర ఆర్థిక ఇబ్బందులు తప్పటం లేదు. ప్రభుత్వం ఇస్తున్న డీజిల్ ధరలో రాయితీని పెంచడంతోపాటు, సబ్సిడీపై ఇస్తున్న డీజిల్‌ను పెంచాలని మత్స్యకారులు కోరుతున్నారు. కోస్తా తీర ప్రాంతం వ్యాప్తంగా మూడున్నర లక్షల కుటుంబాలు నివసిస్తుండగా, చేపల వేట ద్వారా సుమారు 66 వేల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. 600 వరకూ మెకనైజ్డ్, మూడు వేలకుపైగా మోటరైజ్డ్ బోట్లపై మత్స్యకారులు చేపల వేట సాగిస్తున్నారు. సముద్రంలో ఎటువంటి ఆటంకాలూ లేనప్పుడు వేటకు వెళ్లి వీరంతా కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఏవైనా ప్రతికూల పరిస్థితులు ఉంటే పస్తులు తప్పవు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వాయుగుండాలు, తుపానులు వచ్చినప్పుడు రోజుల తరబడి వేటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. కొన్ని సందర్భాల్లో నెలంతా ఖాళీగానే ఉంటున్నామని, అయినా తమను ఎవరూ ఆదుకోవట్లేదని మత్స్యకారులు వాపోతున్నారు. లీటర్ డీజిల్ ధర రూ.50 ఉన్నప్పుడు ప్రభుత్వం సబ్సిడీపై అందించేది. ప్రస్తుతం డీజిల్ లీటరు రూ.100కి పెరిగినా అప్పటి సబ్సిడీ రూ.9 మాత్రమే నేటికీ అందిస్తోంది. కనీసం రూ.30 అయినా ఇవ్వాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. మత్స్య సంపద అంతగా లభ్యం కానీ పరిస్థితుల్లో సముద్రంలో సుదూర ప్రాంతం వేటకు వెళ్లాల్సి వస్తోంది. నెలకు నాలుగుసార్లు వేటకు వెళితే మోటరైజ్డ్ బోట్లకు దాదాపు రెండు వేల లీటర్ల డీజిల్ వినియోగం అవుతోంది. ప్రభుత్వం 300 లీటర్లను మాత్రమే సబ్సిడీపై అందిస్తోంది. కనీసం మిగతా 2లో 1,500 లీటర్లయినా సబ్సిడీపై ఇవ్వాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. మెకనైజ్డ్ బోట్లకు ఇస్తోన్న మూడు వేల లీటర్ల డీజిల్ సబ్సిడీని ఐదు వేల లీటర్లకు పెంచాలని కోరుతున్నారు. గతం కంటే చేపల వేట తగ్గుతూ వస్తోందని మత్స్యకారులు చెబుతున్నారు. రూరల్ తీర ప్రాంతాల్లో హెచరీలతోపాటు రొయ్యల చెరువులు, ప్రాసెసింగ్ యూనిట్లు విపరీతంగా పెరిగాయి. వాటి వ్యర్థాలను సముద్రంలోకి నేరుగా వదిలేస్తున్నారు. దీంతో, మత్స్య సంపదకు తీవ్రంగా నష్టం జరుగుతోందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. దీంతో, మత్స్యకారులకు వేట సరిగా సాగడం లేదు. ఇంధనం, ఐస్‌తో పాటు ఇతర ఖర్చులు రెట్టింపయ్యాయి. చాలా దూరం వేటకు వెళ్లాల్సి వస్తుండడంతో డీజిల్ వినియోగం బాగా పెరిగిపోయింది. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు ప్రతికూల పరిస్థితుల్లో వేట చేయలేక అవస్థలు పడుతున్నామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని మత్స్య కార్మికులు కోరుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సబ్సిడీని పెంచాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# క్షేత్రస్థాయి అధ్యయనంతోనే భూ సమస్యలకు చెక్ !



రోగం ఏమిటో తెలిస్తే...మందు వేయడం సులభం. అందుకే రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మెల్లగా సమస్యలను గుర్తించి..పరిష్కరించే ప్రయత్నాలను మొదలు పెట్టింది. ధరణిలో భూ సమస్యల పరిష్కారం దిశగా ముందడుగు వేసింది. ధరణి పోర్టల్‌లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా... ఐదుగురు సభ్యులతో కమిటీని నియమించింది. దీనికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. ధరణి పేరుతో భూముల రిజిస్ట్రేషన్ల లో జరిగిన అవకతవకలను కూడా ప్రభుత్వం వెలికితీయనుంది. అయితే ఇందులో పట్టా బూములు, అసైన్డ్ భూములు, దేవాదాయ భూములు, వక్ఫ్ భూములను కూడా గుర్తించాల్సి ఉంది. అలాగే బక్కరైతుల భూములను బలవంతంగా లక్కొని రిజిస్ట్రేషన్ చేసుకున్న భూములను కూడా కమిటీ గుర్తించాలి. ఇందు కోసం కొత్తగా ఏర్పడ్డ కమిటీ గ్రామాల వారీగా వివరాలు నమోదు చేయాలి. అన్యాయం అయిందన్న వారు దరఖాస్తులు చేసుకునే వెసులబాటు ఉండాలి. ధరణిలో ఎక్కినంత మాత్రాన తమకు ధోకా లేదన్న భావన లేకుండా చేయాలి. ధరణి స్థానంలో భూమాతను తీసుకొస్తామని కూడా ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించింది. ఈ క్రమంలో ముందుగా ధరణిలో సమస్యలను గుర్తించేందుకు కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో పేరుకు పోయన భూ సమస్యలకు కారణమైన పోర్టల్‌లో మార్పులు చేర్పులు చేస్తే తప్ప పరిష్కారం సాధ్యంకాదని, రెవెన్యూ అకారులు కూడా ప్రభుత్వానికి ఇప్పటికే సూచించారు. పోర్టల్‌లో సాంకేతికంగా అనేక సమస్యలు ఉన్నాయని నివేదించారు. దీంతో ధరణి పోర్టల్‌లో సమస్యలను తొలగించి సరికొత్తగా రూపొందించాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించడం ఓ మంచి అడుగుగా భావించాలి. చిత్తశుద్ధితో సమస్యలను అధ్యయనం చేసి పరిషష్కరించే దిశగా అడుగులు వేయాలి. క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించాలి. ఈ దిశగా ఐదుగురు సభ్యుల కమిటీ పనిచేయగలగాలి. సమాచారం తెప్పించు కుంటే.. అధ్యయనం చేయడం సులువు కాగలదు. కమిటీ ఇచ్చే నివేదిక ప్రకారం... తెలంగాణ ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది కనుక సమగ్ర అధ్యయనంతో ముందుకు సాగాలి. ధరణిపై వేసిన కమిటీలో కన్వీనర్‌తోపాటు నలుగురు సభ్యులను నియమించింది. భూ పరిపాలన ప్రధాన కమిషనర్... నవీన్ మిత్తల్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. రైతుల సమస్యలపై పట్టున్న కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి, మాజీ ఐఏఎస్, భూ పరిపాలన ప్రధాన కమిషనర్‌గా పని చేసిన రేమండ్ పీటర్‌ను ఈ కమిటీలో సభ్యులుగా స్థానం కల్పించింది. భూ చట్టాల నిపుణుడు, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం అనుబంధ ఆచార్యుడు సునీల్, రెవెన్యూ చట్టాలపై అవగాహన ఉన్న రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బి.మధుసూదన్‌ను కూడా ఈ కమిటీలో నియమించారు. ఈ కమిటీ... ధరణి పోర్టల్లోని సమస్యలను గుర్తించి.. వారికి పరిష్కారాలను కనుగొని ప్రభుత్వానికి నివేదిక అందించాల్సి ఉంది. వీలైనంత త్వరగా ఈ నివేదిక ఇవ్వాలని.. కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలోని భూ సమస్యలకు పరిష్కారం చూపేలా ఈ కమిటీ పనిచేయనుందని పేర్కొన్న దరిమిలా సమస్యలపై ఫిర్యాదలను కూడా స్వీకరించాలి. ఏ భూములు ఎలా అక్రమాలకు గురయ్యాయో సమాచారం కూడా తెప్పించుకోవాలి. అలాగే గత బిఆర్‌ఎస్ పెద్దలు అక్రమంగా ఆక్రమించుకున్న భూములపైనా విచారణ జరగాలి. చెరువుల శిఖాలను ఆక్రమించుకుని బహుళ అంతస్థులు కట్టుకున్న వారి చిట్టాలను కూడా తీయాలి. ప్రధానంగా హైదరాబాద్ లాంటి నగరంలో చెరువులు మాయం అయ్యాయి. చెరువు శిఖాలను మాయం చేశారు. ఇవన్నీ కూడా బయటపడాలి. అప్పుడే ధరణి సంస్కరణలకు అర్థం ఉంటుంది. ధరణి పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం భూములు దోచుకుందని కాంగ్రెస్ పార్టీ విస్తృతంగా ప్రచారం చేసింది. అధికారంలోకి వస్తే... ధరణిని బంగాళాఖాతం వేస్తామని పదేపదే ప్రకటించింది. ధరణి పోర్టల్లో భూముల ఖాతాలు ఉన్న వారికే పట్టా పాసు పుస్తకాల జారీ చేస్తున్నారు. ధరణి వెలుపల 18 లక్షల మంది వరకు ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. ధరణి పోర్టల్‌తో లక్షల్లో పెండింగ్ సమస్యలు ఉన్నట్టు ప్రభుత్వం గుర్తించింది. వీటన్నింటిపై సమగ్రంగా అధ్యయనం చేసి పోర్టల్‌ను పునర్నిర్మించే బాధ్యతను కమిటీకి అప్పగించింది. కొత్త సమస్యలు తలెత్తకుండా... ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని కనుకోవడంలో ఈ కమిటీ సమగ్రంగా పనిచేయాలి. ఇప్పటికే ధరణి పోర్టల్‌లో 33 మాడ్యూళ్లను అమల్లోకి తీసుకొచ్చినా... భూముల సమస్యలు పరిష్కారం కాలేదు. అందుకే భూమాత పోర్టల్ తీసుకురావడానికి ముందే... ఉన్న సమస్యలకు పరిష్కరించి.. అవి మళ్లీ తలెత్తకుండా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. పట్టా భూములతో పాటు అన్ని రకాల భూముల సమస్యలను పరిష్కరించ గలిగేలా చూడాలి. ఈ ఐదుగురు సభ్యుల కమిటీ జిల్లాల్లో పర్యటించి.. భూ సమస్యలపై అధ్యయనం చేయాలి. కమిటీకి కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో సహకరించాలని ప్రభుత్వం సూచించింది. భూ సమస్యల మూలాలను కనుగొని... వాటి పరిష్కారాలపై అధ్యయనం చేసి వీలైనంత త్వరగా నివేదిక అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇకపోతే ప్రధానంగా దేవాదాయ, వక్ఫ్ భూములను కాజేశారు. ఇటీవలి భూసమగ్ర సర్వేలా జిల్లాల వారీగా దేవాదాయ భూముల గుర్తింపు స్వాధీనంపై తెలంగాణ దేవాదాయ శాఖ ప్రకటన చేయలేకపోయింది. ఏ గ్రామంలో ఎంత భూమి ఉందో గుర్తించిన దాఖలాలు లేవు. ఆయా గ్రామాల్లో కోట్ల విలువైన భూములు ఉన్నా వాటిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదో చెప్పడం లేదు. అలాగే అర్చక సంఘాలు, బ్రాహ్మణ సంఘాలు కూడా క్షేత్రస్థాయి వివరాలను ప్రభుత్వానికి నివేదించినా పట్టించుకోలేదు. ఆలయ భూములు అన్యాక్రాంతం అయినా,ఆలయాల్లో ధూపదీప నైవేద్యం కరువైనా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. గ్రామస్థాయిలో సర్పంచ్‌లు కూడా దేవాదాయ భూముల గురించి తెలిసినా పెద్దగా పట్టించుకోవడం లేదు. జిల్లా ఎండోమెంట్ అధికారులు కూడా ఇలాంటి వాటి జోలికి వెళ్లడం లేదు. అసిస్టెంట్ కమిషనర్లు ఉత్సవ విగ్రహాల్లో ఆలయ భూముల అన్యాక్రాంతాన్ని పట్టించుకోవడం లేదు. కోట్లాది రూపాయల విలువైన భూములను కాపాడే క్రమంలో తెలంగాణలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వెనక..కబ్జాల మోసం దాగివుంది. పదేళ్ల కెసిఆర్ పాలనలో కనీసం ఒక్క ఎకరా కూడా స్వాధీనం చేసుకున్న దాఖలాలు లేవు. గ్రామాల్లో మాన్యాలను మింగేసిన ఘనుల భరతం పట్టాలి. గుళ్ల పేరుతో ఉన్న ఆస్తులను కొందరు అక్రమార్కులు కబ్జా చేసుకున్నారు. ధరణిలో తమపేరుతో ఎక్కించే సుకున్నారు. ఇలా వేల ఎకరాల వరకు అన్యాక్రాంతం అయ్యాయి. వాటి విలువ ఇప్పుడు వేలకోట్లల్లో ఉంటుందని అంచనా. కనీసం ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి కౌలు చెల్లించే విధంగా వేలం కూడా నిర్వహించలేని దుస్థితి నెలకొంది. ఇలాంటి భూములను కూడా గుర్తించి స్వాధీనం చేసుకుని కబ్జాచెరకు విముక్తి కలిగించాలి.

### సమాంతర పాలనతో

# వ్యవస్థల భ్రష్టు..!

వ్యవస్థలను భ్రష్టు పట్టించడం ద్వారా ఎన్నికల్లో ఎలా గెలవ వచ్చో పాలక పార్టీలు బాగా వంటబట్టించు కున్నాయి. అందుకు అనుగుణంగా రకరకాల విన్యాసాలు చేస్తున్నాయి. తమకు అనుకూలంగా కొత్త వ్యవస్థలను సృష్టిస్తున్నాయి. గతంలో టిడిపి అధికారంలో ఉండగా జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసింది. వాటి ద్వారానే కార్యక్రమాలను అమలు చేశారు. ఈ కమిటీలను విమర్శించిన వైసిపి అధికారంలోకి రాగానే వాటి స్థానంలో గ్రామ సచివాలయం అంటూ కొత్త వ్యవస్థను ఏర్పాటు చేసి, సెక్రటీరలను నియమిం చింది. ఈ రెండు పద్దతులు కూడా పంచాయితీ వ్యవస్థను మింగేశాయి. పంచాయితీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశాయి. సమాంతర వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని గ్రామస్థా యిలో తమకు అనుకూలంగా వ్యవహారాలను నడుపుతూ వచ్చారు. దీంతో సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు ఉత్సవ విగ్రహాల్లాగా మారారు. తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు వివావో, విఆర్‌ఎ వ్యవస్థలను తీసి అవతల పడేశారు. ఎన్టీఆర్ హయాంలో గ్రామీణ వ్యవస్థకు పట్టుకొమ్మగా ఉన్న పటేల్,పట్వారీ వ్యవస్థను రద్దు చేశారు. దానికి ప్రత్యామ్నాయం ఆలోచించకుండా నిర్ణయాలు తీసుకోవడంతో ఇప్పటికీ రెవెన్యూ వ్యవస్థను కోలుకోకుండా చేశారు. నిజానికి ఇదంతా మంచి చేశామని అనుకుంటున్నారు. దీనివెనక పెద్ద స్వార్థం దాగివుందన్నది నిజం. ఎందుకంటే గ్రామస్థాయిలో కార్యక్రమాలను సిఎం స్థాయిలో అమలు చేయాలన్న స్వార్థ లక్ష్యంతోనే సచివాలయ వ్యవస్థను తీసుకుని వచ్చారు. ఇది కాదనలేని నిజం. తాజాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు, నిర్వహణపైన, రాష్ట్ర రాజధాని అమరావతి విషయంలోనూ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కాగ్ చేసిన వ్యాఖ్యలు అక్షర సత్యాలు. పాలకుల తీరుతెన్నులను కాగ్ ఉన్నదివున్నట్లుగా వెల్లడించింది. సామాన్యులకు ప్రభుత్వ సేవలను క్షేత్రస్థాయిలో అందించడంలో సచివాలయ వ్యవస్థ పాత్ర పోషిస్తున్నదని చెప్పుకుంటున్నా..రాజ్యాంగ స్ఫూర్తిని నీరుగార్చేలా ఉంది. 74వ రాజ్యాంగ సవరణ చట్టం పట్టణ స్థానిక సంస్థలకు రాజ్యాంగ హోదాను అందించింది. ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, పౌరులను భాగస్వామ్యం చేయడం, పౌరులకు పాలనను చేరువ చేయడం స్థానిక స్వపరి పాలన ప్రధాన లక్ష్యం. రాష్ట్రంలో ఎక్కడా వార్డు కమిటీలను ఏర్పాటు చేయనే లేదు. ఇక పౌరులను భాగస్వామ్యం చేసే పరిస్థితి అస్సలు లేదు. ఇవి రెండూ చేపట్టకుండా వార్డు స్థాయిలో సచివా లయాల వ్యవస్థ రూపుదిద్దుకోవడం స్థానిక స్వపరిపాల నకు ఉద్దేశించిన రాజ్యాంగ స్ఫూర్తిని నీరుగార్చడమే. వార్డు కమిటీలను ఏర్పాటు చేసి, ఆయా కమిటీలు, ఏరియా సభలతో వార్డు సచివాలయాలను అనుసం ధానం చేస్తేనే స్వపరిపాలన సాధ్యమవుతుంది. 74వ రాజ్యాంగ సవరణ చట్టం, ఆంధ్రప్రదేశ్ పురపాలక చట్టా ల్లోని నిబంధనలకు అనుగుణంగా పాలన నడవాల్సి ఉండగా సచివాలయ వ్యవస్థ దెబ్బతీస్తోంది. ప్రజాస్వా మ్యం లో ప్రభుత్వాలు మారినా... ప్రజలకు సేవ చేసే విషయంలో పోటీపడి, ప్రజాధనానికి నష్టం కలగకుండా చేయాల్సిన బృహత్తర కర్తవ్యం పాలకులది. ఆ స్ఫూర్తిని ప్రభుత్వాలు మంటగలిపితే... కలిగే అనర్థాలకు సచివా లయ వ్యవస్థ అద్దం పడుతుంది. అప్పట్లో జన్మభూమి కమిటీలు నిర్వహించిన పాత్రనే ఇప్పుడు సచివాలయ వ్యవస్థ నిర్వహిస్తోంది. భారత రాజ్యాంగంలోని 12వ షెడ్యూల్‌లో పేర్కొన్న 18 విధులు నిర్వహించేందుకు పట్టణ, స్థానిక సంస్థలకు అధికారం ఇచ్చింది. వాటిలో 13 విధులను పూర్తిగాను, మూడు విధులను పాక్షికం గానూ నగర పాలక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగిం చింది. ఇక పురపాలక,నగర పంచాయతీల విషయానికి వస్తే ఏడు విధులను పూర్తిగాను, ఐదు విధులను పాక్షికం గానూ అప్పగించింది. వార్డు, గ్రామ సచివాలయాల వ్యవస్థను 2019 జులై నుంచి నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో రాష్ట్రప్రభుత్వం అమలు చేయడం ప్రారంభించింది. రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికలు జరపడం లేదు. ఎక్కువ స్థానిక సంస్థలు ఎన్నికైన ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం లేకుండా రాష్ట్రప్రభుత్వ కనుసన్నల్లో... ప్రత్యేక అధికారుల పాలనలోనే మగ్గుతున్నాయి. నిజానికి పంచాయితీ వ్యవస్థను ఏర్పాటు చేసిందే... గ్రామాల ఆర్థికవ్యవస్థను అభివృద్ధి చేయడం కోసం. దానిని నిర్వీర్యం చేసి,సొంతంగా..సమాంతర వ్యవస్థలను సృష్టించి ఓట్లవేట మొదలు పెట్టడం చూస్తున్నాం. వీరికి గ్రామాల అభివృద్ధి లక్ష్యం అయివుంటే ఈ పాటికి కనీసం పాతికశాతం ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేవి. కానీ అలా జరగడం లేదు. అంటే సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలు కొత్త సమస్యలు ఎదుర్కొం టున్నారు. ప్రజల సమాచారం దుర్వినియోగం అవుతోందని, ఎవరికో దీనిని అప్పగిస్తున్నారని ఇటీవల జనసేనాని పవన్ కళ్యాణ్ ఆరోపించారు. దీనికి సమాధానం చెప్పకుండా విమర్శలకు దిగారు..అంటే తమ లక్ష్యానికి అడ్డుగా వస్తున్నారని వారు భావిస్తున్నారు. తాజాగా ఇప్పుడు కాగ్ ఇదే రకమైన అభిప్రాయం వ్యక్తం చేసింది. దీనికైనా సమాధానం చెప్పుకోవాలి. ఈ క్రమంలో పంచాయితీలకు రావాల్సిన నిధులను కేంద్రప్రభుత్వం మెడలు వంచి నిధులు రాబట్టలేకపోతున్నారు. ఇకపోతే 2019 నుంచి అమరావతికి బడ్జెట్ సహకారం లేకపోవడం, రూ.33,476 కోట్లు రుణంగా సమీకరిర చుకో వాల్సి ఉరడగా, రూ.8,540 కోట్లే సమీకరిం చడం, కాలపరిమితి లేకుండా ఉన్న 55 ప్యాకేజీల ఒప్పందాలపై అనిశ్చితి, వాటిని పూర్తి చేయడానికి అవసరమైన రూ.28,048 కోట్లపై స్పష్టత లేకపోవడం... ఇలా ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని కాగ్ ఎండగట్టింది. భూసమీకరణకు రూ.2,245 కోట్లు సిఆర్‌డిఏ వ్యయం చేయగా, ఆ భూమంతా నిరుపయోగంగా పడి వుంది. ప్రభుత్వ భూములను వదిలేసి ప్రైవేటు భూములనే రాజధానికి సేకరించడం, 70 శాతాన్ని భూసమీకరణ ద్వారా సేకరించాలని అప్పట్లో తీసుకున్న నిర్ణయాన్ని కాగ్ నివేదిక ఆక్షేపించింది. ఇలా వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నా..కాగ్ తప్పు పట్టినా పట్టించుకునే వ్యవస్థ ఉందా అన్నది అనుమానం. కేంద్రం కూడా ఇలాంటి తరహా వ్యవస్థలను చూసీచూడనట్లుగా ఉండడం దారుణం కాక మరోటి కాదు.

# తప్పుచేసిన వారే అరచిగీపెడతారు !

నోరున్నోడిదే ఊరు..బడితె ఉన్నోడిదే బర్రె..ఈ సామెత బిఆర్ఎస్‌కు బాగా సరిపోతుంది. నోరు పెద్దది చేయడం ద్వారా పదేళ్ల పాపాలను కప్పిపుచ్చుకోవాలని చూస్తోంది. తప్పుచేసిన వాళ్లే గాయ్ గాయ్ చేస్తారు. అరిచి గీపెడతారు. పెడబొబ్బలు పెడతారు. ఇప్పుడు బిఆర్ఎస్ నేతలు అదే చేస్తున్నారు. ఇంతకాలం తమదే అధికారం అనుకున్నారు. జీవితాంతం తామే అధికారంలో ఉంటామని అనుకున్నారు. తండ్రి తరవాత తనయుడే సిఎం అవుతాడని భావించారు. గడీల రాజ్యం నెలకొల్పి దానిని కొనసాగిద్దామనుకున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల దెబ్బతో ..ఓటమిని తట్టుకోలేక పోతున్నారు. అందుకే ఏదిపడితే అది మాట్లాడుతున్నారు. తెలంగాణను అప్పులకుప్ప చేసి, దోపిడీకి తెరలేపి, సర్వనాశనం చేసిన వారే ఇవాళ..నోరు పెద్దది చేస్తున్నారు. అప్పులపై ప్రశ్నలకు సమాధానం లేదు. కాళేశ్వరం అవినీతిపైనా సమాధానం లేదు. ధరణి అక్రమాలపై నోరు మెదపరు. ప్రభుత్వ భూముల మాయంపైనా జవాబు చెప్పారు. నాటి ఎమ్మెల్యేలు, మంత్రుల భూ దందాలపైనా నోరువిప్పరు.ఇదంతా ఎందుకంటే ఎక్కడ తమ పునాదులు కదులుతాయోనన్న భయం వారిని వెన్నాడుతోంది. అందుకే ఎదురుదాడి దిగుతున్నారు. ఈ సమాధానాలు పక్కన పెట్టి జీతాలు ఇవ్వడం లేదంటారు. సకాలంలో నీళ్లు రావడం లేదంటారు. అప్పుడే కరెంట్ పోయిందని అంటారు. ఆరు గ్యారెంటీలు ఎలా అమలు చేస్తారని అంటారు. ఇవన్నీ అడిగితే..వీటిపై ఎదురు తదాడి చేస్తే..కాంగ్రెస్ సమాధానం చెప్పలేదని అనుకుంటున్నారు. అందుకే ఓ క్రమపద్ధతిలో గత మూడు నెలలుగా ఎదురుదాడితో బిఆర్ఎస్ ముఖ్యులు ముందుకు సాగుతున్నారు. లోక్‌సభ ఎన్నికలు ముంచు కొస్తున్న సమయంలో తెలంగాణలో బిఆర్ఎస్ ఉనికి కోల్పోవడం ఖాయమని ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్, బిజెపిలకన్నా ఎక్కువగా ఒత్తిడికి గురవుతోంది. భారత రాష్ట్ర సమితి. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన మూడు నెలల్లో మళ్లీ పార్లమెంట్ ఎన్నికలు ఎదుర్కోవాల్సి రావడం..అవినీతి, అక్రామల పాపాలు వెన్నాడడంతో పాటు, ప్రజల్లో ప్రాభవం కోల్పోవడంతో తట్టుకోలేక పోతున్నారు. అధికారంలో ఉండగా ప్రజలను ఎందుకు కలవాలన్న వారే ఇప్పుడు నా ప్రజలు అంటూ బయలుదేరారు. ఓ వైపు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి.. మరో వైపు పోటీకి సిద్ధంగా లేని పార్టీ నేతలు, బలమైన అభ్యర్థుల్ని ఎంపిక చేసుకోవ డానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవడం ..మరితం టెన్షన్‌కు గురి చేస్తున్నాయి. ఈ సమయంలో బలంగా ప్రజల్లోకి వెళ్లడానికి ఓ అజెండా కూడా కరవైంది. దీనికితోడు కాళేశ్వరం పాపాలను నిత్యం ప్రశ్నిస్తున్నారు. మేకపోతు గాంభీర్యం ప్రదర్శించకుంటే బాగుండదని అనుకున్నారో ఏమో...ఇప్పుడు మేడిగడ్డ అంటూ బయలుదేరారు. మొన్నటికి మొన్న మేడిగడ్డకు కాకపోతే బొందలగడ్డకు వెళ్లండని అక్కసు వెళ్లగక్కిన కెసిఆర్ ఇప్పుడు అదే మేడిగడ్డకు తన తనయుడి సారథ్యంలో పటాలాన్ని పంపుతున్నారు. ఇదంతా కూడా ఎదురుదాడి పథకంలో భాగం తప్ప మరోటి కాదు. ఇలాచేస్తే ప్రజల్లో ఇమేజ్ పెంచు కోవచ్చు... కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టవచ్చన్న భావన కావచ్చు. తెలంగాణ ఉద్యమంలో కీలకమైన నీళ్ల అజెండాతోనే మళ్లీ వెళ్లాలని.. కాళేశ్వరం విషయంలో తాము చేసిన కృషిని తక్కువ చేస్తున్న ప్రభుత్వ వైఖరిని తప్పు పడుతూ ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించడం కూడా కావచ్చు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణ ఉద్యమం నాటి నినాదం మరోమారు తెరపైకి వచ్చింది. ఉద్యమ కాలం నాటి నీళ్లు, నిధులు, నియామకాలు నినాదం ఇప్పుడు మార్మోగుతోం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై దశాబ్దం కావొస్తున్నా ఉద్యమ కాలం నాటి నీళ్లు, నిధులు, నియామకాలు సాకారం కాలేదన్నది జగమెరిగిన సత్యం. ఎందుకంటే కెసిఆర్ పాలనలో కాళేశ్వరం కట్టి నీటి సమస్య తీరిందన్నారు. లక్షా నలభైవేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. తెలంగాణ ప్రజలు అంతా ధనవంతులయ్యారని, ఎకరా భూమి ఎక్కడా 30 లక్షలకు తక్కువ లేదని నమ్మ బలికారు. ఇలా ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చామని పదేళ్లుగా ప్రచారంలో ప్రజలను ముంచారు. కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలపై కాంగ్రెస్ బీఆర్ఎస్‌ను లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేయడంతో పదేళ్ల అధికార మత్తులో ఉన్నవారి కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. దీనిని తప్పించుకునేందుకు నల్లగొండలో ఓ సభ పెట్టి కాంగ్రెస్‌ను విమర్శించే పనిచేపట్టింది. ఇప్పుడు చలో మేడిగడ్డ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. కాళేశ్వరం సమగ్ర స్వరూపాన్ని ప్రజలకు తెలియజెప్పే ప్రయత్నాలు ప్రారంభించింది.పార్లమెంటుకు ఎన్నికలు జరగబోతున్న తరుణంలో బీఆర్ఎస్ పార్టీ కనీసం ఓ రెండు సీట్లయినా గెలవకుంటే ..ఇక ఆ పార్టీ లేచి నిలబడదు. అందుకే ప్రాజెక్టుల సందర్శన పేరిట ప్రజాక్షేత్రంలోకి దిగడంలో రాజకీయం చేస్తోంది. గతంలో అధికారంలో ఉండగా మేడిగడ్డకు ఒక్కరిని కూడా పోకుండా పోలీసులను కాపలా పెట్టింది. బహుశా ఎన్నికలయ్యేంత వరకు ఈ కార్యాచరణ కొనసాగు తుం దని అంచనా. కాళేశ్వరంప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ ఎన్నికలకు ముందు కుంగిపోయిన విషయం వెలుగు చూసింది. అప్పటినుంచి రాష్ట్ర రాజకీయాల్లో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ... బీఆర్ఎస్ వైఖరిని ఎండగట్టేందుకు అసెంబ్లీలో సాగునీటి ప్రాజెక్టులపై శ్వేత పత్రం విడుదల చేసింది. 'కాళేశ్వరం ఓ విఫల ప్రాజెక్టుగా ఎత్తిచూపింది. బీఆర్ఎస్ ప్రభుత్వం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని తెలంగాణ ప్రజానీకానికి తెలియచేసింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మేడిగడ్డ ప్రాజెక్టును సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి.. బ్యారేజీలోని లోపాలను ఎత్తిచూపారు. ఆనాడు రమ్మని బిఆర్ఎస్‌కు ఆహ్వానం పలికినా తిరస్కరించిన వారు ఇప్పుడు అదే మేడిగడ్డకు వెళ్లడం రాజకీయయాత్ర కాక మరోటి కాదు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను ప్రజలు ఆదరిస్తే ఉంటారు..లేకుంటా కాలగర్భంలో కలసిపోతారు. రాజకీయ అవినీతికి పాల్పడే పార్టీలను ప్రజలు ఎప్పటికప్పుడు గుర్తించి వాతు పెడితేనే మరోమారు ఇలాంటి అక్రమాలకు తావుండదని గుర్తించాలి.

# బిఆర్ఎస్ వ్యూహాత్మక విమర్శలు

## తెలంగాణకు బిజెపి చేసిందేమీ లేదన్న వాదన

**హైదరాబాద్ :** బిజెపి,కాంగ్రెస్‌ల విషయంలో అధికార బిఆర్ఎస్ దూకుడుగా ముందుకు సాగుతోంది. ఈ రెండు పార్టీలను పార్లమెంట్ ఎన్నికల్లో తక్కువ చేసి గెలవాలన్న లక్ష్యంతో సాగుతోంది. పోయిన ఇమేజ్ కాపాడుకోవాలంటే పార్లమెంటులో సీట్లు గెలవాలి. తఇటీవల అవకాశం దొరికితే ఈ రెండు పార్టీలపై విరుచుకు పడుతోంది. అందుకే వాటిని లక్ష్యంగా చేసుకుని మాటల తూటాలు పేల్చుతోంది. కేంద్రం తెలంగాణకు ఏం చేయలేదన్న విమర్శలకు పదను పెట్టింది. 15 లక్షల నగదు.. ఉద్యోగాల భర్తీ ఏమైందని టీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. పనిలో పనిగా ఉద్యోగాల భర్తీపైనే ఎక్కువ ఫోకస్ పెట్టిన గులాబీ దళం బిజెపికి సవాల్ విసురుతోంది. విమర్శల కంటే తమహయాంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారం చేస్తున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేసిందీ వివరిస్తున్నారు. అలాగే బీజేపీని లక్ష్యంగా చేసుకుని వేడి పెంచుతున్నారు. విభజన చట్టంలో ప్రస్తావించిన హామీల అమలుపై ప్రశ్నల వర్షం కురిపిస్తు న్నారు. వీరందరికీ ఒకటే సమాధానంగా అభివృద్ధి మంత్రాన్ని వల్లె వేస్తున్నారు బిఆర్ఎస్ నేతలు. కేంద్రంలో రాబోయేది సంకీర్ణ యుగమేనని అందులో బిఆర్ఎస్ పాత్ర గొప్పగా ఉండబో తుందని ఆ పార్టీ నేతలు మరోమారు ఇప్పుడు చెబుతున్నారు. కేంద్రంలో రానున్నది సంకీర్ణ ప్రభుత్వమేనన్నారు. బిఆర్ఎస్ దేశంలో కేంద్రంలో కీలక భూమిక పోషిస్తామంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంకీర్ణ ప్రభుత్వాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. గత 25 ఏళ్లుగా కాంగ్రెస్‌కు కేంద్రంలో మెజార్టీ లేదన్నారు. రాబోయే రోజుల్లో సీఎం కేసీఆర్ ఢిల్లీలో చక్రం తిప్పబోతున్నట్లు పార్లమెంట్ ఎన్నికల వేళ పేర్కొన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన హక్కులు, నిధులను సాధించాలంటే ఢిల్లీలో మన బలం చూపించాలనీ పేర్కొన్నారు. మన బలం తెలిసి చక్రం తిప్పగలుగు తామనీ, రాష్ట్ర ప్రయోజనాలు సాధించగలమని పేర్కొన్నా రు. కేంద్రంలో మార్పు అన్నది రాజ్యాధికారం కోసమో, పదవుల కోసమో కాదని, దేశ అభ్యు న్నతి కోసం అని చెప్పారు. కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టులకు అనుమతుల కోసం అనేక సార్లు కేంద్ర మంత్రులు, అధికారులను కలిశామని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ అనాలోచిత నిర్ణయం వల్ల తెలంగాణ ప్రాజెక్టులకు జాతీయ హోదా రాలేదని విమర్శిం చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ టీఆర్ఎస్‌ను గెలిపించుకొని పార్టీని మరింత బలోపేతం చేసుకునే దిశగా కృషి చేయాలన్నారు. పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు తప్పక గుర్తింపు ఉంటుందని అన్నారు.

# హిట్ అండ్ రన్ ఘటనలతో ఆందోళన

## ప్రమాదాల్లో బలవుతున్న అమాయక ప్రజలు

**హైదరాబాద్:** భాగ్యనగరంలోని వరుసగా జరుగుతున్న హిట్ అండ్ రన్ ప్రమాదాలతో నగరవాసులు బెంబేలెత్తిపోతున్నారు. వాహనాలతో ఢీకొట్టి ఆపై ఆపకుండా పరారవుతున్న ఘటనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఈ కారణంగా అనేక మంది అమాయక ప్రజలు బలవుతున్న పరిస్థితి. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు అనేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఫలితం లేకుండా పోతోంది.

నగరంలో వారం రోజుల వ్యవధిలో రెండు హిట్ అండ్ రన్ ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.బుధవారం జూబ్లీహిల్స్‌లో ఓ స్పోర్ట్స్ కార్ బీభత్సం సృష్టించింది. అతివేగంతో దూసుకొచ్చిన కారు.. రెండు బైక్‌లను ఢీకొట్టింది. ప్రమాదం అనంతరం కారుతో యువకులు పరారయ్యారు. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్పోర్ట్స్ కారు గుంటూరుకు చెందిన వారిదిగా గుర్తించారు. బిక్కి అశోక్ పేరు మీద స్పోర్ట్స్ కార్ రిజిస్టర్ అయి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బిక్కి అశోక్ గుంటూరు కాటమురు ప్రాంతానికి చెందిన వ్యక్తి. దీంతో నిందితుల కోసం జూబ్లీహిల్స్ పోలీసుల బృందం గుంటూరుకు బయలుదేరింది.ం

ఈ ప్రమాదంలో గాయపడిన ముగ్గురు వ్యక్తులు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మాదాపూర్‌లోని మేడికోవర్ ఆస్పత్రిలో అన్నాచె÷-లలెళ్లు ఉదయ్, సుష్మ ( స్వీటీ ) చికిత్స పొందుతున్నారు. ఉదయ్, సుష్మలకు మల్టిపుల్ ఫ్యాక్చర్స్ అయినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం వీరిద్దరికి ఐసీయూలో ఉంచి చికిత్స అందజేస్తున్నారు. ఈ ప్రమాదంలోనే గాయపడిన మరో వ్యక్తి ట్రీట్‌మెంట్ చేయించుకుని డిశ్చార్జ్ అయి వెళ్లిపోయినట్లు వైద్యులు తెలిపారు. కాగా.. జూబ్లీహిల్స్‌లో జనవరి 24 తెల్లవారుజామున జరిగిన హిట్ అండ్ రన్ ప్రమాదంలో బౌన్సర్ మృతి చెందిన ఘటన తీవ్ర కలకలం రేపింది. పెద్దమ్మగుడి వద్ద బైక్‌పై వెళ్తున్న వారిని అతివేగం దూసుకొచ్చి కారు ఢీకొట్టింది. అనంతరం కారు ఆపకుండానే అక్కడినుంచి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో బౌన్సర్ తారక్ రాం అక్కడికక్కడే మృతి చెందగా.. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు.

ప్రమాదంలో బైక్ 20 అడుగుల దూరంలో ఎగిరి పడిన దృశ్యాలు సీసీ టీవీ ఫుటేజ్‌లో రికార్డ్ అయ్యాయి. ఈ కేసులో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ ప్రమాదం జరిగి వారం రోజులు గడవక ముందో మరో హిట్ అండ్ రన్ కేసు నమోదు అవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

## ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా

# ప్రాంతీయపార్టీలు

- ప్రాంతీయ పార్టీల మెడకు బిగుస్తున్న ఉచ్చు

- ఇడి, సిబిఐ వేధింపులతో దెబ్బతీసే యత్నం - ఇదే జరిగితే బపలడేది కాంగ్రెస్ మాత్రమే



**న్యూఢిల్లీ:** ప్రాంతీయ పార్టీలకు దేశంలో జీవన్మరణ సమస్యగా మారింది. వివిధ కేసులతో ఆయా పార్టీల నేతలను వేధిస్తున్న తీరు కారణంగా అవి ఉనికిని కలో÷-పోయే ప్రమాదంలో పడ్డాయి. జార్ఖండ, ఢిల్లీ ముఖ్యమంత్రులకు ఇడి వేధింపులు ఇందుకు ఉదాహరణగా చూడాలి. ఢిల్లీలో అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసం ఆమ్ ఆద్మీ పార్టీని, ఆ పార్టీ అధినేత ముఖ్యమంత్రి కేజీవ్రాల్‌ను తుదముట్టించడం కోసం బీజేపీ చేయని ప్రయత్నమంటూ లేదు. నిజానికి అరవింద్ కేజీవ్రాల్ ఢిల్లీలో కాంగ్రెస్‌ను దెబ్బతీయడంలో బీజేపీకి సహాయపడ్డారు. పంజాబ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించగలిగారు. ఓ రకంగా కాంగ్రెస్ ముక్త నినాదానికి ప్రయత్నించారు. ఇలా రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఉనికిలేకుండా చేయగలిగారు. గుజరాత్, గోవాలో కాంగ్రెస్ ఓట్లను చీల్చారు, తన సంక్షేమ ఎజెండాయే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌తో సహా ఇతర పార్టీలు అనుకరించేలా చేయగలిగారు. కాంగ్రెస్ బలహీనపడుతున్న కొద్దీ ఆప్ బలపడింది. అయినప్పటికీ మోదీ సకల ఆయుధాలు కేజ్రీవాల్‌పై ప్రయోగించడంతో ఆయన తన రాజకీయ అస్తిత్వం కోసం పోరాడుతున్నారు. ఆప్ జీవన్మరణ సమస్యలో ఉంది. ఈ క్రమంలో మరోమారు ఇడి ఆయనను విచారణల పేరుతో పిలుస్తూనే ఉంది. ప్రాంతీయ పార్టీలు బలహీనపడితే వాటి స్థానంలో బలపడేందుకు కాంగ్రెస్‌కే ఎక్కువ ఆస్కారం ఉన్నది. ఎందుకంటే కాంగ్రెస్ ఓటు బ్యాంకునే ప్రాంతీయ పార్టీలు అధికంగా కొల్లగొట్టాయి. బీజేపీ క్రియాశీలకంగా మారడానికి ముందే ప్రజలు కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతతో ప్రాంతీయ పార్టీలను ఆదరించారు. ఇవాళ దేశంలో ఉన్న అనేక ప్రాంతీయ పార్టీల పుట్టుకకు కాంగ్రెస్ అనుసరించిన విధానాలే కారణం. ఇప్పుడు మోదీ కూడా ప్రాంతీయ పార్టీలను బలహీనపరిస్తే చివరకు ప్రధాన పోటీ మళ్లీ బీజేపీ, కాంగ్రెస్‌లకే పరిమితం కావడం ఖాయం. కాంగ్రెస్ ముక్త భారత్ లక్ష్యం సాధించడం కష్టమని గ్రహించినందువల్లే మోదీ ప్రాంతీయ పార్టీలను లక్ష్యంగా పెట్టుకున్నారా? అన్న అనుమానాలకు ఆస్కారం లేకపోలేదు. ఏమైనా అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ మధ్య ప్రాంతీయ పార్టీలు నలిగిపోయే పరిస్థితి పలు రాష్ట్రాల్లో కనిపిస్తోంది. బిజెపి పనితీరు సక్రమంగా లేకపోవడం వల్లనే కర్నాటక, తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. కర్నాకటలో బిజెపి కరప్షన్ కారణంగా ప్రజలను దూరం చేసుకుంది. తెలంగాణలో కెసిఆర్ అహంకారాన్ని అణచివేసేందుకు ప్రజలు కాంగ్రెస్‌ను ఎంచుకున్నారు. లోక్‌సభ ఎన్నికలకోసం మోదీ అవినీతి అంశాలన్ని ఒక ప్రయోగంగా ఉపయోగించుకుంటున్నారా అన్నది చర్చనీయాంశమవుతోంది. 2014లో లోక్‌సభ ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరుకున్న దశలో నరేంద్రమోదీ ఈ దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయాలని పిలుపు ఇచ్చారు. కాని 9 సంవత్సరాల పాలన తర్వాత కూడా ఆయన దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయలేకపోయారు. కర్ణాటకలో బీజేపీ ఘోరపరాజయం చెందిన తర్వాత దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి అవకాశం లేకుండా పోతున్నది. ఇదంతా స్వయంకృతమని తెలంగాణ నిరూపించింది. కర్ణాటకతో పాటు హిమాచల్‌లో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. తరవాత తెలంగాణలోనూ కాంగ్రెస్ పాగా వేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని రెండు ప్రాంతీయ పార్టీల్లో అధికారంలో ఉన్న వైసీపీ రెండోసారి ఎన్నికల్లోనే సంకట పరిస్థితిలో పడింది. తెలుగుదేశంతో రాజకీయంగా పోరాడే బదులు ఎన్నికల సమయంలో కేసులు మోపడమే వైసీపీ అత్మరక్షణలో పడిందనడానికి నిదర్శనం. తమిళనాడులోని రెండు ప్రాంతీయ పార్టీలూ బీజేపీకి దూరంగా మారాయి. కర్ణాటకలో అంతరించిపోయే స్థితిలో జనతాదళ్ (ఎస్) బీజేపీతో చేతులు కలిపింది. ఈ పరిస్థితుల్లో లోక్‌సభ ఎన్నికల నాటికి దక్షిణాదిలో బీజేపీ వ్యూహం ఏ విధంగా ఉంటుందన్నదే ముఖ్యం. తెలంగాణలో మోదీ ఉధృత ప్రచారం చేసినా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో అత్తెసరు సీట్లు వచ్చాయి. నిజానికి కాంగ్రెస్ పార్టీ కంటే మోదీ ప్రాంతీయ పార్టీలను అణిచివేయడంపైనే అధికదృష్టి సారిస్తున్నారే మోనని ఒకరకంగా అనిపిస్తోంది. ఈడీ, సీబీఐలను ప్రయోగించి మహారాష్ట్రలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ, శివసేనలను బీజేపీ చీల్చగలిగింది. పంజాబ్‌లో అకాలీదళ్‌ను దెబ్బతీసింది. బిహార్‌లో లోక్ జనశక్తిని ముక్కలు చేసింది. నితీశ్ కుమార్‌కు పొమ్మనకుండా పొగపెట్టి పంపించింది. తరవాత మళ్లీ దారికి తెచ్చుకుంది. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి నేతృత్వంలోని బీఎస్పీని బీజేపీ నిర్వీర్యం చేసింది. సమాజ్‌వాది పార్టీని అస్తిత్వం కోసం పోరాడే పరిస్థితిని కల్పించింది. ఒడిషాలో నవీన్ పట్నాయక్ తర్వాత బీజేడీ భవిష్యత్ ఏమిటన్నది ప్రశ్నార్థకమైంది. తాజాగా జార్ఖండ్‌లో కూడా హేమంత్ సోరెన్‌ను సిఎం పదవి వీడేలా చేసింది. దేశంలో అనేక చిన్నా చితక, ఉప ప్రాంతీయ పార్టీలు మోదీ భయంతో బీజేపీతో చేతులు కలపక తప్పడం లేదు. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల తర్వాత ఎన్ని ప్రాంతీయ పార్టీలు ఉంటాయో, ఎన్ని మిగిలిపోతాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది. అయితే ఏ ప్రజల ఆకాంక్షలకోసం ప్రాంతీయ పార్టీలు ఏర్పడ్డాయో అవి ఆ ఆకాంక్షలను విస్మరించి అధికారాన్ని కొద్ది మంది వ్యక్తుల చేతుల్లో కేంద్రీకృతం అయ్యేలా చూశాయి. అరాచక పాలనతో పాటు, విపరీత అవినీతికి పాల్పడ్డాయి. రాష్ట్రీయ జనతాదళ్ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ అనుభవాన్ని అవి విస్మరించాయి. ఇవాళ ప్రజలు కాంగ్రెస్ వైపో, బీజేపీ వైపో మళ్లుతున్నారంటే అందుకు ప్రధాన కారణం ప్రాంతీయ పార్టీల నేతల స్వయం కృతాపరాధాలే అని చెప్పుకోవాల్సిందే.

# గవర్నర్ల తీరు మారేదెప్పుడు

మన దేశంలో గవర్నర్ వ్యవస్థ ఎప్పుడూ వివాదమే. రాష్ట్రాల వ్యవహారాల్లో



వేలు పెట్టడం..విపక్ష పార్టీలు అధికారంలో ఉంటే ఇబ్బంది పెట్టడం చూస్తూనే ఉన్నాం. ఇందుకు బిజెపియేతర పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్న వివాదాస్పద వ్యవహారాల్లే నిదర్శనం. ఇలా వ్యవహరించడం కొత్తేమీ కాదు. ఏదో ఒక రాష్ట్రం లో గవర్నర్లు తరచూ వివాదాల్లో చిక్కుకోవటం లేదా వివాదాలకు కేంద్ర బిందువులుగా మారడం చూస్తూనే ఉన్నాం. కేరళ,బెంగాల్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో ఇలాగే జరుగుతోంది. ముఖ్యంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో రాజకీయంగా విభేదిస్తున్న కేరళ, తమిళనాడు, తెలంగాణ, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో గవర్నర్లకు ప్రభుత్వాలకు మధ్య సత్సంబంధాలు లేవన్న విషయం తెలిసిందే. తమిళనాడులో అనేక విషయాల్లో అక్కడి గవర్నర్ ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూనే ఉన్నారు. గతంలో గవర్నర్లుగా ఉన్నవారు ప్రజాస్వామ్య రాజకీయాల్లో అనుభవం ఉన్నవారు ఉండేవారు. వారికి రాజ్యాంగం గురించి అవగాహన ఉండడం లేదా న్యాయ సలహాలు తీసుకుని హుందాగా నడచుకొనేవారు. ఎవరి పరిమితికి లోబడి వారు నడుచుకొనేవారు. అప్పుడు రాజకీయంగా పెద్దగా ఏ సమస్యా రాలేదు. అయితే 1980 తర్వాత గవర్నర్ల నియామకం విచక్షణారహితమై పూర్తిగా రాజకీయ రంగు పులుముకున్నది. అందుకు తగినట్టే ఉన్నది గవర్నర్ల నడవడిక కూడా మారింది. ఇది రామ్‌లాల్ విషయంలో పరాకాష్ఠకు చేరింది. అప్పట్లో ఉమ్మడి ఎపికి సిఎంగా ఉన్న ఎన్టీరామారావును పదవీచ్యుతుడిని చేయడంతో రాష్ట్రప్రభుత్వాలను కూలదోసే ప్రక్రియ పరాకాష్టకు చేరింది. కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రభుత్వాలను ఏదో కారణంతో కూలదోయడం అలవాటుగా ఉండేది. ఇక తెలంగాణ విషయానికి వస్తే..తమిళసై గవర్నర్‌గా వచ్చిన నాటి నుంచి అన్నీ వివాదాలే. సహజంగానే ఆమె తమిళనాడు బిజెపికి చెందిన పార్టీ నాయకురాలు. అందుకే కావచ్చు ఏదో ఒక విషయంలో గిల్లికజ్జాలు పెడుతూనే ఉన్నారు. తాజాగా మండలి భ్యుల నియామక విషయంలో గవర్నర్ చర్య వివాదాస్పదమైంది. కేబినేట్ నిర్ణయాన్ని కూడా తోసిపుచ్చిన తీరు దారుణం. ఇదొక్కటే కాదు గతకొంతకాలంగా అనేక బిల్లుల వ్యవహారంలో కూడా గవర్నర్ ఘర్షణ వైఖరినే అవలంబిస్తూ వచ్చారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు ఆమోదం తెలపటంలో కానీ, రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా పరంగా గవర్నర్ ఆమోదం కోసం పంపే సాధారణ ప్రతిపాదనలను ఆమోదించటంలో తమిళసై పక్కన పెడుతూ వచ్చారు. ఇలా రాజ్‌భవన్ నుంచి అనేక అవరోధాలు ఎదురుకావడం తెలంగాణలో సాధారణం అయ్యాయి. గతంలో నరసింహన్ గవర్నర్‌గా ఉన్నప్పుడు బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ మంచి సయోధ్య ఉండేది.బిజెపి పార్టీ తరపున క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న తమిళ సైని తెలంగాణ గవర్నర్‌గా నియచించారు. దీంతో ఆమె వ్యవహారాలన్నీ రాజకీయంగానే ఉంటూ వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ కోటా కింద కౌన్సిల్ సభ్యులుగా నియామకానికి ఇద్దరి పేర్లను సిఫారసు చేస్తే గవర్నర్ ఆ పేర్లను తిరస్కరించడం అన్నద ఇ ఈ వ్యవహారంలో పరాకాష్టగా చెప్పకోవాలి. అయితే ఇక్కడ ట్విస్ట్ ఏమంటే గవర్నర్ లేవదీసిన అభ్యంతరాలు రాజ్యాంగపరమైనవి కాకుండా రాజకీయ అభ్యంతరాలుగా కనిపిస్తున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 71(5) ప్రకారం గవర్నర్ కౌన్సిల్‌కు నియమించే వారు సాహిత్యం, సైన్స్, కళలు, సహకార రంగం, సంఘసేవలో ప్రవీణులై ఉండాలి. ఈ నిబంధన ప్రకారం ప్రభుత్వం రెండు పేర్లను సామాజిక సేవ చేసినవారుగా గుర్తించి గవర్నర్‌కు సిఫారసు చేసింది. గవర్నర్ వారిద్దరినీ రాజకీయ నేపథ్యం ఉన్నవారిగా గుర్తించి తిరస్కరించారు. రాజకీయాలతో సంబంధం లేని వారిని మాత్రమే పరిశీలించాలని కూడా ఆదేశించారు. రాజకీయంలో ఉన్నవారు సంఘసేవ చేయడం లేదా? తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించిన వారిని కానీ, ఉద్యమానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సహకరించిన వారిది సంఘసేవ కాదా అధికార బిఆర్ఎస్ ప్రశ్నిస్తోంది. గవర్నర్ అసలు రాజకీయం చేస్తున్నారని మంత్రులు ఇప్పటికే విరుచుకుపడ్డారు. రాజ్యసభకు కూడా రాజకీయ నేపథ్యం ఉన్నవారిని ఎప్పటి నుంచో నియమిస్తున్నారు. ప్రస్తుతం రాజ్య భలో నామినేటెడ్ కేటగిరీలో 10 మంది ఉన్నా రు. అందులో అయిదుగురు బీజేపీకి చెందినవారే. దీనికి రాష్ట్రపతిని నిలదీయాలా లేక సిఫారసు చేసిన మోదీ ప్రభుత్వాన్ని నిలదీయాలా అన్న ప్రశ్నలు వచ్చాయి. నిజానికి అసహజ పరిస్థితులు ఎదురైతే తప్ప రాజ్యాంగబద్ధ ప్రభుత్వానికి అడ్డంకులు సృష్టించటం సరికాదు. గవర్నర్ చర్య రాజ్యాంగస్ఫూర్తికి భిన్నంగా ఉందనటంలో ఎలాంటి సందేహం లేదు. రాజ్యాంగాన్ని రక్షిస్తానని ప్రమాణం చేసినవారే దాని ఉల్లంఘిస్తే, ప్రజాస్వామ్య పక్రియకు అర్థమేమిటని తమిళనాడు సిఎం స్టాలిన్ గట్టిగానే నిలదీసారు. తమ రాష్ట్రానికి ఈ గవర్నర్ రవి వద్దంటూ పోరాడారు. ప్రస్తుత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్ బెంగాల్ గవర్నర్‌గా ఉన్న కాలంలో ఇలాంటి గిల్లి కజ్జాలే సాగాయి. మన రాజ్యాంగం గవర్నర్‌కు కొన్ని సందర్భాల్లో విచక్షణాధికారాలు కట్టబెట్టింది. అయితే ఆ గవర్నర్ కూడ ఆ రాజ్యాంగానికి లోబడే పనిచేయాలి. మొత్తంగా గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలన్న డిమాండ్ ఇప్పుడు సర్వత్రా వస్తోంది. నిజానికి దీనివల్ల దేశానికి పెద్దగా ఉపయోగమేమీ లేదు. ఇటీవలి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎన్నో అంశాలను చర్చిస్తారని అనుకున్నారు. ఇలా గవర్నర్ వ్యవస్థ ఎత్తివేత గురించి చర్చించి వుంటే మోడీకి అన్ని పార్టీలు మద్దతు పలికేవి.

# నాలుగు ట్రిలియన్ల అబద్ధపు ప్రచారం!



అదిగో పులి అంటే..ఇదిగో తోక అన్నట్టు బీజేపీ సంఘ్ పరివార్ దేన్నయినా సునాయాసంగా ప్రచా రం చేయగలరు. వెనకా ముందూ ఆలోచించకుండా ఒకరి తరువాత ఒకరు నేతలు సామాజిక మాధ్య మాలలో అదరగొడతారు. ఇప్పుడు కూడా అదే జరిగింది. జీడీపీ పరంగా భారత్ 4 ట్రిలియన్ డాల ర్లను దాటి వేసిందంటూ బీజేపీ ప్రచారం చేసింది. అయితే ఇదంతా బోగస్ అని తేలింది. ప్రజలను భ్రమల్లో పెట్టటానికి, మీడియా హెడ్‌లైన్లలో నిలవటానికే ఆ ప్రచారం చేశారని ప్రతిపక్ష కాంగ్రెస్ పే ర్కొంది. బీజేపీ నేతల ప్రచారానికి తగినట్లుగానే కేంద్ర ఆర్థికశాఖగానీ, జాతీయ గణాంకాల కార్యాలయంగానీ ఈ వార్తలను ధ్రువీకరిస్తూ ఎటువంటి ప్రకటన చేయలేదు. భారత్ ఇంకా నాలుగు ట్రిలియ న్ డాలర్ల జీడీపీ స్థాయికి చేరుకోలేదని సంబంధిత ఉన్నతస్థాయి వర్గాలు వెల్లడించాయి. దీనిని బట్టి తాము విన్న సమాచారం నిజమో, అబద్ధమో తెలుసుకోకుండా ప్రచార బాకాలు ఊదారు బీజేపీ నే తలు. భారత ఆర్థిక వ్యవస్థ మొట్టమొదటి సారిగా 4 ట్రిలియన్ డాలర్లు దాటిపోయిందన్న పుకారును బిజెపి వర్గాలు ఈ విధంగానే ప్రచారంలో పెట్టారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) సమా చారం అంటూ ఇది బయటకు పొక్కగానే అంతర్జాతీయంగా భారత ఖ్యాతిని పెంచుతున్న అసాధా రణ పరిణామం అంటూ కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 'ఎక్స్' (మాజీ ట్విట్టర్)లో ఒక సందేశం పోస్టు చేశారు. ఆ వదంతి స్క్రీన్ షాట్‌ను జత చేశారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఈయనకు గొంతు కలిపారు. దార్శనికుడైన, చైతన్యవంతుడైన నాయకుని సారథ్యంలోనే ఇది సాధ్య మని ప్రధాని మోడీని ఉద్దేశిస్తూ ఫడ్నవీస్ అందులో శ్లాఘించారు. ప్రధాని మోడీని అ భినందించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా ఇదే పని చేశారు. మనం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు అడుగులు వేస్తున్నాం ఇది మోడీ గ్యారంటీ అని ఆయన పేర్కొన్నారు. ఇంకా మరి కొంత మంది బిజెపి నాయకులూ ఇదే విధంగా ఆత్మస్తుతికి పాల్పడ్డారు. ప్రధాని మోడీని పైకెత్తి వేశారు.ప్రధాని మోడీకి అత్యంత సన్నిహితుడని పించుకొంటున్న గౌతమ్ అదానీ ఈ సందర్భంగా భారత దేశాన్ని అభినందించారు. మరి రెండేళ్ళలో ఇండియా ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ కాను న్నదని ప్రకటించారు. మువ్వన్నెల జెండా అదే పనిగా వెలుగులు చిమ్ముతున్నదని అన్నారు. అయితే ఇందులో ఏమాత్రం నిజంలేదని లెక్కలు చెబుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో దేశం 10.5 శాతం జిడిపి (స్థూల దేశీయోత్పత్తి)ని సాధిస్తే ఆర్థిక వ్య వస్థ 3.7 ట్రిలియన్ డాలర్లకు చేరుకొంటుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే 2024-25లో మా త్రమే మన ఆర్థిక వ్యవస్థ 4.2 ట్రిలియన్ డాలర్లకు చేరుకొనే అవకాశముంది. ప్రస్తుతం అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఇండియా 5వ స్థానంలో వుంది. 4వ స్థానంలో వున్న జపాన్‌ను మించిపోవాలంటే కనీ సం మరి మూ డేళ్ళు పడుతుందని ఐఎంఎఫ్ నిపుణులు చెబుతున్నారు. అలాగే ప్రస్తుతం మూడో స్థానంలో గల జర్మనీని దాటాలంటే ఆ తర్వాత మరొక ఏడాది పడుతుందని అంచనా వేస్తున్నారు. 2027 నాటికి ఇండియా మూడవ ఆర్థిక శక్తిగా ఎదగాలంటే వచ్చే కొద్ది సంవత్సరాల్లో సగటున సాలీ నా 9.19 శా తం వృద్ధిని సాధించవలసి వుంటుంది. 2013-2018 మధ్య 11.8 శాతం, 2019 2023 మ ధ్య 10 శాతం సగటు వృద్ధిని భారత ఆర్థిక వ్యవస్థ సాధించింది. 202324 మొదటి త్రైమాసికంలో ఈ వృద్ధి 8 శాతంగానే నమోదైంది. వాస్తవాలు ఇలా వుండగా వున్నపళంగా 4 ట్రిలియన్ డాలర్లను దాటి పోయామనే సమాచారం ఎక్కడి నుంచి వచ్చింది? దీనిని ఒక యూ ట్యూబ్ వీడియో నుంచి తీసుకొ ని ప్రచారంలో పెట్టినట్టు రూఢి అవుతున్నది. ఎన్నికలు జరుగుతున్న తెలంగాణ, రాజస్థాన్‌లలో ప్ర ధాని మోడీ గొప్పతనాన్ని చాట డానికి ఈ తప్పుడు సమాచార వ్యాప్తి అసాధారణ స్థాయిలో జరుగు తున్నట్టు తెలుస్తున్నది. ఇందుకు సామాజిక మాధ్యమాన్ని విశేషంగా వాడుకొంటున్నారు. ఇంతకు ముందు చత్తీస్‌గఢ్‌లో కూడా ఇదే పని చేశారు. ఇండియా 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకొన్నదని న మ్మించడానికి 190 దేశాల జిడిపి అంకెలను తప్పుడుగా పేర్కొంటూ ప్రచారం చేస్తున్నారని తెలిసింది. నిజానికి, భారత ఖ్యాతి వెలిగిపోతున్న సంపదలో కాదు...పేదలు అత్యధిక సంఖ్యలో గల దేశంగా భారతదేశ ఖ్యాతి మార్మోగిపోతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 81.35 కోట్ల మంది పేదరికంలో మగ్గుతున్నారు. వీరిలో 75 శాతం మంది గ్రామీణులు కాగా, 50 శాతం మంది పట్టణ ప్రాంతాలకు చెందినవారు. 80.48 కోట్ల మందికి ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకాన్ని వర్తింప చేస్తున్నారని ఈ నెల 15వ తేదీ తర్వాత వెల్లడైంది. కాబట్టి ఇంత మంది పేదలు న్న దేశం జిడిపి వృద్ధిలో ఎంత ఎదిగినా పేదలకు ఉపయోగం ఏమిటి?

# మారుతున్న రాజకీయ స్వరూపం !

ప్రశ్నించే గొంతులను వినిపించుకోకపోతే... ప్రజాస్వామ్య ఉనికే ప్రశ్నార్థకమవుతుందని పాలకవర్గాలు గ్రహించలేక పోతున్నాయి.ఈ యేడది పరిస్థితులు,పాలకుల తీరును గమనిస్తే ఇది స్పష్టంగా గమనించ వచ్చు. కేంద్రంలోని బిజెపి కావచ్చు ...లేదా ఉభయతెలుగు రాష్ట్రాల్లోని పాలకులు కావచ్చు..దేశంలోని ఇతర ప్రాంతీయ పార్టీల పాలకులు కావచ్చు..పాలకులుగా ప్రజల ఆందోళనలు అర్థం చేసుకోలేక పోయారు. అందుకు తెలంగాణలో కెసిఆర్ మూల్యం చెల్లించుకున్నారు. తనకు తిరుగులేదని, జాతీయ రాజకీయాల్లో కూడా చక్రం తిప్పుతానని చెప్పి విర్రవీగి చతికిలపడ్డారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పట్టించు కోకుండా ..మళ్లీ మాదే అధికారం అని విర్రవీగిన కెసిఆర్ అహంకారంపై ప్రజలు తిరుగుబాటు చేశారు. గత ఐదేళ్లలో ధరలు దాడి చేశాయి. ఆర్థిక వ్యవస్థ కుదేలయింది. నిరుద్యోగం గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోయింది. స్థూల దేశీయోత్పత్తి జిడిపి బాగా క్షీణించింది. దేశంలోని కార్పొరేట్లు... వ్యాపారులు, భూస్వామ్యులు, బడా విదేశీ పెట్టుబడిదారులు మరింతగా బలపడ్డారు. అంతిమంగా సామాన్యులు బాగా బలహీనపడ్డారు. వీటిని చక్కదిద్దే ప్రయత్నాలు జరగడం లేదు. కేంద్రంలోని బిజెపి మరోమారు అధికారంకోసం అర్రులు చాస్తోంది. తెలంగాణ లో కనీసం పది పార్లమెంట్ సీట్లపై గురిపెట్టింది. మొన్నటి ఎన్నికల్లో కొంతమెరుగైన పరిస్థితిని గమనించి కావచ్చు... బిజెపిలో ఆశలు పుట్టాయి. అందుకే హైదరాబాద్ వచ్చిన అమిత్ షా ఇదే విషయం ఉద్బోధించి వెళ్లారు. ఆశపడడంలో తప్పులేదు. కానీ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చామా లేదా అన్న చర్చ చేయడం లేదు. తెలంగాణలో ప్రజాపాలనకు తెరలేచింది. ప్రజలకు గొంతు విప్పే అవకాశం వచ్చింది. రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం...ప్రజల్లో ఓ రకమైన భరోసా దక్కడం..గత పాలకుల పాపాలు బయటపడం జరిగింది. కానీ ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం దేశంలో వస్తున్న మార్పులను గమనించడం లేదు. ఎదుటి పార్టీలను అణచివేయడం...డబ్బులను పప్పుబెల్లాల్లా పందేరం చేయడంతో తన అధికార పీఠాన్ని పదిలం చేసుకోవచ్చన్న ధీమాతో రాజకీయాలు చేస్తున్నారు. ఎపిలో కూడా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. షర్మిలను రంగంలోకి దింపడం ద్వారా పోయిన ప్రతిష్ఠను పొందాలని చూస్తోంది. ఇది సాధ్యమా కాదా అన్నది మున్ముందు తేలనుంది. అయితే పాలకులు మాత్రం ప్రజలు సమస్యలు తమ ఎజెండాలో లేవన్న స్థిరాభిప్రాయంలో ఉన్నారు. ఇకపోతే మోడీని వ్యతిరేకించే శక్తులు ఏకం కావడం మొదలయ్యింది. ఏకపక్ష నిర్ణయాలతో మోడీ ప్రజాభి ప్రాయాలను తుంగలో తొక్కుతున్నారు. ఇటీవల మూకుమ్మడిగా పార్లమెంటులో ఎంపిల సస్పెన్షన్ బిజెపి అనుసరిస్తున్న నిరంకుశ విధానాలకు పరాకాష్టగా చూడాలి. రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర రాజకీయ ప్రయోజనాలు ఇచ్చిందనడానికి కర్నాటక, తెలంగాణ పరిణామాలు నిదర్శనంగా చూడాలి. ప్రత్యామ్నాయ రాజకీయ ఆలోచనా విధానంపై చర్చకు అవకాశం ఇచ్చింది. ఇండియాకూటమిలో ఎన్ని లుకలుకలు ఉన్నా కాంగ్రెస్ కేంద్రంగా విపక్షాలు కలిసి వెళ్లని పరిస్థితి ఏర్పడింది. ప్రజాస్వామ్యంలో ఎక్కడో ఒకచోట ప్రశ్నించే తత్వం రావాలి. కేంద్రంలోని బిజెపిని ఢీకొనేందుకు వివిధ రాష్ట్రాల్లో ప్రత్యామ్నాయ శక్తులు సమాయత్తమవుతున్నాయి. అయితే పాలనలో ఉన్న వివిధ రాష్ట్రాల్లోని ప్రాంతీయపార్టీలు తమ రాష్ట్రాల్లో నిరంకుశంగా వ్యవహరిస్తూ.. కేవలం మోడీవైపు వేలెత్తి చూపుతున్నాయి. దీనిని కూడా ప్రజలు స్వాగతించరని గుర్తించాలి. నిజానికి స్థానిక ప్రభుత్వాలపై ప్రజలు ధిక్కార స్వరాలు వినిపిస్తున్నాయి.. బిహార్‌లో బిజెపి ప్రభుత్వాన్ని వదిలించుకుని మహాకూటమి సర్కార్ ఏర్పాటు చేసిన నితీశ్ కుమార్ వ్యవహారశైలి కూడా పెద్దగా ఆశాజనకంగా లేదు. ఢిల్లీలో బిజెపి ఉధృతిని అడ్డుకుని పంజాబ్,ఢిల్లీల్లో పాగా వేసిన అరవింద్ కేజ్రీవాల్ మరోవైపు సవాల్ చేస్తున్నా..ఆయన అనుచరులు కూడా పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయారు. తన ప్రాంతీయ పార్టీని జాతీయ పార్టీగా మార్చి కేసీఆర్ కూడా బిజెపిపై సవాళ్లు విసిరి చతికిల పడ్డారు. రాజకీయంగా చూస్తే, గడచిపోతున్న సంవత్సరం అంతా మోదీ సారథ్యంలోని భారతీయ జనతా పార్టీకి పెద్ద విజయాలనే అందించింది. తెలంగాణ మినహా మూడు రాష్ట్రాల్లో అధికార పగ్గాలు చేపట్టారు. ఆయా రాష్ట్రాల్లో సాధించిన విజయాలే 2024లో జరిగే ఎన్నికల్లో బిజెపి తిరిగి జాతీయ స్థాయిలో అధికారం చేజిక్కించు కుంటుందన్న ధీమాలో బిజెపి నేతలు ఉన్నారు. అందుకే బిజెపి తన పూర్తి దృష్టిని ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రీకరించింది. ప్రతిపక్షాలు నరేంద్రమోదీ సారథ్యంలోని బిజెపితో హోరాహోరీగా పోరాడు తున్నాయి. అయినా పెద్దగా విజయం సాధించడం లేదు. 2024 నాటికి కాంగ్రెస్ జాతీయ స్థాయిలో బిజెపితో తలపడేందుకు సన్నద్ధం కాగలుగుతుందని తహతహలాడు తోంది. పదేళ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ బిజెపి ఎందుకో దేశంలోని సామాన్యులను నేటికీ దరిచేర్చుకోవడం లేదు. ప్రధాన సమస్యలపై స్పందిం చడం లేదు. ఆర్థిక సమస్యలను,ధరల పెరుగుదలను పట్టించుకోవడం లేదు. 2024 ఎన్నికలకు జాతీయ స్థాయిలో బిజెపి వ్యతిరేక పక్షాలు ఏ రూపంలో వస్తాయన్నదానికి స్పష్టత లేదు. సిబిఐ,ఈడీలతో పాటు అనేక వ్యవస్థల్నీ బిజెపి పెద్ద ఎత్తున ఉపయోగిం చుకుని ప్రత్యర్థుల్ని నిర్వీర్యం చేస్తోందన్న ఆరోపణలు పెరిగాయి. ప్రతిపక్షాలకు చెందిన ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు, ఇతర నేతలపైనే 95 శాతం పైగా సిబిఐ కేసులున్నాయి. ఇకపోతే ఏడాది చివరలో మరోమారు కరోనాకొత్త వేరియంట్ భయపెడుతోంది. ఇప్పటికీ దీనిపీడ విరగడ అయ్యిందన్న ధీమా రావడంలేదు. ఈ కారణంగా 2023 సంవత్సరం ప్రజలకు ఎలాంటి ఆనందాన్ని ఇవ్వలేదు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వదిలిపెట్టి పాలకులు, పార్టీలో ఎన్నికల్లో గెలవడమెలా...అన్న విషయంలో వ్యూహకర్తలతో మంతనాలు చేస్తున్నారు. ఈ తరహా రాజకీయాలు పోనంతవరకు దేశం బాగుపడదని గుర్తించాలి.

తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం





# పెళ్లి కాకుంటే ఆ హీరోతో డేటింగ్..

అందాల ముద్దుగుమ్మ అనసూయ న్యూస్ రీడర్‌గా కెరియర్ మొదలు పెట్టి, ఆ తర్వాత యాంకర్ గా మారింది. జబర్దస్త్‌తో ఫుల్ క్రేజ్ తెచ్చుకున్న తర్వాత సినిమాలలోకి అడుగుపెట్టింది. 2013లో మొదటి సారి తెరపై కనిపించిన అనసూయ దాదాపు 13 సంవత్సరాల తర్వాత 'సోగ్గాడే చిన్ని నాయనా' చిత్రంలో నాగార్జునతో కలిసి నటించి తెలుగు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. అందులో అనసూయ నటనకి మంచి మార్కులే పడ్డాయి. ఇక అదే సంవత్సరం అనసూయ చేసిన 'క్షణం' చిత్రం కూడా మంచి ఆదరణ పొందింది. ఇక నటిగా అనసూయ స్థాయిని పెంచిన చిత్రం రంగస్థలం కాగా, ఇందులో రంగమ్మత్త పాత్ర ఆమె కెరీర్‌లో మైల్ స్టోన్‌గా నిలిచింది. ప్రస్తుతం టీవీ షోలతోపాటు కొన్ని సినిమాల్లో కీలక పాత్రల్లో నటిస్తున్నారు అనసూయ భరద్వాజ్.అయితే అనసూయ తాజాగా ఓ బుల్లితెర కార్యక్రమంలో తన కెరీర్ గురించి మాట్లాడుతూ టాలీవుడ్ హీరోలపై సరదాగా కామెంట్స్ చేసింది. యాంకర్ రవి, శ్రీముఖి హోస్ట్ చేసిన టీవీ షోలో టాస్క్ ప్రకారం అడిగిన ప్రశ్నలన్నింటికి నిజాయితీగా సమాధానం చెప్పాలి. లేదంటే పచ్చి మిరపకాయ తినాల్సి వస్తుంది అని యాంకర్ రవి, శ్రీముఖి తెలిపారు. దీంతో అనసూయ ఛాలెంజ్ ని యాక్సెప్ట్ చేసింది. ఇక రవి ప్రశ్నిస్తూ మీకు ఒకవేళ పెళ్లి కాకుంటే టాలీవుడ్‌లో ఏ హీరోతో డేటింగ్ చేసేవారు అని అడగ్గా, దానికి ఏ మాత్రం ఆలోచించకుండా రామ్ చరణ్ అని సమాధానం చెప్పింది. అలానే అడవి శేష్ గురించి కూడా కామెంట్స్ చేస్తూ.. శేష్ షూటింగ్ లొకేషన్ లో మిలిటరీ ఆఫీసర్ లాగా స్ట్రిక్ట్ గా ఉంటారు. అడవి శేషు అలా ఉండడం వల్లే క్షణం కానీ, అతని ఇతర చిత్రాలు కానీ విజయం సాధిస్తున్నాయంటూ ప్రశంసలు కురిపించింది. ఇక ఇదే షోలో తన భర్త శశాంక్ భరద్వాజ్ గురించి మాట్లాడుతూ.. ఆయనలో ఉన్న ఒకే ఒక్క నెగిటివ్ క్వాలిటీ షార్ట్ టెంపర్ అని పేర్కొంది. మిగిలిన అన్ని విషయాల్లో తన భర్త మిస్టర్ పర్ఫెక్ట్ అంటూ ప్రశంసలు కురిపించింది. తన పేరు గురించి కూడా ప్రస్తావిస్తూ.. మొదట తన తల్లి తనకి పవిత్ర అనే పేరు పెట్టాలనుకుంది. అందుకే పవిత్ర అనే పేరు కూడా తనకిష్టమని అనసూయ తెలిపింది.

# ఊహించలేని కొత్త పాయింట్‌తో..




అశ్విన్‌బాబు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'వచ్చినవాడు గౌతమ్'. మామిడాల ఎం.ఆర్.కృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని టి.గణపతి రెడ్డి నిర్మిస్తున్నారు. మెడికో థ్రిల్లర్ కథాంశమిది. గురువారం ఈ సినిమా టీజర్‌ను మ్యూజిక్ డైరెక్టర్ తమన్, దర్శకుడు శైలేష్ కొలను విడుదల చేశారు. 'ధర్మం దారి తప్పినప్పుడు, ఏ అవతారం రానప్పుడు, వచ్చినవాడు గౌతమ్..' అంటూ హీరో మనోజ్ మంచు వాయిస్ ఓవర్‌తో మొదలైన టీజర్ ఆసక్తికరంగా సాగింది. హీరో అశ్విన్‌బాబు పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించారు. ఈ సందర్భంగా అశ్విన్‌బాబు మాట్లాడుతూ.. ఎవరూ ఊహించలేని కొత్త పాయింట్‌తో ఈ చిత్రాన్ని తీశామని, ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసే అంశాలుంటాయని అన్నారు. రొటీన్ యాక్షన్ ఎంటర్‌టైనర్స్‌కు భిన్నంగా ఉండే చిత్రమిదని దర్శకుడు పేర్కొన్నారు. ఈ సినిమాకు మంచి టీమ్ కుదిరిందని, సాంకేతికంగా ఉన్నతంగా ఉంటుందని నిర్మాత తెలిపారు. రియా సుమన్, అయేషాఖాన్, మురళీశర్మ, సచిన్‌ఖేడేకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎం.ఎన్.బాల్‌రెడ్డి, సంగీతం: గౌర హరి, నిర్మాణ సంస్థ: అరుణశ్రీ ఎంటర్‌టైన్‌మెంట్స్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: మామిడాల ఎం.ఆర్.కృష్ణ.

# వర్జిన్ బాయ్స్ హంగామా



గీతానంద్, మిత్రాశర్మ జంటగా నటించిన చిత్రం 'వర్జిన్ బాయ్స్'. దయానంద్ దర్శకుడు. రాజ్‌గురు ఫిల్మ్స్ పతాకంపై రాజా దరపునేని నిర్మించారు. ఇటీవల ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. 'నేటి జనరేషన్ రిలేషన్ షిప్స్‌ను ప్రజెంట్ చేసే చిత్రమిది. చక్కటి వినోదం, రొమాన్స్, ఎమోషన్స్‌తో ఆకట్టుకుంటుంది. యువతను మెప్పించే అన్ని అంశాలుంటాయి. పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అని మేకర్స్ తెలిపారు. ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రమిదని, యూత్‌కు రిలేట్ అయ్యే అన్ని ఎలిమెంట్స్ ఉంటాయని నిర్మాత పేర్కొన్నారు. శ్రీహన్, రోనీత్, జెన్నీఫర్, అన్షుల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: స్మరణ్‌సాయి, దర్శకత్వం: దయానంద్.

# సందేశాత్మకంగా జనం




సుమన్, అజయ్‌ఘోష్, కిషోర్, వెంకటరమణ, ప్రగ్య నైనా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జనం'. స్వీయ దర్శకత్వంలో వెంకటరమణ పసుపులేటి రూపొందించారు. ఈ నెల 29న ఈ చిత్రాన్ని రీరిలీజ్ చేయబోతున్నారు. గత ఏడాది నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రానికి మంచి ఆదరణ దక్కిందని మేకర్స్ తెలిపారు. దర్శకనిర్మాత వెంకటరమణ పసుపులేటి మాట్లాడుతూ 'రాజకీయ వ్యవస్థలోని లోపాల్ని చర్చిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. నేటి తరానికి చక్కటి సందేశాన్నందిస్తుంది. ఈ సినిమాలో సుమన్‌గారు పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో నటించారు. సందేశంతో పాటు థ్రిల్లింగ్ అంశాలుంటాయి' అన్నారు.

# అంతా విచిత్రంగా చూస్తే, ఆమె మాత్రం..

సినిమారంగంలో రాణించాలనే కోరిక బలంగా ఉన్నా.. ఆ విషయంలో తల్లిదండ్రులు ప్రోత్సహం మాత్రం తెలుగమ్మాయిలకు అరుదే. కాస్టింగ్ కౌచ్ అనేది అన్ని రంగాల్లోనూ ఉంది. అయితే సినిమా రంగం అనేసరికి భూతద్దంలో చూడటం సమాజానికి పరిపాటైపోయింది. యాక్ట్రస్‌గా రాణించే విషయంలో తెలుగమ్మాయిలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం కరువవ్వడానికి అదికూడా ఓ కారణం. ఈ విషయంలో తనది మాత్రం భిన్నమైన అనుభవమని అంటున్నది అచ్చతెలుగు అందం రీతూవర్మ. 'మా ఇంట్లో అందరూ ఇంజనీర్లు, డాక్టర్లే. మా అమ్మ అయితే.. సొంతంగా స్కూల్ రన్ చేస్తున్నారు. నాకేమో చిన్నప్పట్నుంచీ యాక్టింగ్ అంటే ఇంట్రస్ట్. ఈ విషయం ఇంట్లో చెప్పినప్పుడు అంతా నన్ను విచిత్రంగా చూశారు. కానీ అమ్మ మాత్రం 'వెళ్లు.. ఓ ప్రయత్నం చేయ్' అంటూ ప్రోత్సహించారు. అమ్మకు నాపై ఉన్న నమ్మకం అలాంటిది. కెరీర్ తొలినాళ్లలో చిన్నచిన్న పాత్రలు చేస్తున్నప్పుడు కూడా అమ్మ నన్ను తప్పు పట్టలేదు. నిజంగా ఆమె సహకారం వల్లే ఈ రోజు హీరోయిన్ స్థాయికి చేరుకోగలిగా. అమ్మ నాపై పెట్టుకున్న నమ్మకాన్ని కాపాడుకుంటూ వస్తున్నా. ఇండస్ట్రీలో జరిగే ప్రతి విషయాన్నీ అమ్మతో పంచుకుంటా. సమస్యలెదురైతే వాటిని కూడా అమ్మతోనే షేర్ చేసుకుంటా. వాటికి వెంటనే అమ్మ పరిష్కారం చెప్పేస్తుంది. అమ్మ వృత్తి రీత్యా ఎంత బిజీగా ఉన్నా.. నాకు మాత్రం ఏ లోటూ రానివ్వదు.' అని చెప్పుకొచ్చింది అందాలభామ రీతూవర్మ.



Editer : Gunnala Anil Reddy, Address : Krushi Nagar, Sharelingampalli Mandalam, Ranga Reddy (Dist) Telangana Cell : 9705043131, 8096660656